# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక ఏప్రిల్ 2011 ₹ 20



చుక్కల్లో చుక్క (యాసాల బాలయ్య)

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

- ***Dammapada.***

**సంపుటి 22 ఏప్రిల్ 2011 సంచిక 4**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

అన్నపరెడ్డి బుద్ధఘోషుడు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ

డాక్టర్ జయధీర్ తిరుమల రావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

*సహాయ సంపాదకులు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

ముంగర జాషువ

*రెసిడెంట్ ఎడిటర్*

వల్లభనేని అశ్వినీకుమార్

*సంస్థాపక సంపాదకులు*

రవీంద్రనాథ్ ఆలపాటి



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

Visit us at : www.misimi-monthly.com

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹200

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా* ***మిసిమి*** *పేర పై చిరునామాకు పంపండి.*



మరిన్ని వివరాలకు 64వ పుట చూడండి.


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు ...................................... 3

పదాలు, పథాలూ ఓ పదేళ్ళూ ...................................... 4

– *వేగుంట మోహనప్రసాద్*

ప్రజానాట్యమండలి చుక్కాని – మిక్కిలినేని ................. 11

– *కుర్రా జితేంద్రబాబు*

మరో మొహంజొదారో (నాటకం) ......................... 17

– *మిసిమి*

అతనూ – అతని మనిషీ (నోబెల్ సాహితీ పురస్కారం)....... 21

– *జాన్ మాక్స్‌వెల్ కోయిట్జీ*

ముళ్ళపూడి వెంకటరమణ – నేను ......................... 27

– *సి.ఎస్. రావు*

తెలుగుతల్లి దీవెన (కవిత)...................................... 32

– *సురేంద్ర కె. దారా*

కందువ రేవగలు (కవిత) ...................................... 33

– *సాంధ్యశ్రీ*

చెంగల్వ కాళయ్య ...................................... 34

– *డా. వేదుల రాజేశ్వరిదేవి*

పెళ్లి గోల ...................................... 37

– *కె. రామలక్ష్మి*

కాఫ్కా కోరిక ...................................... 40

– *లయ*

ఊర్వశి ఎవరు? ...................................... 43

– *మిసిమి*

ఆరోహణ – 3 ...................................... 44

– *ముక్తవరం పార్థసారథి*

ఎక్కడ గొట్టో అక్కడ నట్టు (తెలుగు పదాలు)............... 50

– *డా. లగడపాటి సంగయ్య*

బషీర్ కథలు...................................... 54

– *డా. కిన్నెర శ్రీదేవి*

చదవండి (పుస్తక పరిచయం) ...................................... 60

పిల్లి నడకలు! (నవ్వులు)...................................... 62


| | | |
|---|---|---|
| *ముఖచిత్రం* | : ఉగాది | (గూడూరి ప్రభాకర్) (పుట:39) |
| *రెండవ అట్ట* | : చుక్కల్లో చుక్క | (యాసాల బాలయ్య) |
| *మూడవ అట్ట* | : వస్తాడు నా రాజు | (యాసాల బాలయ్య) |
| *చివరి అట్ట* | : అందంగా లేనా | (బి.ఏ. రెడ్డి) |

గడచిన దశాబ్దంలోని వివిధ సారస్వత ప్రక్రియల పరిశీలన చేయాలని సంకల్పించి రచయిత లెందరినో అడిగాము. మొదటగా కవిత్వధోరణుల గూర్చి తమ అమూల్యమైన పరిశీలనా వ్యాసాలను అందించిన వారు వేగుంట మోహనప్రసాద్. మొదటి భాగం ఈ నెల ప్రచురిస్తున్నాము.

'నటరత్నాల'ను తెలుగువారికి అందించిన నటరత్నం మిక్కిలినేని అన్ని జానపద కళారూపాల సమాహారం! వారి నిష్క్రమణకు నివాళి.

తెలుగు పాఠకుల, ప్రేక్షకుల మనసుల్లో నవ్వుల జల్లులు కురిపించిన ముళ్ళపూడి వెంకటరమణ 'కోతి కొమ్మచ్చి' ఆటలో ఎటో వెళ్లిపోయారు.

తన అనుభవాలను, ఆలోచనలతో రంగరించి, ఊహలతో రంగులద్ది సార్వజనీనత సాధించిన బషీర్ తన కథలను వినోద విషాద సమాసాలుగా పాఠకులకు అందించారు.

ఉగాది వచ్చింది, ఎన్నో సమస్యలతో. సమస్య లేకపోతే పరిష్కారమూ ఉండదు కదా! ఇల్లు వదిలిన దగ్గరనుంచి మళ్లీ ఇంటికి చేరేవరకు కనపడని శత్రువుతో పోరాటం సాగిస్తూ అలసిపోతున్న సగటుమనిషికి పండగ రోజే కాస్త ఊరట!

మే నెల సంచిక 'బుద్ధ జయంతి' ప్రత్యేకం. బౌద్ధతత్వాన్ని, సాహిత్యాన్ని ఆకళింపు జేసుకుని తెలుగులో సరళంగా తెలియజేయగలిగిన రచనలు ప్రచురిస్తామని తెలియజేస్తూ ఈ దిశగా రచనలు పంపవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు



*ఉత్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో 'మిసిమి' చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగలిన ఒక ఉత్తరానికి ప్రతినెల మంచి పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!*

✶ "...బెంగుళూరు నాగరత్నమ్మ ప్రస్థావన 'ముద్దుపళని రాధికా సాంత్వనం' గురించి ఎన్నార్కె వ్యాసం చదివి చాలా ఆవేదనకు గురయ్యాను. ముద్దుపళని గురించి కందుకూరి రాసిన భాష, చేసిన సంబోధనలు స్త్రీలను కించపర్చేవిగా వున్నవి. యిట్లా స్త్రీలను హీనపరిచినతన్ని సంస్కర్త అని ఎందుకు చదువుకున్నామా అని బాధ కలుగుతుంది. ఒక రచయిత్రిని 'అది', 'ఇది', 'దీని' అని సంబోధించిన వీరేశలింగంను 'సంస్కర్త' అని సామాజిక చరిత్రలు ఎందుకు మొయ్యాలి? శృంగారం మగవాళ్లు రాస్తే రసస్ఫూర్తి, ఆడవాళ్లు రాస్తే అశ్లీలమనే విలువలపై దండెత్తి యుద్ధం చేసిన బెంగుళూరు నాగరత్నమ్మ చైతన్యం గొప్పది. ప్రచురించిన 'మిసిమి'కి అభినందనలు..." **– జూపాక సుభద్ర.**

✶ "...తెలుగు సాహిత్యానికి తరగని సంపదలా వుంటూ అమూల్యమైన సాహితీ అంశాలను ప్రామాణికంగా ప్రచురిస్తూ అలనాటి 'భారతి' లేనిలోటు తీరుస్తున్న నేటి భారతి – 'మిసిమి' యాజమాన్యం చేస్తున్న సాహితీసేవ వెలకట్టలేనిది. గత 22 సంవత్సరాలుగా సాగుతున్న మీ సాహితీ సేద్యపు ఫలసాయంతో పాఠకులకు చక్కని విందు చేస్తున్న మీకు మనసారా అభినందనలు. ఫిబ్రవరి 2011 సంచిక ముఖచిత్రం మొదలు చివరి చిత్రందాకా అంతా అపురూపంగా అబ్బుర పరిచింది. ముఖ్యంగా 'అన్నం వండాలి' గిరిజన ఆడబిడ్డ చిత్రం నాహృదయ ఫలకంపై చెరగని ముద్రవేసిందంటే నమ్మండి. ఛాయాచిత్రకర్త 'రాజన్‌బాబు'కు అభినందనలు..." **– అమ్మిన శ్రీనివాసరాజు,** చర్ల.

✶ "...'ఫిబ్రవరి' ఫస్ట్‌కే మా ఇంటికి చేరింది 'మిసిమి.' కానీ ఎన్నో ఆవాంతరాలవల్ల వెంటనే చదవలేకపోయాను. ఇపుడు ఈ రాత్రి, కిటికీలోంచి మీదపడుతున్న వెన్నెల మరకల మధ్య 'మిసిమి'ని ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ ఎంత అనుభూతి! 'విలియమ్ వాటర్‌హౌస్' 'లేడీ ఆఫ్ షలాట్' అద్భుతంగా వుంది. 'మిసిమి' కి పదారో వన్నె, పెయింటింగ్స్ కదా! రోలెట్టీ, విన్సెంట్ వాంగో – జేమ్స్ టర్నర్ మొదలగు వారిని ఇంకా ఎన్నో ప్రచురిస్తారు కదూ? ఆ అరిగిపోయిన వృద్ధకవుల కవితలెందుకండీ? నూతన యువకవుల పురవడీ, ఒరవడీ మీకు నచ్చదా? ఏదిఏమైనా సాహిత్య విలువలువున్న మరో 'భారతి' వస్తున్నందుకు చాలా – చాలా థ్యాంక్స్!..." **– డా. శ్రీభాష్యం రాంబాబు,** గొడవర్రు.

✶ "...నేను జనవరి నెల 'మిసిమి' మా రచయితల సంఘంలో చదివాను. 'చింతనాత్మక సారస్వతం' అన్న విశేషణం మిసిమికి ఎంతగానో తగియున్నది. బెంగుళూరు నాగరత్నమ్మ, నాగాంబ, ఇంకా అనేక వ్యాసాలు సాహిత్యరంగానికి కొత్తకాంతులు పంచి పెట్టేయి. అయితే కథలు ఒక్కటి కూడా లేకపోవడం నావంటి కథకుల్ని ఒకింత నిరుత్సాహానికి గురిచేశాయి. కొత్తపుంతలు తొక్కిన తెలుగు సాహిత్యానికి దీపంలాంటి కథ కూడా ఉంటే బాగుండేదేమో..."

**– పుష్పాంజలి,** మదనపల్లి.

# పదాలు, పథాలూ ఓ పదేళ్ళు...

- 'మో'

**కొ**త్త శతాబ్దంలో మొదటి దశాబ్దం గడిచిపోయింది. ఈ కాలంలో తెలుగులో కవితలల్లిన కవుల గురించి - వారి కవిత్వ ధోరణుల గూర్చి వేగుంట మోహనప్రసాద్ విపులమైన పరిశీలనా వ్యాసం మొదటి భాగం అందిస్తున్నాము.. మా అభ్యర్థన మేరకు ఆయన వందకుపైగా సంపుటులు, సంకలనాలను శోధించి, నూటయాభై మంది కవుల తత్వాన్ని పరామర్శించి, విశదీకరించిన వైనం ఎంతైనా ప్రశంసనీయం. 'మిసిమి' పాఠకులను ఆలోచింపజేసే వీరి అవలోకన ఆహ్వానించదగినది.

**ఆ**ధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత విరివిగా కొనసాగుతున్న రచనా ప్రక్రియ వచన కవిత్వం. గత దశాబ్దిలో వచన కవులు వందలాదిగా కన్పిస్తున్నారు. కవిత్వం రాయటం చాలా తేలికయిన పనైపోయినట్టు కన్పిస్తుంది. కవులందుకునే చులకనైపోతున్నారు.

కవిత్వానికి పాఠకుల సంఖ్య – ఒక అంచనా ప్రకారం సాహిత్య పాఠకులలో – 0.04 మాత్రమే. ఇది టైమ్స్ ఆఫ్ ఇండియా జనవరి 2011 నాటి లెక్క. ఈ లేశ మాత్రపు సంఖ్యలో కవులు కూడా ఉన్నారు.

ఇటీవలి కవితాస్వరూప స్వభావాన్ని ఆకళింపు చేసుకోవాలంటే రెండు పద్ధతులున్నాయి. అచ్చైన ప్రతి కవితనూ చదువుకుంటూ పోవటం ఒక పద్ధతి. రెండోది, ప్రత్యేకించి, ఒక్కొక్క కవినీ సమగ్రంగా పరీక్షించటం. విడివిడిగా కవితలనయితే సంకలనాలవంక చూడాలి. పూర్వం **కళాకేళి, వేకువ, సంతకాలు, చైతన్యకవిత** లాంటి ప్రత్యేక సంచికలొచ్చేవి. ఓ రెండు సంవత్సరాలనుండి 'కవితా!' మాసపత్రికను విశ్వేశ్వరరావు తెస్తున్నాడు. 2004 నుండి ప్రతి ఏడాది మేడేనాడు **కవిత** సాహితీ మిత్రులద్వారా ప్రచురింపబడ్తోంది. వరంగల్ 'సృజనలోకం' **కవితావార్షిక** గ్రంథాల్ని వెలువరిస్తోంది. పూర్వం **'అమ్మ'** సంకలనంలానే **'నాయిన'** అనే ప్రత్యేక సంపుటిని కూడ తెచ్చింది. నిన్నగాక మొన్ననే **'అనేక'** అనే పదేళ్ళ కవిత్వం **అఫ్సర్, వంశీకృష్ణల** సంపాదకత్వంలో మన చెంతకు చేరింది.



విశ్వేశ్వర రావు




తెలంగాణ కవులు మాత్రమే తెలంగాణ కోసం మాత్రమే రాసిన కవిత్వం జూలూరి గౌరీశంకర్ **'పొక్కిలి'** అని తెచ్చాడు. దీనికి ముందు, అతనే చేసిన మరొక మంచి పని **వెనుక బడిన కులాలు** (వెంటాడే కలాలు), **రైతుకవిత** 2004లో వచ్చింది పాపినేని పీఠిక, బిబ్లియోగ్రఫీతో.

అవును. కవిత కాలనాళిక. ఈ కాలనాళికలో ఏం రాసి పెట్టి ఉందోనని 2010 డిసెంబరు 31 నాడు అందరూ ఉత్కంఠతో ఎదురు చూచారు. ఎన్నో ఆకాంక్షలూ, అతిశయాలూ అభిశంసనలూ అంతదాకా. కానీ ఇంకా నిరీక్షించాల్సి వచ్చింది. పరస్పరారోపణల మధ్యనే. "About December 1910 human nature changed" అని వర్జీనియా ఉల్ఫ్ రాసి పెట్టింది –ఓ వంద సంవత్సరాలయింది మళ్ళీ. మానవ ప్రవర్తన మళ్ళీ మారుతూనే ఉంది. ఇటీవలి సంఘటనలు చూస్తుంటే.

వేగుంట మోహనప్రసాద్, ఫోన్ : 9346736726




మాటలో మనసు కలపాల్సిన కవులు, పదం, పాదంతో ప్రపంచ పథాన్ని కొలవాల్సిన కవులు ఇప్పుడు 'వంకర తిరిగిన వెన్నెముకల్తో' వెనక్కో ముందుకో నడుస్తున్నారు. విడివిడిగా. సమస్య లిద్దరివీను. సెజ్‌లు, గనులు, దొంగ కాంట్రాక్టులు, జల యజ్ఞాలు, స్విస్ బాంకులూ, కులాంకలీల మెలాంకలీలు, మతాల దార్శనికతలలో అంతర్లీనంగా ఉన్న ద్వంద్వాలు, వర్గీకరణలు, నల్లధనం, పార్టీల ఫిరాయింపులూ లాంటి సామాజికాంశాలు ఇద్దరికీ చెందిన సమస్యలే. వీటికి తోడు అంతర్జాతీయ పెను పరిణామాలు, ప్రపంచీకరణ, సరళీకృత వ్యాపార వాణిజ్యాలు, వలసలు, పర్యావరణ ప్రమాదాలు అన్నీ అందరికీ సంబంధించిన ఇతివృత్తాలే. ఒకవేపున ప్రజాస్వామ్యం ప్రభువుల కబంధ హస్తాల్లోనికి ఇరుక్కు పోతూంటే దానిని విడిపించడానికని విప్లవ మార్గాల ఉక్కు పిడికిళ్ళు. రాజ్యహింసని హింసతోనే ఎదుర్కోవాలనే పోరాట ప్రమాణాలు. అంతటా అలజడి, ఆందోళన. ఇంత సంరంభంలోనే శ్రీశ్రీ శతజయంతి సభలు ఊరూరా. ప్రత్యేక సంచికలు ప్రతిచేతిలో. శ్రీశ్రీ సర్వసమగ్ర కవితా, కదంబ, కథా రచనల మూడు సంపుటాలు. అట్టహాసంగా, వందలాది ముద్రారాక్షసాలతో. చలసాని ప్రసాద్ చేసిన పరిశోధన అక్షర మాత్రం కూడాలేకుండా! ఒక ఎడిటింగ్ లేదు, పాడూ లేదు. యేటిమీద నీటిని చల్లినట్టు ఇదంతా వృధావ్యధ!! పునశ్చరణగా 'బైరాగి' సర్వసమగ్ర సంపుటాలూ పునర్ముద్రణ. వరవరరావు సర్వ కవితాసంకలనం నేను చూడలేకపోయాను ఈ వ్యాసం నాటికి.

**సంకలనాలలోంచి కొత్త కవులు :**

కవి అన్నవాడు ముందుగా తన అస్తిత్వ నిరూపణ కోసమే కలం పట్టాడు. వ్యక్తి అస్తిత్వం తర్వాతనే కులం, వర్గం, మతం ఆపై మొత్తం సమాజపు అస్తిత్వభావాన్ని పట్టుకొంటాడు. పదచిత్రంద్వారా ప్రతీకద్వారా అస్తిత్వనిర్వచనం జరుగుతుంది. నాదం అందరికీ చెందినపుడు నినాదం అవుతుంది. కొన్ని పదచిత్రాలు చూద్దాం.

- **ఆకాశంలోని చంద్రుడు,**
  **ఏ బావిలోకి వురితాడు దించుతాడో తెలియదు**
  – *(శ్రీరామకవచం సాగర్)*

- **తెర సగంలో వుంటుంది / అది దిగుతోందా**
  **లేస్తోందా?** – *(దేశరాజు)*

- **నువ్వు తాగుతున్న గ్లాసులో**
  **నా నెత్తురింకి వుందేమో చూడన్నా** – *(అఫ్సర్)*

- **రూపం ఒక దెజావూ / సారమూ ఒక దెజావూ**
  **కొత్త దనమంటే ఒక చావు** – *(ప్రసేన్)*

- **నన్ను వివస్త్రను చేసి నా దేహాన్ని కప్పుకో**
  – *(దోర్నాదుల సుబ్బమ్మ)*

నేతన్న ఆత్మహత్య, ఓ సందిగ్ధ సందర్భం, నీటివనరుల పంపిణీ, ఒక నిరీహ, లైంగిక సమత్వం – వీటికీ పంక్తులు సూచికలు.

కలగాపులగపు విలయావర్తపు పదచిత్రాలకు ఒక చిన్న ఉదాహరణ 'నిస్పృహ' అనే దీర్ఘ కవిత (పారగ్రాఫ్)లోంచి–

"మొండెంలేని అక్షరాల రక్తదాహంతో, దిసమొలతో వాక్యాల్ని తడుపుతున్న లజ్జతో, ఖండిత మనో అంగాల కలవరింతల్తో, ఇంద్రజాలమో, ఇంద్రియజాలమో, ఇంగిత ద్రోహమో, బొజ్జోపెట్టు, భోజనాలు పెట్టు, భక్తి పెట్టు, పాటలు పెట్టు, వెన్నెముకల కులకలల్ని చీల్చిపెట్టు, ప్రజా ప్రసాదాల్తో నర్తించు, అడ్డొస్తున్న చెవుల్లో జోలపాడు, నాటకీకరించు, నాలుకల కలలకి పిండ ఆందోళనలు కల్పించు, సౌఖ్యమైన ...జ్ఞాపకాల్ని ఇవ్వు" **(ఎం.ఎస్.నాయుడు).**

నిశితంగా చదివితే ఇందులో సమాజంచేసే మాయా జాలమూ కన్పిస్తుంది. పదవైరుధ్యాలతో వాక్య నిర్మాణం చేసే కవి మాయాజాలం వల్ల ఓ విస్తృత భావనా ప్రపంచం ప్రదర్శితం.


**ఎన్. వేణుగోపాల్.**

ఒక విరసం సభ్యుడు వ్యక్తిగానూ, సంఘంలోని ఒక శక్తిగానూ ఎలా ఘర్షణ పడుతున్నాడో, ఎలా వ్యధ పొందుతున్నాడో కన్పిస్తుంది. ఆ కవి విరసం బహిష్కృతుడు **ఎన్. వేణుగోపాల్.**

- **అమ్మా అమ్మా రావూ మళ్ళీ చెయి అందించవూ**
  **జ్వలిత లలిత కరుణామహితా**
  **ఈ తప్పు కాయవూ...** *(కవితా! 8)*

- **ఎప్పుడో నిన్ను నువ్వు**
  **ముళ్ళ కంచె మీద ఆరేసుకున్నావు**
  **ఇప్పుడు తోసినా ఉంచినా చిరుగు చిరుగే** – *(కవితా! 15)*

తల్లి హస్తం లాంటి విరసం చివరికి ముళ్ళకంచె అయింది. ఇదీ సమాజంలో కవి చేసే ప్రయాణం.

మాండలికంను అద్భుతంగా వినియోగించుకొన్న కవిత **'కసింత గుండె దిటం సేసుకోవాలి.'** రచన **గంటేడ గౌరు నాయుడు.** తల్లి మాటల్లోని అనునయం, జీవితం మీద మళ్ళీ ఆశ చిగురింప చేయటం, సామెతలతో జీవిత పాఠాల్ని చెప్పటం ఎంత ఆర్ద్రంగా వర్ణించాడో ఈ కవి!

**ఔన్రా బావ్...**
**నువ్వే యిలగైపోతే...నీ దారి నువ్వు సూసుకుంతానంతే**
**ఆడకూతురు... అదేటైపోవాల!**
**ఎర్రి నా కొడకా... ఏటలగ మనసొగ్గెత్తావు**
**కోడల్ని సూడు**
**కాళ్ళుట్ల కోడిపిల్లల్లాగ తిరుగాడతన్నారు, పిక్కరోల్ని సూడు,**
**తిన్నగ తొంగోని ఆలోసించి సూడు**
**నువ్వులేని ఇంటిని కళ్ళముందుకి తెచ్చుకో ఒక పాలి**
**గిన్నొట్టుకోని గెంజినీలకి ఇరుగింటికి పొరుగింటికి ఎల్లే**
**నీ ఇల్లాలు కనబడతాది**
**సెయ్యి సాపుకొని యాదీది తిరుగాడే నీ పిల్లలవుపడతారు**
**అది నీకు మరియాదా సెప్మి!**
**ఓరుసు కోవాల, ఒరిత్తే కోడిగుడ్డు సట్టిడు.**

సినిమాలకు అద్భుతమైన గీత రచనలు అందించిన **సి.నా.రె.** వచన కవిత్వరచనలో శిల్పాన్నింకా యువకవుల నుండి నేర్చుకొంటూనే ఉన్నానన్న ఆయన సహృదయత హర్షించతగ్గదే. క్లుప్తంగా, ఆప్తంగా విన్పించే కొన్ని పంక్తులు-

- **"దూదికంటే తేలికై పోయింది జీవితం**
  **కాటేసేదాకా తెలియలేదు**
- **తెల్లని పత్తి మాటున నల్లని మృత్యువుందని"**

*(గదిలో సముద్రం)*

- **"తొణకడంలో ఒక అందముంది**
- **అది మధు పాత్రయినా మనసైనా"**
- **"ఏదీ ఆ నది?**
- **నా ఆ బాల్య మైత్రీనిధి?'** *(కవిత-2004)*

ఎవరి గతాన్ని వారు స్వగతంగా విన్పిస్తోన్న కొన్ని గొంతులు

జూపాక సుభద్ర - 'తాటి కమ్మల సావు దప్పులు'
అన్నం దేవేందర్ - 'అతకని పోగు'
సూరి - 'మాదిగ పిల్ల'
ఖాజా - 'ఏకులు వడికే ముసలమ్మ'
ఎండ్లూరి సుధాకర్ - 'వెన్నెల గుర్రం'
నారాయణస్వామి - 'ఎదురు చూపు'
హనీఫ్ - 'తెగిన ఏక్ తార'
షేక్ కరీముల్లా - 'అస్సలాం అలైకుమ్'
స్కైబాబ - 'సూఫీ దేవుడు'
నాళ్వేరం శంకరం - 'పితృవాక్యం'

నిర్మాణ పరంగా చూస్తే - **కొండేపూడి నిర్మల** కవిత **'వానా - బురదా.'** కవిత్వంలో ధ్వని ప్రాధాన్యాన్ని సూచించే కవిత. వ్యంగ్యం కూడ ప్రధానమైన ఉక్తి చిత్రణే ఈమె కవిత్వంలో. హెచ్.ఐ.వి హైకూలని రాస్తూ -

**"శీలం ఒక బలహీనమైన దీపం**
**తలుపు మూస్తే ఊపిరాడదు**
**తెరిస్తే గాలికాగదు..."** అంటుంది.

ఆరాధనలో, సంగీత స్రవంతిలో, భక్తిలో శాంతిని కోరుకుంటూ ప్రస్తుత సమాజంలో శాంతి కాంతి లేమిని చూచి ఆవేదన పొందుతూ అన్నమయ్య 600వ పుట్టిన రోజుని పండుగ చేసుకొంటూ **జయప్రభ -**

**"ఒకే ఒక శరీరం దొరికింది గానీ....తస్సదియా**
**విస్తరించ నివ్వదయా"** అంటూ నివేదిస్తోంది.

"తస్సదియా' (తస్సదియా అంటే కుళ్లిన మాంసము) అనే ప్రాపంచిక ఈ కవితకు ప్రాణం.

ఒకే ఒక ప్రతీకను ఎన్ని విధాలుగా, ఎన్ని సందర్భాలుగా వినియోగించవచ్చో, చిత్రించవచ్చో చెప్పే శిల్పసౌందర్యం ఉన్న కవిత చదవండి - **విమల** చిత్రించిన

- సముద్రంలా చందమామ!
- ఎర్రటి చందమామ
- నల్లటి చందమామ
- వడలిన రొమ్ములా చందమామ
- సత్తురేకులా చందమామ
- కనుపాపలా చందమామ
- ఎన్ని ఉపమానాలో!

ఈ కవితలో ఉపమాన, ఉపమేయాలన్నీ సహజంగా వచ్చినవే గానీ, వ్యూహాత్మక నిర్మాణపరమైనవి కావు.

'ఆంధ్ర, తెలంగాణ సమస్య' అనే వర్తమాన వైక్లబ్యం మనుషుల్ని, ముఖ్యంగా ప్రేయసీ ప్రియుల్ని కూడా ఎలా విడదీస్తుందో కథనాత్మకంగా సంభాషణా రీతిలో ఎలా రిపోర్ట్ చెయ్యవచ్చో అతి నవ్య కవి **ఊడుగుల వేణు** ఫోటో గ్రాఫిక్‌గా చూపించాడు- తన కవిత **"ఓ ప్రాంతీయ లవ్ స్టోరీ"**లో. హైద్రాబాద్ 2007లో మొదలయిన ఆంధ్ర ప్రేయసి ప్రణయం, హైదరాబాద్ 2009లో "సాలా... ఖేల్ ఖతమ్ దుఖాన్ బంద్" అంటోన్న తెలంగాణ ప్రియుడి మాటల్లో.

**వెనకబడిన కులాలు:** ఈ పదేళ్ళలో వచ్చిన కవితలో ఏక సూత్రత ఏదన్నా ఉన్నదీ అంటే అది విభిన్న కులాల, వృత్తుల కవుల సాంప్రదాయక జీవనంలోని ఆందోళన, ప్రాంతీయత నుండి స్థానికత దాకా కొనసాగిన తన, పర అస్తిత్వవాద అలజడి. దైన్యం నుంచి ధైర్యానికి కొనసాగిన ప్రయాణం. ఇది ఆత్మరక్షణ కవిత. దళిత కవుల నుంచి ఈ ఆత్మరక్షణ. ఇది బి.సి. కవిత, దళితోద్యమపు బి.సి. నుండి ఎ.డి.కి నడిపించిన కవిత. 23 మంది కవులు ఒకే సంపుటిలో కన్పిస్తారు, వారి వారి చైతన్యంతో-ఐక్య చైతన్యంతో. వ్యక్త నిర్మాణం-గుప్త నిర్మాణాల సంక్లిష్టతను దృష్టిలో ఉంచుకొని, రజక, క్షురక, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, జాలరి, భోగిని, జోగిని, దేవదాసి, కమ్మరి, కుమ్మరి, గొర్రెల కాపరి, యాదవ, లంబాడీ, గౌడ, ఎరుకల, డెక్కల, వడ్డెర ఇలా ఎన్నో కులాలు-ఎన్నో కలాలు-కొన్ని బలమైన గొంతులు:

**"ఏటి చివర మనసు ఎరవేసి కూర్చున్న"** అంటున్నాడు **అంబటి వెంకన్న.** గంగపుత్రుల జీవనంలోని వృత్తిపదాలు వల, తాన, జగ్గ, గడ్డ, పొల్క, తోపె, సార్క, గంగతిప్పు, గంగబోనం - చాలా మందికి తెలియనివి.



రజిత

తెలంగాణాలోని దొరసానీత్వం గురించి **అనిశెట్టి రజిత** కవిత **'దొర్సానీ ఓ దొర్సానీ'** ఒక చెంప పెట్టు.

ఆంధ్రలోని దేవదాసీ, తెలంగాణాలోని జోగినీ ఇద్దరిదీ ఒకే గొంతు. **ఎ. దుర్గాప్రసాద్ 'నా కులపు కన్నీరా!'** అని 'ప్రసవంలోనే గాయంగా" పుట్టింది జోగిని అంటున్నారు.

**"ఈ సమస్త విశ్వం తిరిగేది**

**మీ కంసాలోళ్ళ కుంపటి చుట్టే"** అని నిర్వచించిన **బాణాల శ్రీనివాసరావు** తన కవితల్లో దూదేకుల వాళ్ళనీ, సాతానోళ్ళనీ, వడ్డా బత్తుల్నీ కూడ ప్రత్యక్షం చేస్తాడు.

కవిత్వంలో యాంత్రిక మార్మికతనూ, లైంగిక తాంత్రికతనూ విశృంఖలంగా వాడిన కవి **దెంచనాల శ్రీనివాస్.** ఇతనో సంచారి. **"ఒక్క నువ్వే నాకు కోటి నేనులు నీకు"** అనే సుదీర్ఘ పారాగ్రాఫ్ కవితలో అతని తండా జీవితం, లంబాడీ అస్తిత్వం, మాల, మాదిగల, గోండు, కోయల, డెక్కలు, ఎరకలు, గొల్ల, మంగలులతో నెలలు నెలలు తిరుగాడిన అతని నిజజీవితం ఒక కన్ఫెషన్‌లాగ, దిగంబరంగా ధ్వనిస్తుంది. పాఠకుణ్ని భయకంపితం చేసే ఇలాంటి కవితలు అనింద పూర్వమ్. వాస్తవాన్నించి నాటకీయతకు, స్వీయారోపణ నించి నేరాంగీకారానికీ ఇతని ప్రయాణం. అంతా అధివాస్తవిక వాక్య వినిర్మాణాల్లో. ఒక కాఫ్కా, ఒక డాలీ, ఒక ఎల్వా దాకా లాక్కెళ్తాడు పాఠకుడ్ని.

మంగలి అంటే మంగళం కోరుకొనే వాడు. రిలయన్స్ వాడు ఈ వృత్తిలోకి దిగడు గానీ, వ్యాపారం చేసుకోడానికి వెనుకాడడు. మంగళం మహత్ అంటాం మనం పైపైకి. మంగళ స్నానాలు చేయందే మన షోడశ కర్మలు పూర్తికావు. ఇలాంటి వృత్తిపై **జి. విజయలక్ష్మి** రెండు గొప్ప కవితలు రచించారు. కొన్ని పద ప్రయోగాలు చూడండి - మంగలిలో కొండమంగలి; నాయీ బామ్మడు; ఉరిమురివి మంగలాన పడ్డట్టు; తలకాయమీన తకదిత; మీసాలకి సెమట; సంపెంగ నూనె; సన్నాయి నొక్కులు; తాటాకు పీక; గోరుగొల్లు; మంగలోన్ని చూసి దున్నపోతు కుంటుతుంది; పొదిలో కత్తి; పొదిలి పెట్టి; మీ ఆడబిడ్డ ఆరంబోతమ్మ; మీ రోమాలు...

వృత్తిపద నిఘంటువులలో లెక్కకెక్కని విశ్వకర్మ పనిముట్లని **జుగాష్ విలీ** పరిచయం చేస్తున్నాడు - ముక్కోణపు ఆకురాయి, బద్దాకురాయి, గజ్జెల దిమ్మ, తీగల కమ్మెచ్చు, జవగారు, పోగర్లు, రుంజ, ఊదుడు గొట్టం, పటికరాయి;

స్వీయజీవితాన్నే , స్వీయ చరిత్రనే - శవముందు శంఖం ఊదే జంగమదేవర కులం నేపథ్యం లోంచి వచ్చిన **నాళేశ్వరం శంకరం** కవిత్వంలో శంఖధ్వని విన్పిస్తుంది. **"శవం చుట్టూ చేరి హోరెత్తి ఏడ్చే వాళ్ళని చూసి నాకు దుఃఖం వచ్చేది."** భిక్షాటనలో భగవద్గీత ఇతని కవిత్వం.

**ననుమాసస్వామి** తన జీవితానుభవాన్ని సత్యస్ఫోరకంగా చెప్పాడు. "చిన్నప్పుడే నాదేహాన్ని మంగలి కత్తుల పొది నుంచి తీసివేసి పెంచిన అమ్మతో కలిసి చాకిరేవు నయాను", అని.

ఓ నేత కార్మికురాలి దుఃఖ శాపం **పులిపాటి గురుస్వామి** గొంతులోంచి ఇలా విన్పిస్తోంది -

**"తెల్లారి పొద్దూకె / వయసంతా మగ్గం గుంటలో ఇంకి పాయె/ సూపుకు దారం తక్కువాయె / దేవునింట్ల పీనిగెల్ల"**

మహార్ కుల (మహా+అరి) గురించీ మహాత్మాఫూలే గురించీ కనువిప్పుచేసే రచన చేసిన **ప్రసాదమూర్తి** చేయి విరిగిన వృత్తుల జ్ఞాపకాల బట్టల పోగుని మోసే సాలె వాని కులదైవం భావనారుషిని కూడ  మనకు గుర్తు చేస్తున్నాడు.

**ప్రసేన్** తన "కులాంకలీ" మెలాంకలీని విన్పిస్తూ, 'అందుకే నాకు భోగం వేషాలంటే ఇష్టం...చాలా ఇష్టం.... నేను వాడకర్ణుడిని...." అని వెల్లడిస్తాడు.

ప్రసేన్ 'కులాంకలీ' అని అంటే, సీతారాం 'కులంకారీ' అనే పదాన్ని సృజించాడు. **సీతారాం 'రెజ్యూమ్'** అనే బయోడేటా కవిత నిర్మాణపరంగా అనితర సాధ్యమై నటువంటిది. హాస్యం, వ్యంగ్యం, ధ్వని, కరుణ, క్రోధం అన్నీ ఏకకాలాన అనుభూతింప జేసే మహాద్భుతమైన 'రసన' ఇది.




**ఖాదర్ మొహిద్దీన్ 'పుట్టుమచ్చ'** కవిత కొచ్చిన గుర్తింపు ఇతరేతర కారణాల వచ్చిందనే విమర్శ ఉన్నప్పటికీ 'పుట్టుమచ్చ'ను మించి పోయిన కవిత **సీతారాం 'రెజ్యూమ్'**. ప్రయోగాత్మకత, ప్రయోజనాత్మకత రెండూ కలసిపోయిన 'అపూర్వ సమ్మేళన కళాప్రక్రియ ఈ రచన.

**'రైతుకవిత'** – కులం లేనివాడెవడైనా ఉన్నాడంటే అతడు రైతు ఒక్కడే, రైతు కూలీ ఒక్కడే. అసలిక రైతు అనేవాడుంటాడా? నేతన్నలానే రైతన్నలూ పురుగు మందులు తాగుతున్న కాలమిది. అదృష్టంకొద్దీ కొందరైనా బతికి బట్టకట్టటం వాటిలోని కల్తీవల్లనే. వ్యవసాయం మట్టిపాలై పోతూంది. నాగలి శిలువై పోతూంది. గ్రామాలు రూపుమాసి పోతున్నయ్. పల్లెలోని పదెకరాలకంటే నగరంలోని ఒక అపార్ట్‌మెంట్ వెల ఎక్కువ. రైతు జీవితానికి అనుబంధమైన కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, రజక, క్షురక జీవనవృత్తులు అన్నీ అంతరిస్తున్నయ్. ఈనాడు ఏ కవైనా "ఒలియో ఒలియో పోలియో పొలీ రావేలు గలవాడ రారా పొలిగాడా" అని మళ్ళీ పాడగలడా? "ఏటికేతా మెత్తి యెయి పుట్లు" పండించానని గర్వంగా చెప్పగలడా? హాలికుడిని గురించి, కృషీ వలుడిని గురించి, ఏరువాక గురించి, క్షేత్రలక్ష్మి గురించి, పైర పంట గురించి రాసిన దువ్వూరి, కొసరాజు, ఏటుకూరి, తుమ్మలలాంటి కవులున్నారా ఇంకా? పల్లెటూరిని తల్లిగానూ, పాలేరుని చుట్టంగా అభివర్ణించారు తుమ్మల. ఈనాడు ఉమ్మడికుటుంబాలే అంతరించినయ్. ఇక తల్లెవరు, బంధువెవరు!


**శివశంకర్**

ఈ నేపథ్యంలో ఆధునిక కవికి మిగిలిందల్లా గతాన్ని కథలుగా వైన వైనాలుగా చెప్పే పెద్దల జ్ఞాపకాలే. **పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు, ఎమ్వీ రామిరెడ్డి** సంయుక్తంగా సంపాదకీయం వహించి ప్రచురించిన సంకలనం **రైతు కవిత**. ఈ సంపుటిలో 75 కవితలున్నై. దీర్ఘకావ్యాలైన **'ఆకుమడి'** (ఎం.ఎస్. సూర్యనారాయణ), 'ముంతపొగ' (యార్లగడ్డ రాఘవేంద్రరావు), **'పొలికేక'** (సుదేరా), **'దుక్కిచూపు'** (కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి), **'నాగేటి చాలుకి నమస్కారం'** (గంటేడ గౌరి నాయుడు), **'పొలి'** (రాచపాలెం) ముఖ్యంగా పేర్కొనదగ్గవి.

**రాచపాలెం** "పొలిలో 'బలి' అనివార్యం." అన్నారు. అవును నిజం. ఒక్క గంగజాతరలోనో, ఒక కాటమరాజు గుడిదగ్గరనో, మేకపోతునో, పొట్టేలునో, దున్నపోతునో కాదు బలి ఇచ్చేది, ఈనాడు రైతుని. పాలకులిచ్చే బలి శ్రేయోరాజ్యం, హరిత విప్లవం అనే అందమైన మాటల మాటున.

వ్యవసాయం సామాజిక కళ అని చెప్పే కొన్ని పాదాలు (గ్రంథాంతాన 32 వ్యవసాయశాస్త్ర పదసూచికలూ ఇచ్చారీయన.

- నారుకయ్య
- పచ్చులు పొదిగిన చిరుచాప
- మట్టిని మీగడగా మార్చే క్రీడ
- నా దున్నపోతుల మడక
- అదొక మడకల రైలు బండి
- చేతుల్ని దువ్వెనల్ని చేసి
- నేలకు చిక్కు తీసినట్లు
- వరిపైరు జానపదరాణి

**తెలంగాణ కవిత్వం: గోరంటి వెంకన్న** 'పల్లె కన్నీరు పెట్తొన్నదిరో' అనీ, 'పొక్కిలి చేసి దుఃఖిస్తున్నదిరో' అని

విలపించాడు. జూలూరి గౌరీశంకర్ గ్రహించి గొప్ప సంకలనాన్ని గుడిపాటి ముందుమాటతో ప్రచురించాడు 2002 (**'పొక్కిలి'** అనేపదం శ.ర.లోకి ఎక్కనిపదం)లో. సురవరంవారి గోలకొండ కవుల సంచికలో 1934 నాటికి 354 కవులుంటే ఈనాటి **'పొక్కి'**లిలో 129 కవులున్నారు. మచ్చుకి తెలంగాణ పల్లె చిత్రాలు ప్రతిభావంతంగా కన్పించే కొన్ని పాదాల్ని మాత్రం చూద్దాం.

1. కదులుతున్న ఉరికంబం నావూరు
2. యిప్పటికీ బందగీ శవమ్మీద పడి యేడుస్తున్నాయి పల్లెలు
3. పోరాటాల పురిటిగదది నా పల్లె
4. ఊరు పీనుగుల పెంట
5. ఏ ఇంట్లో చూసినా దీపం లేదే
6. ఈడు బోయిన చేనులా నా వూరు
7. సొమ్మసిల్లిన సోమాలియా
8. నా పల్లె తల్లి వల్లకాడుకు కన్నతల్లి
9. మావూరు జీవకళలూటలూరే పోరు
10. నేల సమాధి చేయబడ్డది
11. భూమిలోకి భూమి కుంచించుకుపోయి
12. కాళ్ళకిందే దగాబడ్డ నేల
13. తండ్రిని పోగొట్టుకున్న పొలాలు
14. ఊరు ఉరితల్లకు బలైపోతాదేమో
15. రైతు శవాల పాడె ఈ తెలంగాణ
16. మన్నుకు మనం ఏమి గాకుంటి పాయ
17. పాలోల్ల వరిండ్లన్నీ పొక్కిల్లే
18. పాలు పడని పచ్చి బాలెంత తెలంగాణ పల్లె

(**కవులు :** 1–3. అఫ్సర్; 4. అల్లం నారాయణ; 5. ఆశారాజు; 6. ఈవూరి శ్రీనివాసరెడ్డి; 7–8. ఉదారి నారాయణ; 9. ఎన్. వేణుగోపాల్. 10. ఏనుగు నరసింహారెడ్డి; 11. ఐలేని గిరి; 12. కందుకూరి దుర్గాప్రసాద్; 13–14. గోపగాని రవీందర్; 15. జవేరియా; 16. జూకంటి జగన్నాథం; 17–18. నందిని సిధారెడ్డి.)

ఇంకా వంద పైనే కవుల్ని ఉదాహరించాలి. ఇంతకీ ఈ **పొక్కిలి** (చెల్లా చెదరు, ఆగం ఆగం, పాడు చేయటం)కి కారణాలనేకం. రాజకీయ నాయకులు ముఖ్యకారణం. విడిపోయినా ప్రజలంతా కలిసే ఉంటారెప్పటికీను లేదా రాజకీయులందరూ ఏకమవుతారు, ప్రజలు విడిపోతారు!

మండలానికో, మాండలికం **జూలూరీ!** ఆంగ్ల భాషక్కూడా నాలుగు రకాల యాసలున్నై. 'రెండున్నర జిల్లాలు, రెండు మూడు తెగలోళ్ళ' మాట సరే **కాళన్నా** మరి ఆ పదిన్నర జిల్లాల భాషా యాసా ఒకటేనా? 'గురజాడ', 'గిడుగు పేర' మసిబూసి ముండ మోపి" అన్న మీ అభియోగం ఏ మంచి బాసను యాసను నేర్పింది? ప్రజల యాసను భాషా శాస్త్రజ్ఞులు రికార్డు చేస్తారే గాని ఎవరిపైనా రుద్దరు. **సి.నా.రె.** రాసిన – 'తెలుగు జాతి మనది / నిండుగ వెలుగుజాతి మనది' ఏదో సినిమాకేనయినా అందులోని చరణాలన్నీ ఇప్పటికీ ఎప్పటికీ మాననీయాలే. నిజమైన కవినోట అసత్యం పల్కదు. రెండు నాల్కలుండవు. ప్రకృతి సంపదలన్నీ ఏ ఒక్క ప్రాంతంలోనూ సమకూరవు. వాటిని సక్రమంగా పంచుకోవటంలోనే ప్రకృతి సమతుల్యత, సహజీవనం. వాటి సమత్వానికై చేసే పోరాటాలు ఏ నాటికైనా సమర్థనీయాలే. అసలుకి –

**"ప్రాంతం వాడే దోపిడి చేస్తే / ప్రాణంతోనే పాతర వేస్తాం"** అన్నమాట నోటిమాటేనా?

**కొంచెం వెనక్కి :** సాహితీ మిత్రులు, విజయవాడ ప్రచురించిన **కవిత** వార్షిక సంచికలు (2004 నుండి 2009 వరకూ) లేవ నెత్తిన ప్రశ్నలలో కొన్ని –

1. ప్రపంచీకరణ 2. బహుముఖీనత 3. వ్యక్తీకరణ, ప్రతిఫలనం, వ్యాఖ్యానం 4. తాత్విక గాఢత 5. సమాంతర చరిత్ర 6. మనన యోగ్యత 7. ధ్వని 8. సాంకేతికత 9. వస్తు రూపాల సమన్వయం 10. అస్తిత్వ సమూహాలు, వ్యక్తివాద అస్తిత్వం 11. నూత్న ప్రయోగాలు 12. కవిత్వంలో కీర్తి కండూతి 13. విశ్వజనీనత కాక ప్రాదేశికత, అంతకంటే మించిన స్థానికత 14. కవిత్వరచనలో దోషాలు – శబ్ద స్వరూపలేమి–సంధి, సమాసాల అవిజ్ఞానం–అన్వయ లోపాలు, వాక్య నిర్మాణ నిర్లక్ష్యం 15. భావ నిర్దిష్టతా దృష్టిలేమి, అపరిపక్వధ్యానం; శిల్పంపై అశ్రద్ధ, పదపునరుక్తులు 16. మత సంఘర్షణలు 17. అమెరికా వ్యతిరేకత. 18. కరువు కాటకాలు. 19. ఆత్మహత్యలు 20. కవికీర్తి కాంక్ష!

ఈ 6 సంవత్సరాలలోనూ ప్రతి సంవత్సరం 100కి తగ్గకుండా కవులు కన్పిస్తారు. అంటే 600 కవులున్నారని కాదు. ఓ పదిమంది కనుమరగవుతారు. కొత్తగా మొత్తం మీద ఓ పది మంది వచ్చి చేర్తారు. అంటే పైన పేర్కొన్న 20 సమస్యలకూ, ప్రశ్నలకూ వీరందరూ సమాధానం చెప్పాల్సిన వారే, లేదా సమర్థించుకోవాల్సిన వారే.

*ప్రపంచీకరణ సమస్యకు ప్రతిస్పందించిన కవితలు ఇవి :*

అఫ్సర్ – 'వజాకి ముందుమాట'

వర్మల శివకుమార్ – 'కాలుదువ్విన సంకీర్ణ కారుణ్యం'

మల్లెల – 'అణుమార్మిక విష సంస్కృతి'

హనీఫ్ – 'ఈ పూరిల్లే నిషాని'

కత్తి పద్మారావు – 'నిశ్శబ్దం ఒక మరణ శయ్య'

జ్వాలాముఖి – తక్షణ కర్తవ్యం తర్జన భర్జన'

పూర్వం పాపినేని **'కవితా ఓ కవితా'** శ్రీకాంతశర్మ **'యువనుండి యువదాకా',** త్రిపురనేని శ్రీనివాస్ **'నీలిమేఘాలు'** లాంటి సంకలనాలు ఇప్పటికీ దాచుకోదగినవే.

**నాయిన** సంపాదకుడు **అన్వర్.** మొత్తం కవులు 234 మంది కాగా తండ్రిపై 'కుమార్తె'లుగా రాసిన కవయిత్రులు 29 మాత్రమే. నిజానికి వీరి కవితలలోనే ప్రేమ, వాత్సల్యం, జాలి, పశ్చాత్తాపం హృదయస్ఫోరకంగా వ్యక్తమయినయ్. కొడుకులు తల్లినీ, కూతుళ్ళు తండ్రినీ ఎక్కువగా ప్రేమిస్తారని ఫ్రాయిడ్ సిద్ధాంతం! 'నాన్న ఒక మగ అమ్మ' అంటాడు **సీతారాం.** ఈ కవయిత్రుల కవితలన్నిటిలోకీ సెంటిమెంట్‌కి దూరంగా 'నాన్న'ని ఒక కర్మ జీవిగా కర్మయోగిగా చిత్రించిన కవిత 'బాయిల బతుకు' **(ఎం. రాజేశ్వరి)**, తండ్రి బొగ్గుబాయి కార్మికుడు. "మబ్బుతెరిసి పొద్దు చూడకముందే / మా నాన్న కూడు తిని / సావటానికి పోయి రావలె.../ బొందితోనే బొందలకు పోతూంటే... జీవిత బాయిలోకి చూస్తూన్నం."

ఒక పక్క శ్రీశ్రీ శతజయంతిని సెలబ్రేట్ చేసుకొంటూన్న సమయంలోనే మనం కొందరు కవుల్ని కోల్పోయాం. జ్వాలాముఖి, స్మైల్, పతంజలి, కొత్తపల్లి, సహవాసి లాంటి సాహితీ పరుల్ని, మార్గదర్శకుల్ని. అనారోగ్య కారణాల వల్ల మద్దూరి నగేష్ బాబు, ఇటీవల గుడిహాళంలను కూడ. జీవితంకంటే సాహిత్యాన్ని ప్రేమించిన వాళ్ళు వీళ్ళందరూ. అటు ప్రభుత్వ వ్యవస్థవల్ల, ఇటు వాళ్ళే సభ్యులైన సంఘాల వల్లా కూడా మరికొందరు. నెత్తురు చిందని హత్యలెన్నో?

**కవితావార్షిక 2004, 2007**లో రెండు మాత్రం నాకు లభ్యమైనయ్. **కవితా వార్షిక 2004** గ్రంథాంతాన **పొట్లపల్లి శ్రీనివాసరావు, డా. లంకా శివరామ ప్రసాద్**లు సమర్పించిన సమీక్ష లాంటి "ఆగి... వెనక్కి తిరిగి చూచుకొని" కవులందరూ జాగ్రత్తగా పరీక్ష చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది. ఇక **కవితావార్షిక 2007**లో ఉన్న విశేషమేమిటంటే – ప్రచురణకర్తలైన విశాలాంధ్ర సి. రాజేశ్వరరావుతోనూ, పుస్తక విక్రేతలైన నవోదయ హైదరాబాద్ సాంబశివరావుతోనూ, తెలంగాణా సాహితి వరంగల్ యజమాని కర్ర ఎల్లారెడ్డితోనూ, సృజనలోకం (వరంగల్) నిర్వహించిన ఇంటర్వ్యూ. ఇదేగాక **కోవెల సుప్రసన్నాచార్య** పీఠిక 'సమాలోచ'కూడా.

సోమసుందర్ నుండి సలీందాకా ఓ వందమంది కవులిందులో ప్రత్యక్షం.



*మిగిలింది వచ్చే సంచికలో*

**'మో'**

## చురకలు

విజయవాడ రేడియో స్టేషనుకు డైరక్టరయిన నాయర్ బదలీఅయి ఆయనస్థానంలో శంకరన్ అనే ఆయన వచ్చారు. నాయర్ పింగళి లక్ష్మీకాంతంగారిని శంకర్‌కు పరిచయంచేస్తూ "He conducts Sanskrit Programmes" అన్నారు. దానికి శంకరన్ "నాకు సంస్కృతమంటే పడద"న్నారు. లక్ష్మీకాంతంగారు "దానివల్ల సంస్కృతానికొచ్చిన నష్టం లేదు" అన్నారు.

ఆంధ్రా యూనివర్సిటీ కాలేజీలో హిందూ పండగలకి సెలవులు ప్రకటించాల్సి వచ్చింది. ఏ పండగ ఎప్పుడు వస్తుందో చూసి చెప్పడానికి ఒక సిద్ధాంతిని నియోగించి ఆయనకి కొంత honorarium ఇద్దామని కాలేజీ ప్రిన్సిపాల్, వైస్ ఛాన్స్‌లర్, కట్టమంచి రామలిగారెడ్డికి ప్రతిపాదన పంపారు. ఆయన "Cannot the scholars of our Telugu Department attend to this?" అని ప్రశ్నించి నోట్ తిరిగి పంపారు. ఆ విషయంపై, తెలుగు శాఖాధ్యక్షులైన పింగళి లక్ష్మీకాంతంగారిచ్చిన సమాధానమిది: "Scholarship in Telugu has nothing to do with this. For that matter, the V.C. himself is a great scholar of Telugu!" ఆ తరువాత ప్రిన్సిపాల్‌గారు వైస్ ఛాన్సలర్‌కి ఏమి చెప్పారో తెలియదు గాని, ఆ విషయం అంతటితో ముగిసింది.

# ప్రజానాట్యమండలి చుక్కాని - మిక్కిలినేని

- కుర్రా జితేంద్రబాబు

తెలుగువారి సంగీత, సాహిత్య, నృత్య, నాటక, సినిమా, జానపద కళారంగాల చరిత్రను వెలుగులోకి తెచ్చి, శ్రామిక జనసంస్కృతిని ప్రచారం చేసిన ప్రజానాట్యమండలి వ్యవస్థాపక సభ్యుడు, తొలితరం కమ్యూనిస్టుపార్టీ కార్యకర్త, రంగస్థల నటుడు, సినిమానటుడు, కళాప్రపూర్ణ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి తమ తొంబదిఅయిదవయేట ఫిబ్రవరి నెలలో విజయవాడలో మరణించారు. తెలుగువారి నాటకరంగ చరిత్రను, నాటకరంగ కళావైభవాన్ని, నృత్య కళావికాసాన్ని, ప్రజానాట్యమండలి ప్రస్థానాన్ని గ్రంథస్థం చేయటమేకాక స్వయంప్రతిభగల నటుడు, రంగస్థల సినీనటీనటులకు అభినయసందేశాలను అందించిన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి మరణం తెలుగునాటక సినీ కళారంగాలకు తీరనిలోటు.

మిక్కిలినేనిగా పిలవబడిన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గుంటూరుజిల్లా లింగాయపాలెంలో 1916 జూలై 16న కృష్ణాష్టమిరోజు మిక్కిలినేని వెంకయ్య, సౌభాగ్యమ్మలకు జన్మించారు. వీరి ప్రాథమికవిద్యాభ్యాసం కోలవెన్నులోను, హైస్కూల్‌విద్య పునాదిపాడులోను జరిగినతర్వాత పశు వైద్యంలో వెటర్నటీ డిప్లొమా చేశారు. బాల్యంలోనే జానపద కళారూపాలైన జంగం కథలు, కూచిపూడి వీధిభాగవతాలు, తోలుబొమ్మలాటలు, చెక్కభజనలు, పగటివేషాలు, బృందగానాలు, కోలాటాలవైపు ఆకర్షింపబడ్డారు. హైస్కూలు విద్యాభ్యాసం సమయంలోనే 'రాయబారం' నాటకంలో భీముడుగా, 'సావిత్రి' నాటకంలో యముడిగా, 'తులాభారం' నాటకంలో నారదుడిగా పాత్రలు పోషిస్తూ కోలవెన్ను గ్రామంలోవున్న పంచముఖఆంజనేయ నాటకసమాజంలోను, ఇతర నాటకసమాజాల్లో 'చింతామణి' నాటకంలో భవానీ శంకరుడిగాను, దామోదరుడుగాను, తులాభారం నాటకంలో రుక్మిణి, అర్జునుడు, నారదుడు, జయంతుడి పాత్రలను,



'రంగూన్‌రౌడీ' నాటకంలో రౌడీ పాత్రలో నటించి, ప్రేక్షకుల మన్నలను పొందారు.

మిక్కిలినేని 8వ తరగతిలో ఉండగానే వారి తండ్రి మరణించడంతో వారి నాటకజీవితానికి స్వేచ్ఛ లభించింది. బందరు జాతీయ కళాశాలలో చిత్రకళ నేర్చుకోవాలన్న వారి అభిలాష పూర్తికాకముందే బ్రిటీష్ ప్రభుత్వ ఒత్తిడివల్ల ఆ కళాశాల మూతపడడంతో విజయవాడ వచ్చి, ఫోటోగ్రఫీ నేర్చుకున్నారు. 1933లో మహాత్మాగాంధీ ఆంధ్రదేశ పర్యటనకు వచ్చినప్పుడు అనేకమంది యువకులు గాంధీజీ ప్రభావంవల్ల కాంగ్రెస్‌పార్టీలో చేరడం జరిగింది. మిక్కిలినేని కూడా కాంగ్రెస్‌పార్టీ విధానాలకు ఆకర్షింపబడి బందరు దగ్గరి గ్రామమైన చిన్నాపేటలో జరిగిన ఉప్పుసత్యాగ్రహంలో

కుర్రా జితేంద్రబాబు, ఫోన్ : 9848882600

గొట్టిపాటి బ్రహ్మయ్య, పేట బాపయ్యలతో పాటు పాల్గొన్నారు. ఆనాడు గొట్టిపాటి బ్రహ్మయ్యను, పేట బాపయ్య తదితరులను అరెస్ట్ చేసినప్పటికీ మిక్కిలినేని చిన్నవాడు అవడంవల్ల మందలించి వదిలివేశారు.



బుర్రకథ ప్రదర్శనలో మిక్కిలినేని, ఉమామహేశ్వరరావు - మాచినేని

ఆ తరువాత కాలంలో 1940 ప్రాంతంలో యార్లగడ్డ బసవయ్య, మిక్కిలినేని అక్కయ్యగార్ల ప్రభావంతో కమ్యూనిస్ట్ పార్టీవైపు ఆకర్షింపబడి, ప్రజాకళాకారుడిగా వారి సాంస్కృతిక దళాలలో పనిచేయడం ప్రారంభించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంలో కృష్ణాజిల్లా కాంగ్రెస్ నాయకులందరినీ అరెస్ట్‌చేయడంతో, మిక్కిలినేని మరి కొందరు యువకులతో కలసి, ఉప్పులూరు రైల్వేస్టేషన్‌ను, పునాదిపాడు హైస్కూల్‌ను తగులబెట్టడంతో ఆ కేసులో అరెస్ట్ కావించబడి 5 నెలలపాటు జైలుశిక్ష అనుభవించారు.

అది రెండో ప్రపంచయుద్ధ సమయం కావడంవల్ల ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమ ప్రచారాన్ని, కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లో ప్రారంభించటంతో, మిక్కిలినేని 'హిట్లర్ భాగవతం' 'క్రిప్స్ రాయబారం' మొదలైన వీధినాటకాలను అనేక గ్రామాలలో ప్రదర్శించారు. కృష్ణాజిల్లా కమ్యూనిస్టు పార్టీ ఆదేశాల ప్రకారం, సాంస్కృతిక ఉద్యమానికి నిర్మాణరూపం ఇవ్వాలని, ప్రచారంకోసంవారు మూడు బుర్రకథ దళాలను ఏర్పాటు చేశారు. ఒకదళాన్ని మిక్కిలినేని, దావులూరి నారాయణ, మాచినేని వెంకటేశ్వరరావులతోను, రెండవ దళాన్ని కోసూరి పున్నయ్య, కోగంటి గోపాలకృష్ణయ్య, సిరివిసెట్టి సుబ్బారావులతోను ఏర్పాటుచేశారు. మూడవ దళాన్ని కొంతకాలం తర్వాత పట్టంశెట్టి ఉమామహేశ్వరరావు మరి ఇద్దరితో కలిపి ఏర్పాటుచేశారు. ఈ దళాలు శ్రామిక జన సంస్కృతిని ప్రజల్లో ప్రచారం చేయటంవల్ల విశేష స్పందన లభించటంతో ఒక నాటకదళం కూడా ఏర్పాటుచేయాలన్న భావన కృష్ణాజిల్లా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శిగా వున్న కొండపల్లి సీతారామయ్యకు వచ్చింది. ఆనాటి కృష్ణాజిల్లా పార్టీబాధ్యులైన కొండపల్లి సీతారామయ్య, కొండపల్లి దశరథరామయ్య, కొండపల్లి రాఘవరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, పొట్లూరి సుబ్బారావులు గుడివాడ దగ్గరి గ్రామమైన వానపాములలో సమావేశమై నాటకదళాలనుకూడా ఏర్పాటుచేయాలని నిర్ణయించడం జరిగింది.

వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణలతో కలసి జమీందారుల దౌర్జన్యాలకు బలవుతున్న రైతుల కడగండ్లను, బానిసత్వ విధానాన్ని నిరసిస్తూ రాసిన 'ముందడుగు' నాటకాన్ని మద్దుకూరి చంద్రశేఖరరావుతో చర్చించి ప్రదర్శన కనుకూలంగా మలిచారు. ఈ నాటకాన్ని తొలిసారిగా గుడివాడకు సమీప గ్రామమైన లింగవరంలో మిక్కిలినేని, సూరపునేని లక్ష్మీపెరుమాళ్ళు, చదలవాడ కుటుంబరావు, పట్టంసెట్టి ఉమామహేశ్వరరావు, మాచినేని వెంకటేశ్వరరావు, సుంకర కృష్ణమూర్తి, వల్లం నరసింహారావు, తాపీ రాజమ్మ, కొండెపూడి రాధలు నటీనటులుగాను, తాతినేని చలపతిరావు సంగీత దర్శకత్వం వహించగా, కోడూరి అచ్చయ్య చౌదరి దర్శకత్వంలో ప్రదర్శించారు. ఈ నాటకం విజయవంతమైన తర్వాత, జిల్లా వ్యాప్తంగా దీనిని ప్రదర్శించాలని తలపెట్టి విజయవాడలో 'ప్రజానాట్యమండలి' పేరుతో కార్యాలయం ప్రారంభించి, కాట్రగడ్డ నారాయణరావు ఇంట్లో రిహార్సల్

నిర్వహించారు. అలా ప్రారంభమైన 'ప్రజానాట్య మండలి'లో మిక్కిలినేనితో పాటు డా॥ గరికపాటి రాజారావు, మాచినేని వెంకటేశ్వరరావు, కోగంటి గోపాలకృష్ణయ్య, కోసూరి పున్నయ్య, సుంకర సత్యనారాయణ, వేంపాటి రాధాకృష్ణమూర్తి, సిరివిశెట్టి సుబ్బారావు, పట్టంశెట్టి ఉమా మహేశ్వరరావు, షేక్ నాజర్ మొదలైనవారు నటులుగాను, సీతారత్నం, కొమర్రాజు పద్మ, భూపతిరాజు సూర్యకాంతం (సినీనటి) మొదలైన వారు నటీమణులుగా శిక్షణ పొందారు. వీరు అనేక కళారూపాలను సాధనచేసి, అనేకమందికి శిక్షణ ఇచ్చారు.



కమ్యూనిస్టుపార్టీ సభలలో బొంబాయినందు 'మా భూమి' నాటక ప్రదర్శనలో సీతారత్నం, సూర్యకాంతం, మిక్కిలినేని, కోసూరి పున్నయ్య

అందులో ముఖ్యంగా బుర్రకథ, జముకుల కథ, వీధినాటకం, హరికథ, పిచ్చుకుంటల కథ, కోలాటం, డప్పు నృత్యం, చెంచుపాటలు, కోయవేషం, గొల్ల సుద్దులు, జంతరు పెట్టె, ఫకీరు వేషాలు, చెక్కభజన, బైరాగి వేషం, కత్తి-సుత్తి నృత్యం, డేగ-పావురం నృత్యం, కనక తప్పెట్లు, సోది, పిట్టలదొర, దేవరపెట్టె, రిక్షావాలా నృత్యం, కోలాట నృత్యం, క్వారీ పాటలు, మూకాభినయం, తుమ్మెద పాటలులాంటి శ్రామిక జనసంస్కృతీ కళారూపాలతోపాటు, 'పరివర్తన,' 'మా భూమి,' 'సిమ్లా భాగవతం', 'హిట్లర్ భాగవతం', 'పేరిగాడి రాజ్యం', 'తెలంగాణ భాగవతం'లాంటి అనేక రూపాలను ఎంతో వైవిధ్యభరితంగా ప్రదర్శించారు.

1943 మార్చిలో రెండవ ప్రపంచయుద్ధ సందర్భంగా రాబోయే ఫాసిస్టు ప్రమాదాన్ని గురించి ప్రచారాన్ని ముమ్మరం చేయాలనే ఉద్దేశ్యంతో కృష్ణాజిల్లా కొడాలి గ్రామయువజన సంఘం ఆధ్వర్యంలో ఫాసిస్టు వ్యతిరేక శిక్షణాశిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణా శిబిరంలో తాతినేని ప్రకాశరావు, కొండపల్లి సీతారామయ్య, తమ్మారెడ్డి సత్యనారాయణ, వేములపల్లి దాసు, బి.వి. రావులు 15 రోజులపాటు నేతృత్వం వహించి నిర్వహించారు. ఈ శిబిరంలోనే మిక్కిలినేని, పెరుమాళ్ళు, చదలవాడ కుటుంబరావు, కోసూరి పున్నయ్య, కోగంటి గోపాలకృష్ణయ్య, తుమ్మల కేశవరావు, మండవ వెంకటేశ్వరరావు తదితరులు శిక్షణ తీసుకొన్నారు.

1943 మే 23నుండి జూన్ 1వరకు బొంబాయిలో పి.సి. జోషి ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టుపార్టీ ప్రథమ మహాసభ జరిగింది. ఈ మహాసభలకు ముందు భారత కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీగావున్న పి.సి. జోషి 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్' అనగా భారత ప్రజానాట్యమండలిని ఏర్పాటుచేసి, అనేక రాష్ట్రాలలో ముఖ్యంగా బెంగాలీ, మళయాళం, ఉర్దూ, మరాఠీ, పంజాబీ, గుజరాతీ, హిందీ భాషలలో వివిధప్రాంతాలలో వివిధకళారూపాలతో సాంస్కృతిక దళాలను తయారుచేసి, మహాసభ సందర్భంగా ప్రదర్శనలు ఇవ్వాలని నిర్ణయించాడు. ఈ మహాసభలలో ఆంధ్రప్రాంతం నుండి ప్రజానాట్యమండలి కళాకారులు 'మా భూమి' 'పరివర్తన' నాటకాలతోపాటు ఇతర కళారూపాలను కూడా బొంబాయిలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలలో ప్రజా నాట్యమండలి కళాకారులకు ప్రథమ బహుమతి లభించింది. ఇక్కడ ప్రదర్శించిన 'మా భూమి' నాటకంలో మిక్కిలినేని ప్రధానపాత్ర పోషించారు. ఈ ప్రదర్శనలను హరీంద్రనాథ్

ఛటోపాధ్యాయ, పృథ్వీరాజ్ కపూర్, కె.ఎ. అబ్బాస్, సజ్జాద్ జహీర్, ముల్క్‌రాజ్ ఆనంద్, పి.సి. జోషి, ఎస్.ఎ. డాంగే, డా॥ అధికారి మొదలైనప్రముఖులు హాజరై, మిక్కిలినేని బృందాన్ని అభినందించడం జరిగింది.

ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ, మూడవ మహాసభ విజయవాడలోని దుర్గాగ్రహారంలో 1943 జూన్ 8 నుండి, 15 వరకు జరిగింది. ఆ సందర్భంలో జరిగిన ప్రదర్శనలో మిక్కిలినేని హిట్లర్ వీధి భాగవతంలో హిట్లర్ పాత్ర ధరించి, అందరినీ ఆకర్షించారు.

1943నాటి పరిస్థితులకు అనుగుణంగా నల్లగొండ జిల్లా చిలుకూరులో జరిగిన 8వ ఆంధ్రమహాసభ తర్వాత నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకాలోను, బేతవోలు మఖ్తేదారుకు వ్యతిరేకంగా, మునగాల పరగణాలో, జమీందారీ నియంతృత్వానికి వ్యతిరేకంగా విస్తృతమౌతున్న ఉద్యమ నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభించి వారికి శిక్షణ ఇవ్వవలసిన బాధ్యతను ప్రజానాట్యమండలి దళం తరఫున మిక్కిలినేని స్వీకరించారు.

1943 డిసెంబర్ 17న ఆనాటి కృష్ణాజిల్లాలో అంతర్భాగంగావున్న మునగాలలో ప్రజానాట్యమండలి తరఫున మిక్కిలినేని 'మా భూమి' నాటకాన్ని ప్రదర్శించారు. మునగాల పరగణాలోని అనేక గ్రామాలనుండి ప్రజలు బండ్లు కట్టుకుని వచ్చి, ఈ నాటకాన్ని తిలకించారు. ఈ నాటకం కథానాయకుడుగా మిక్కిలినేని, కథానాయికగా సీతారత్నం నటిస్తున్న సందర్భంలోనే వారిద్దరి మధ్య ప్రేమ అంకురించిందని ఈ వ్యాసకర్తతో మిక్కిలినేని కలిసినప్పుడల్లా సంతోషంగా అంటుండేవారు. ఆ తర్వాతి కాలంలో సీతారత్నాన్నే మిక్కిలినేని వివాహమాడారు కూడా.


'మా భూమి' నాటకంలో మిక్కిలినేని, సీతారత్నం జీవితంలోకూడా నిజదంపతులే!

1944 మార్చి 14, 15 తేదీలలో అఖిలభారత రైతు మహాసభలు విజయవాడలో జరిగిన సందర్భంగా రాహుల్ సాంకృత్యాయన్ ముఖ్యఅతిథిగా రావడం జరిగింది. ఈ కార్యక్రమాలలోకూడా మిక్కిలినేని బృందం ప్రజా నాట్యకళా మండలి తరఫున అనేక కళారూపాలను ప్రదర్శించారు.

1944, 45 ప్రాంతాల్లో కమ్యూనిస్టుపార్టీ బుర్రకథ మొదలైన కళారూపాలను పార్టీసిద్ధాంతాలకనుగుణంగా రచింపచేసి ప్రదర్శిస్తూ వచ్చారు. 1945లో గుడివాడ సమీపగ్రామమైన లింగవరంలో బుర్రకథ శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరంలో మిక్కిలినేని అనేకమంది ఔత్సాహిక కళాకారులకు శిక్షణఇచ్చారు. 1945లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన ఖమ్మంలో జరిగిన 12వ ఆంధ్ర మహాసభలో మిక్కిలినేని బృందం ప్రజానాట్యమండలి తరఫున ప్రదర్శనలు ఇచ్చారు. 1945 ప్రాంతంలో మునగాల పరగణా రైతునాయకులు ఉప్పల రామయ్య అధ్యక్షతన రైతుసంఘ కార్యకర్తలకు, కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలకు శిక్షణాతరగతులను నిర్వహించారు. ఈ సందర్భంలో మిక్కిలినేని, వైజ్ఞానికదళం తరఫున అలుగూరి వీరనారాయణ, శ్రీ కృష్ణనాగర జానయ్య, చిలుకూరి నారాయణలకు 'కష్టజీవి' బుర్రకథను నేర్పించారు. కేశబోయిన ముత్తయ్య, గోపిరెడ్డి వీరయ్యలకు 'జంతర్‌పెట్టె' అనే కళారూపాన్ని నేర్పించి, పరగణా గ్రామాలలో అనేక ప్రదర్శన లిప్పించారు.

1946 జూన్ 4న దొడ్డికొమరయ్య మరణం తర్వాత, తెలంగాణాలో విశేషమైన ప్రజాఉద్యమాన్ని నిర్మించిన 'ఆంధ్రమహాసభ'పై, 'కమ్యూనిస్టు పార్టీ'పై 1946 అక్టోబర్‌లో నిషేధాన్ని నిజాంప్రభుత్వం విధించటంతో అనేకమంది తెలంగాణప్రాంత ఆంధ్రమహా సభ, కమ్యూనిస్టుపార్టీ

నాయకులు ఆంధ్ర ప్రాంతానికి వలస వెళ్ళడంతోపాటు 'ఆంధ్ర మహాసభ' ఆఫీసు కేంద్రస్థానం కూడా హైదరాబాదు నుండి విజయవాడకు మార్చబడింది. తెలంగాణ సాయుధ పోరాట శిక్షణాశిబిరాన్ని కృష్ణాజిల్లాలో అంతర్భాగంగాఉన్న మునగాల పరగణాలోని రామాపురం గ్రామంలో దేవులపల్లి వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో ప్రారంభమైంది.



'జముకుల కథ చెపుతున్న పట్టంశెట్టి ఉమామహేశ్వరరావు, మిక్కిలినేని, మాచినేని వెంకటేశ్వరరావు

1947 జనవరి, 17,18,19 తారీఖులలో మద్రాసునందు నాలుగవ అభ్యుదయ రచయితల మహాసభలు త్యాగరాయనగర్‌లో గల వాణీ మహల్‌లో జరిగాయి. పి.వి. రాజమన్నార్ అధ్యక్షుడిగా కె.ఏ.అబ్బాస్ ఈ సభలలో ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సభల సందర్భంగా మిక్కిలినేని ప్రదర్శించిన వీధినాటకం, ఆత్రేయ రచించిన 'పరివర్తన' నాటకం ప్రదర్శించబడ్డాయి.

1948లో కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధం తీవ్రతరమై ప్రభుత్వం డిటెన్షన్ వారెంట్లను జారీచేసింది. ఈ సందర్భంగా 1947లో అరెస్టయిన మునగాల పరగణా రైతు సంఘనాయకులు ఉప్పల రామయ్య జైలులో మరణించారు. ఆ నాటికే ప్రజానాట్యమండలి సభ్యులపై కూడా నిర్బంధం తీవ్రతరమైంది. ఈ నిర్బంధంవల్ల మిక్కిలినేని స్వగ్రామమైన కోలవెన్ను గ్రామంలో ఉంటూ ఉప్పల రామయ్య మరణం సందర్భంగా ఒక సంతాపసభను జరపటానికి ప్రయత్నించారు. ఈ కార్యక్రమాన్ని ఆటంకపరచటానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కుర్చీలు, బల్లలను ఎత్తుకెళ్ళి మిక్కిలినేనిపై పోలీస్ రిపోర్టు ఇచ్చారు. మిక్కిలినేని తనను అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో రెండురోజులు తప్పించుకు తిరిగి, తీవ్రమైనజ్వరం రావడంతో ఆ తర్వాత స్వగృహానికి వచ్చిన కొన్నిగంటలలోనే పోలీసులు అరెస్టుచేసి, చిత్రహింసలకు గురిచేశారు. అతని కుటుంబాన్నికూడా వేధించారు.

ఇలాంటి నిర్బంధ పరిస్థితులలో డా॥ గరికపాటి రాజారావు, ప్రజానాట్యమండలి బాధ్యతలను మిక్కిలినేనికి అప్పజెప్పి రాజమండ్రి వెళ్ళి ప్రాక్టీసు ప్రారంభించారు. సూరపనేని లక్ష్మీపెరుమాళ్ళు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. సుంకర సత్యనారాయణ రాయలసీమలో రహస్యజీవితం గడపడానికి వెళ్ళారు. వాసిరెడ్డి భాస్కరరావు మద్రాసుకు వెళ్ళి, అజ్ఞాతంలో ఉంటున్నారు. పొట్లూరి సుబ్బారావుపై, కనపడితే కాల్చివేత ఉత్తర్వులు యివ్వబడ్డాయి. మాచినేని వెంకటేశ్వరరావును విజయవాడ వద్ద దుగ్గిరాలలో అరెస్టుచేశారు. పట్టంశెట్టి ఉమామహేశ్వరరావును కర్నూలులో అరెస్టుచేశారు. మిక్కిలినేనిని విజయవాడ సబ్ జైలులో ఉంచారు. తాతినేని చలపతిరావును, కోగంటి గోపాలకృష్ణయ్యను కడలూరు జైలుకు పంపించారు.

మిక్కిలినేని జైలునుండి విడుదలై, నిర్బంధకాలంలో ప్రజానాట్యమండలికి బాధ్యులైన పెరుమాళ్ళను ఉంగుటూరు లోను, గరికపాటి రాజారావును రాజమండ్రిలోను రహస్యంగా కలిసి, ప్రజానాట్యమండలిని రద్దుచేయాలన్న నిర్ణయం తీసుకున్నారు. దాంతో 1948 మే 5న, ప్రజా నాట్యమండలిని రద్దుచేస్తూ కృష్ణాజిల్లా దళం ఆస్తిపాస్తులు, అప్పులు, ఇతర బాధ్యతలను మిక్కిలినేనికి దఖలు పరిచారు. మిక్కిలినేని ప్రజానాట్యమండలికి వచ్చిన వెండికప్పులను యితర బహుమతులను, షీల్డులను అమ్మి, అప్పులుతీర్చి, తెరలు, తంబురలు, డప్పులు, హార్మోనియం, వేషాల దుస్తులు, ఒక ఇంట్లో అటకెక్కించి భద్రపరచారు.

'పళనియప్ప' అనే పోలీస్ అధికారి దాడులతో చెల్లాచెదురైన ప్రజా నాట్యమండలి దళ సభ్యులు, జైలు నుండి విడుదలైన వెంటనే కొందరు, అజ్ఞాతంలో ఉన్నవారు కొందరు మద్రాసునగరంచేరి, జీవికకోసం పనులు వెతుక్కుంటూ ఆఖరికి సినిమారంగంలో అనేక విభాగాల్లో చేరిపోయారు. అలా చేరిపోయినవారిలో మిక్కిలినేనితోపాటు పెరుమాళ్ళు, కుటుంబరావు, సుంకర సత్యనారాయణ, వీరమాచనేని మధుసూధనరావు, డా॥ రాజారావు, అల్లు రామలింగయ్య, తాతినేని చలపతిరావు, అనిసెట్టి, వల్లం నరసింహారావు, జి. వరలక్ష్మి, సూర్యకాంతం మొదలైనవారంతా అక్కడే స్థిరపడిపోయి కొంతకాలం తర్వాత ఆంధ్ర కళామండలి పేరుతో కార్యక్రమాలను ప్రారంభించారు.

1952 ఎన్నికల సందర్భంగా ఈ కళాకారులంతా ప్రజా నాట్యమండలిగా ఏర్పడి, ఆంధ్ర ప్రాంతమంతా విస్తృతంగా పర్యటిస్తూ, ఆత్రేయ రచించిన 'ఓటు నీకే', సుంకర రచించిన 'జీతగాడు' నాటకాలను మిక్కిలినేని ఆధ్వర్యంలో విజయవంతంగా ప్రదర్శించారు. 1955 ఎన్నికల సందర్భంగా కమ్యూనిస్టుపార్టీకి అఖండవిజయం చేకూర్చాలని, చలనచిత్రరంగంలో ప్రవేశించిన ప్రజా నాట్యమండలి సభ్యులు జనవరి 21 నుండి 30 వరకు 'ఆత్మార్పణ' అనే ప్రధాన నాటికను వివిధప్రాంతాల్లో ప్రదర్శించారు. దీనిలో మిక్కిలినేని, జి. వరలక్ష్మి, ఆచార్య ఆత్రేయ, సి. నాగభూషణం, వి. మధుసూధన్‌రావు, వీరమాచనేని సరోజిని, శ్రీమతి శకుంతల, కె. రత్నం, కె. ధీమతి, కె. కుటుంబరావు, పట్టాభిరామం, ఎస్. సత్యం, సౌమిత్రి, తాతినేని చలపతిరావు మొదలైనవారితోపాటు శ్రీరంగం శ్రీనివాసరావు కూడా పాల్గొనడం జరిగింది.

మిక్కిలినేని 1950 నుండి 1997వరకు దాదాపు 400 సినిమాలలో వైవిధ్యమైన పాత్రలలో జీవించి, నటించారు. ఒక్క ఎన్.టి. రామారావుతోనే దాదాపు 100 పై చిలుకు చిత్రాలలో విభిన్న పాత్రలలో, ముఖ్యంగా భీష్ముడు, ధర్మరాజు, బలరాముడు, దుశ్శాసనుడులాంటి పాత్రలే కాక, అన్నగా, తండ్రిగా, మామగా, ఉపదేశకుడిగా, గురువుగా, అనేక పాత్రలలో నటించారు. ఎన్.టి. రామారావు తరచుగా 'నా పక్కన సమర్థుడైన నటుడు నటిస్తేనేకాని నేను రాణించను. అందువల్ల, మిక్కిలినేనిని నాచిత్రాలలో ప్రతిష్మాత్మకమైన పాత్రలలో నటింపజేశానని' చెప్తుండేవారు. మిక్కిలినేని ఎన్.టి.రామారావుతోకలిసి నటించిన సినిమాలలో దానవీరశూరకర్ణ, శ్రీకృష్ణపాండవీయం, నర్తనశాల, కృష్ణార్జునయుద్ధం, పాండవవనవాసం, సీతారామకళ్యాణం, విశ్వామిత్ర, రుక్మాంగద, సారంగధర లాంటి సినిమాలు అనేకమున్నాయి.

మిక్కిలినేని 'ఆంధ్రనాటకరంగ చరిత్ర'ను వెయ్యి పేజీల గ్రంథంగా రచించి భాషాసమితి నుండి ప్రథమ బహుమతిని అందుకున్నారు. వందసంవత్సరాల ఆంధ్రనాటక రంగ చరిత్రలోని అజ్ఞాత నటులను, కాలగర్భంలో కలిసిపోయిన 320 మంది కళాకారులను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో 1965 నుండి 25 సం॥ల పాటు ధారావాహికంగా ఆ వ్యాసాలను పరిచయంచేసి, 'నటరత్నాల' పేరున ఉద్గ్రంధాన్ని ప్రచురించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తరఫున ఉత్తమ గ్రంథంగా బహుమతిని అందుకున్నారు. కనుమరుగైపోతున్న 'జానపద కళారూపాలను' వెయ్యిపేజీల గ్రంథంగా రచించి 1995లో తెలుగువిశ్వవిద్యాలయంనుండి పురస్కారాన్ని అందుకున్నారు. 'ఆంధ్రుల నృత్యకళావికాసాన్ని' ఓ గ్రంథంగా తీర్చిదిద్దారు. 'వెలుగులు విరజిమ్మిన నాటకరంగ కళావైభవాన్ని' ముఖ్యంగా ప్రయోగాత్మక పోకడలతో పతనమవుతున్న నాటకరంగ కారణాలను విశ్లేషిస్తూ సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు నాటకాలను సమీక్షిస్తూ, ఆత్రేయ నాటకాలను పరిచయంచేస్తూ, సాంస్కృతిక రంగంపై మార్క్సిస్టు ప్రభావాన్ని వివరిస్తూ ఒక గ్రంథాన్ని ప్రచురించారు. 'ప్రజలలో విప్లవజ్వాలలు రేకెత్తించిన ఆనాటి ప్రజానాట్య మండలి'పై ఓ గ్రంథాన్ని ప్రచురించారు.

'ప్రజాపోరాటాల రంగస్థలి ఆంధ్ర ప్రజానాట్యమండలి' పేరున ఆ సంస్థ చరిత్రను గ్రంథస్థం చేశారు. ఏడుదశాబ్దాల పైగా ప్రజాఉద్యమంలో ఉంటూ సినిమారంగంలో, నాటకరంగంలో ఒక విశిష్టమైన కళాకారునిగా సేవలను అందించి, విశ్రాంతి కోసమై 1997లో విజయవాడ చేరుకొని, 95 సంవత్సరాల వయస్సులో 2011 ఫిబ్రవరి నెలలో మరణించేవరకు కళారంగానికి, రచనారంగానికి విశిష్ట సేవలందించిన మిత్రుడు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను.

## తెలుగునాటకాన్ని మలుపు తిప్పిన

# మరో మొహెంజొదారో

రాజమండ్రి కళానికేతన్ పోటీలలో **దయ్యం** నాటికను ప్రదర్శించడానికి ర.స.న. సమాఖ్య సభ్యులంతా వెళ్లారు. ముందురోజు ఒకనాటక ప్రదర్శనకు చాట్ల శ్రీరాములు, వెంకటేశ్వరరావుతో పాటు సమాజ సభ్యులంతా ఆడిటోరియానికి వెళ్లారు. నాటక ప్రదర్శన జరుగుతున్న సమయంలో ఆనాటి ఆహ్వానితులైన సినిమా నటులు రావడంతో ప్రేక్షకులు వారిని చూచి సంతోషంతో ఈలలు, కేకలు వేశారు. ప్రదర్శన మధ్యలో వచ్చిన కలకలం అర్థంకాక రంగస్థలంపై నటిస్తున్న కళాకారులు అయోమయంలో పడిపోయారు. ఈస్థితిని గుర్తించి దర్శకుని హోదాలో చాట్ల మరుసటి ఉదయం నిర్వాహకులను కలిసి ప్రదర్శన మధ్యలో సినీతారలు వస్తే జరిగే ఇబ్బందిని రాత్రి సంఘటనలను ఉదాహరణగా చెప్పారు. నిర్వాహకులు వీరి అభ్యర్థనను అంతగా పట్టించు కోలేదు. ప్రదర్శనకు గంట ముందు చాట్ల తన గురువైన కె. వెంకటేశ్వరరావుతో పాటు సహనటులను కూర్చోబెట్టి "రాత్రిసంఘటన మళ్లీ ఈ రోజు పునరావృత మౌతుందనిపిస్తుంది. సినీతారలు ఆడిటోరియం లోకి రాగానే సహజంగా ప్రేక్షకుల్లో కలకలం వస్తుంది. వెంటనే స్టేజీమీద నాటకం జరుగుతున్నా ఎక్కడి వాళ్లు అక్కడే ఫ్రీజ్ అయిపోండి. అంతా సర్దుకొన్నాక మళ్లీ ప్రారంభిద్దాం" అని చెప్పారు. అనుకొన్నంతా జరిగింది. సినీ తారలు రాగానే స్టేజీమీద అందరూ హఠాత్తుగా ఫ్రీజ్ అయిపోయారు. ప్రేక్షకులు ఆశ్చర్యంగా చూస్తుండగానే క్షణాలలో నిశ్శబ్దం ఏర్పడింది. వెంటనే నటించడం మొదలు పెట్టారు. ఇలా ఫ్రీజ్ కావడం వెంటనే నటించడం ఎందుకో చాట్లకు బాగా నచ్చింది. ఈ విధానాన్ని ఎందుకు ఒక టెక్నిక్‌గా వాడుకోకూడదు అనే ఆలోచన చాట్ల మనసులో బలంగా నాటుకు పోయింది. తన ఆలోచనను ఎన్.ఆర్. నందితో పంచుకొని ఫ్రీజ్ టెక్నిక్‌ను **మరో మొహెంజొదారో**లో వాడదామని చెప్పారు. నాటకంలో భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు చెందిన కథ జరుగుతుంది. వర్తమానాన్ని స్థంభింపజేసి భూత, భవిష్యత్ కాలాలకు సన్నివేశాన్ని తీసుకొని వెళ్లడానికి ఈ ఫ్రీజ్ టెక్నిక్ ఎంతగానో దోహదం చేసింది.



చాట్ల - నడిచే 'నాటకం'

వర్తమానంలో పాత్రను ఫ్రీజ్‌చేసి శాస్త్రజ్ఞుడు విషయ పూర్వాపరాలను వివరిస్తూ అటుగతానికో, భవిష్యత్తుకో సన్నివేశాన్ని తీసుకుపోతాడు. దానికి అనుగుణంగా పాత్ర ఆ కాలంలోకి వెళ్లిపోతుంది. **మరో మొహెంజొదారో** నాటక గమనానికి ఫ్రీజ్ టెక్నిక్ ఎంతగానో దోహదం చేసింది. అప్పటి వరకూ ఇటు నాటకాలలో గానీ, సినిమాలలో గానీ ఫ్రీజ్ రాలేదు. 1964 తర్వాత హిందీ చిత్రం ఫూల్ అవుర్ పత్తర్‌లో తొలిసారిగా స్టాప్ బ్లాక్‌ను ఉపయోగించారు.

ఈనాటక ప్రదర్శనలో ఒకరోజు ఆదుర్తి సుబ్బారావు సన్మాన స్వీకర్తగా హాజరయ్యారు. అదే సమయంలో మద్రాసులో 'తేనె మనసులు' షూటింగ్ ముమ్మరంగా జరుగుతుంది. మొదటి సన్నివేశం చూచి రైలుకు వెళ్లిపోవాలని ఆయన నిర్ణయించు కొన్నారు. మొదటి సన్నివేశం పూర్తయ్యాక తన సహాయ దర్శకుడైన కె. విశ్వనాథ్‌తో, 'రేపు షూటింగ్ కాన్సిల్ చేస్తున్నట్లు మద్రాస్‌కు ఫోన్ చేయి, నాటకం పూర్తిగా చూస్తున్నాం' అని చెప్పారు. ప్రదర్శన జరుగుతున్న సమయంలో దర్శకుని రమ్మని, స్టేజీమీదకు మరో సహాయ దర్శకుడైన మాధవరావును పంపారు. దర్శకుడే శాస్త్రజ్ఞుని పాత్రను వేస్తున్నట్లు జె.యల్. నరసింహారావు చెప్పి, రచయిత నందిని స్టేజిపైకి పంపారు.

నాటక ప్రయోగ విధానం అద్భుతంగా ఉన్నదని ఆదుర్తి మెచ్చుకొన్నారు. ఈ నాటకాన్ని మద్రాసులో ప్రదర్శించినపుడు ప్రముఖ దర్శకుడు శ్రీధర్ చూసి "మేం సినిమాల్లో ఎన్నో ప్రయోగాలు చేస్తున్నాం. ఎంతో సాహిత్యాన్ని సృష్టిస్తున్నాం. మమ్మల్ని మించిన వాళ్లు లేరని అనుకొనేవాళ్లం. కానీ **'మరో మొహెంజొదారో'** నాటకంచూశాక మేము వందేళ్ళు వెనుకబడి ఉన్నామని తెలుసుకున్నాం" అని ప్రశంసించారు. నాటకాన్ని చూచిన సినీనటులు యస్.వి. రంగారావు, దర్శకుడు చాట్లను, రచయిత నందిని మర్రోజు తన ఇంటికి టీకి రమ్మని ఆహ్వానించారు. "ప్రతి నటుడూ ఎంతో విభిన్నంగా నటించారు. రచయిత, దర్శకుడూ ఇంతగా పోటీపడిన నాటకాన్ని ఇంతవరకూ చూడలేద"ని మెచ్చుకొనిచెరొక రూ. 558 బహుమతిగా ఇచ్చారు.

ఈనాటకంపై నండూరి పార్థసారథి ఆంధ్రప్రభ వారపత్రిక (27.05.1964) లో చక్కని సమీక్ష చేశారు. ఇందులో "ఒక ప్రొఫెసర్ ఆధునిక మానవుని మీద ప్రయోగాలు జరుపుతాడు. ఆయన ప్రయోగశాల ఒక శ్మశానవాటిక అనుకోవచ్చు. చనిపోయిన ఒక్కొక్క వ్యక్తినీ పిలిచి అతని వ్యక్తిత్వాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తాడు. ఆయన సూత్రధారిగా వ్యవహరిస్తూ ఆ వ్యక్తులచేత నాటకం ఆడిస్తాడు. అది నాటకం కాదు. నిజంగా ఆ వ్యక్తులు బ్రతికి ఉన్నప్పుడు వారి మధ్య సంభవించిన జీవితం. అంటే ఒక విధంగా దాన్ని ఫ్లాష్‌బ్యాక్ అనుకోవచ్చు. అయితే మిగతా నాటకాలకూ దీనికి ఉన్న భేదం, ఇందులో చేసిన ప్రయోగం ఏమిటంటే సూత్రధారి మనకు తన ప్రయోగం గురించి చెబుతున్నప్పుడు రంగస్థలం మీద ఒక ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశం జరుగుతూ ఉంటుంది. ప్రొఫెసర్ మాట్లాడుతున్నప్పుడు ఆ ఫ్లాష్ బ్యాక్ సన్నివేశంలోని వ్యక్తుల మాటలు వినిపించవు. ప్రొఫెసర్ తెరలోకి వెళ్ళిపోగానే వీళ్ళ మాటలు వినిపిస్తూ ఉంటాయి. అంటే ప్రస్తుతం, గతం ఒకే కాలంలో, ఒకే స్థలంలో జరుగుతూ ఉంటాయన్న మాట. వేదిక మీద గతం జరుగుతున్నప్పుడు ప్రొఫెసర్ రన్నింగ్ కామెంట్రీ చేస్తూ ఉంటాడు. మామూలుగా అయితే ఈ నాటకంలోని మూకాభినయనాన్ని చూచి ప్రేక్షకులు నవ్వి గోల చేసేవారు. కానీ సన్నివేశాన్ని అర్థం చేసుకొని ఉత్కంఠతో చాలా శ్రద్ధగా, నిశ్శబ్దంగా నాటకం చూశారు. అది దర్శకుడు, నటీనటుల గొప్పతనం. రచన ప్రేక్షకుల్లో నూటికి 90 శాతం మందికి అర్థం కాలేదు. అయినా వాళ్లు గోల చేయలేదంటే దర్శక ప్రతిభ, నటీనటుల అభినయ చాతుర్యమే. పరిషత్తులో ప్రదర్శించిన ఏ నాటకంలోనూ నటులు ఇంత సమన్వయంతో నటించలేదు. నిజంగా తెలుగు నాటక రంగంలో ఇదొక సరికొత్త ప్రయోగం. ఈ నాటకానికి దర్శకత్వం వహించిన చాట్ల శ్రీరాములు ప్రత్యేకంగా అభినందనీయుడని" పేర్కొన్నారు.

> **మొహెంజొదారో కథను నడపడానికి సంస్కృత నాటకంలోని సూత్రధారుని స్ఫూర్తిగా తీసుకొన్నారు. ఇందులోని పాత్రలన్నీ శాస్త్రజ్ఞుడి పరిశోధనా రూపంగా ఏర్పడిన ఆకృతులు, సన్నివేశాలన్నీ అతని రూపకల్పనే. ఒక్కొక్క పాత్రను పరిచయం చేస్తూ శాస్త్రజ్ఞుడు ఆ పాత్రతో సంభాషిస్తాడు. ఒక్కొక్కసారి ఆ పాత్రకు దర్పణంగా తాను కన్పిస్తాడు. ఆ పాత్రలో దాగి ఉన్న మంచితనాన్ని, అవకాశవాదాన్ని, దుర్మార్గాన్ని ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు వివరిస్తూ ఉంటాడు.**

**మొహెంజొదారో** కథను నడపడానికి సంస్కృత నాటకంలోని సూత్రధారుని స్ఫూర్తిగా తీసుకొన్నారు. ఇందులోని పాత్రలన్నీ శాస్త్రజ్ఞుడి పరిశోధనారూపంగా ఏర్పడిన ఆకృతులు, సన్నివేశాలన్నీ అతని రూపకల్పనే. ఒక్కొక్క పాత్రను పరిచయంచేస్తూ శాస్త్రజ్ఞుడు ఆ పాత్రతో సంభాషిస్తాడు. ఒక్కొక్కసారి ఆ పాత్రకు దర్పణంగా తాను కన్పిస్తాడు. ఆ పాత్రలో దాగి ఉన్న మంచితనాన్ని, అవకాశవాదాన్ని, దుర్మార్గాన్ని ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు వివరిస్తూ ఉంటాడు. 1970లో లండన్‌లో శిక్షణ పొందడానికి వెళ్లిన సమయంలో చాట్ల తూర్పు బెర్లిన్‌లోని బెర్లినర్ ఎన్‌సెంబుల్ థియేటర్‌లో బ్రెష్ట్ నాటకాన్ని చూచి అచ్చెరువొందారు. బ్రెష్ట్ సిద్ధాంతానికీ, సంస్కృత నాటకాలలోని సూత్రధారునికీ ఉన్న దగ్గర పోలికలను గుర్తించారు. తనకు తెలియకుండానే బ్రెష్ట్ ఎలియనేషన్ సిద్ధాంతాన్ని వినియోగించుకొన్న విషయాన్ని గుర్తించారు. అనంతర కాలంలో ఈ సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేసి, 'లావొక్కింతయు లేదు,' 'నీలిదీపాలు,' 'త్రిజాకీ యమదర్శనం' ప్రదర్శనల్లో సంపూర్ణంగా ఆచరించారు.

ఇంత చరిత్రాత్మకమైన నాటకాన్ని ఆంధ్రదేశానికిచ్చిన చాట్ల శ్రీరాములు గురించి మనం తెలుసుకోవాలి. ఆయన జీవిత చరిత్రను చెప్పటమంటే ఆంధ్రదేశపు ఆరుపదుల నాటక రంగ చరిత్రను పునఃసమీక్షించటమే. ఆధునిక తెలుగు నాటక రంగంలో ఆయనొక ప్రసిద్ధ నటుడు, దర్శకుడు, ప్రయోక్త.

సింపుల్‌గా చెప్పాలంటే ఆధునిక నాటకానికాయనొక 'మెటఫర్'. ఇది ఎంత మాత్రము అతిశయోక్తి కాదు.

బాల్యంలో తాను చూసిన ఓనాటకంలో నటించిన ఒక పాత్రదారుని చుట్టూ విద్యార్థులుచేరి అతన్ని ఆకాశానికి ఎత్తేయటం చూశారు. అలా గుర్తింపు తెచ్చుకోవాలంటే తాను కూడా నటుడు కావాలనే ఆకాంక్ష అతనిలో బయలుదేరి వుంటుంది.

చాట్ల చిన్నతనంలో, చదువుకునే రోజుల్లో అర్భకునిలా, బక్కపల్చగా ఉండేవాడు. ఆటలంటే ఇష్టమున్నా, ఎవరూ తీసుకునేవారు కారు. తాను తోటివారి మధ్య ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చుకోవాలనే ఆరాటం ఉండేది. కాలేజీలో విద్యార్థులువేసిన నాటకాలు చూసేవారు.

పన్నెండు సంవత్సరాల వయసులో ద్విజేంద్రరాయ్ వ్రాసిన 'మేవాడ పతనం' నాటకంలో బాలునిపాత్రలో మొదటిసారి రంగస్థలంపై పాదం మోపారు. కాలేజి విద్యార్థిగా ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహించిన నాటక పోటీల్లో 'మాష్టర్జీ' నాటకాన్ని ప్రదర్శించి ఉత్తమ నటునిగా బంగారుపతకాన్నికైవసం చేసుకున్నాడు. అక్కడ నుంచి చాట్ల నాటకానికి మారు పేరుగా నిలిచాడు.

ఎనిమిదో క్లాసు చదువుతున్న రోజుల్లో మేనత్త కూతురు ఆదిలక్ష్మితో వివాహం అయింది. పెండ్లికొడుకుని చేయడానికి చిరుగుల్లేని పంచెకోసం వెదికి వేసారితే ఆ రోజు స్కూల్ యూనిఫారం నిక్కరు ఉన్నంతలో బాగుంటే దానితోనే నుదుట కళ్యాణబొట్టు, బుగ్గ ప్రక్కన కాటుక చుక్కతో పెండ్లిపీటల మీద కూర్చున్నాడు. డిగ్రీలో చేరేటప్పటికీ శ్రీరాములు ఇద్దరి బిడ్డల తండ్రి.



**ఎన్.ఆర్. నందితో చాట్ల శ్రీరాములు**

ఒకనాడు చాట్ల కారు ప్రమాదానికి లోనయ్యారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ డైరెక్టరు పరామర్శించడానికి ఆసుపత్రికి వచ్చి చాట్లను చూశారు. వైద్యం నిమిత్తం ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం చేస్తానన్నారు. చాట్ల సున్నితంగా తిరస్కరిస్తూ, "నాకు మెడీ క్లెయిమ్ ఉంది. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నాటకంపై వర్క్‌షాపు నిర్వహిస్తున్నాము. దానికి ఆర్థిక సహాయం అందించండి సంతోషిస్తాను" అన్నారు. జీవితంకంటే నాటకమే ఆయనకు ప్రధానమని ఈ సంఘటన తెలియజేస్తుంది. ఆయన కోరిన విధంగా ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు దానికోసం ఇచ్చింది.

ఆయన ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు తిరిగారు. ఎక్కడకు వెళ్ళినా అక్కడి నాటకాలను చూసి, నాటక కళను ఆకళింపు చేసుకున్నారు. సహజ జిజ్ఞాసపరుడు, నాటకకళపై ఎన్నో గ్రంథాలు పఠించారు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో నాటకం గురించి ధారాళంగా పునరుక్తిలేకుండా గంటలతరబడి కంచుకంఠంతో ఆయన మాట్లాడే ధోరణికి ఎవరైనా ఆకర్షితులు కావలసినదే.

**దయ్యం** అనే నాటకంలో దయ్యం పాత్రకు ఒక బాలుణ్ని ఎంపిక చేసి ఆ నాటకాన్ని అందరూ ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అంతేకాదు నాటకంలో కొన్ని సమయాల్లో ఆ పాత్రల స్వరూప స్వభావాలను వెల్లడించడానికి క్రాస్‌లైటింగ్‌ను కొన్ని నాటకాలలో క్రాస్‌టాక్‌ను (ఒకరు మాట్లాడుతుండగా మధ్యలో మరొకరు చొచ్చుకుని మాట్లాడటం, ఒకేసారి ఇద్దరూ మాట్లాడటం) ప్రవేశ పెట్టిన నిత్య ప్రయోగశాలి. తెలుగునాటకాన్ని ఆధునికం చేయాలని నిత్య నవ్యతను, ప్రయోగశీలతను, సైకో ఎనాలిసిస్‌ను, సామాజిక స్పృహను నాటకంలో ప్రయోగించి విజయం సాధించిన చాట్ల నాటక కళకు ఒక నిఘంటువు. పాత్రలకు ప్రాణం పోయటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ప్రఖ్యాత నాటకరంగ ప్రముఖులయిన జె.వి. రమణమూర్తి, కె. వెంకటేశ్వరరావు, పొట్టి ప్రసాద్ లాంటి ఎందరో ఆయనకు సమకాలికులు. గొల్లపూడి మారుతీరావు చాట్లను దృష్టిలో పెట్టుకొని క్లిష్టమైన నాటక రచనలు (లావాలో ఎర్రగులాబీ లాంటివి) చేశారు. ఎందుకంటే కథలో, కథనంలో ఎంత క్లిష్టత ఉంటే చాట్ల కంత ఇష్టం. ఈ క్లిష్టతను ఇష్టంగా

స్వీకరించి నాటకంలో అందరికీ చేరువయ్యేలా చూపగల నేర్పు ప్రతిభ ఆయన సొంతం. గొల్లపూడి మాటలలో చెప్పాలంటే "చాట్ల శ్రీరాములు ఉదాత్తుడు, అవసరానికి ఆదుకోవటములో జేబునికాక మనసుని తడుముకునే మనసున్న మనిషి." మంచి నాటకం చదివితే ఆ పాత్రలతో క్షణాలమీద తాదాత్మ్యం పొందగలిగే సున్నిత మనస్కుడు. **కబీరుదాసు** (నందమూరి లక్ష్మీ పార్వతి రచనను డి. విజయభాస్కర్ నాటకంగా మలిచారు) నిజం నాటకాలస్క్రిప్ట్ విన్నప్పుడు ఆయన కంటతడి పెట్టారు.

అక్కినేని, ఆదుర్తిల సంయుక్త నిర్మాణంలో ప్రయోగాత్మకంగా వచ్చిన 'సుడిగుండాలు' చిత్రంలో ఆయన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాత్ర ధరించారు. జేగంటలు, స్వప్న, న్యాయంకావాలి చిత్రాలలో ఆయన పాత్ర పోషణకు ప్రేక్షకులు ముగ్ధులైనారు. 1954వ సంవత్సరంలో బెల్లంకొండ రామదాసు వ్రాసి ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉత్సవాలలో విజయం సాధించిన 'మాష్టర్జీ' నాటకంతో ఎనలేని పేరు సాధించిన చాట్ల, నాటకాన్ని కన్నతల్లిలా భావించారు. "ఎందరో ప్రతిభావంతులు నాటకరంగాన్ని విడిచి సినిమారంగానికి ఎగ బ్రాకుతున్నారు. మీరయినా నాటకరంగంలో ఉంటూ సేవ చేయాలని" చెప్పిన పాలగుమ్మి పద్మరాజు మిత్రవాక్యంతో ఆయన నాటక రంగంలోనే స్థిరపడిపోయారు. నాటకంలో ఎన్నో ప్రయోగాలను చేసి విజయం సాధించిన చాట్ల "నాటకంలో చేసే ప్రతి ప్రయోగం అతికేలా ఉండాలికాని, అతికించేలా ఉండకూడదని" అంటారు.

నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో నక్సల్స్ యొక్క హింసా ప్రవృత్తికి వ్యతిరేకంగా ఆయన నాటకాలు ప్రదర్శించారు. దానిపై గద్దర్ బండ బూతులు తిడితే, "గద్దర్ వంటి ప్రజా కళాకారుడు నన్ను తిట్టాడంటే, నా నాటకం ప్రజలలోకి చొచ్చుకి వెళ్ళిందని భావిస్తున్నానంటూ" నవ్వి ఊరుకున్నారు.

ప్రతిష్ఠాత్మకమైన బ్రిటిష్ డ్రామాలీగ్‌లో శిక్షణ పొందిన చాట్ల, ఈనాడు విక్టరీ మధుసూధనరావుచే నడపబడుతున్న మధు ఫిలిమ్ ఇనిస్టిట్యూట్‌లో ఆచార్యత్వం నిర్వహిస్తూ నటులను, సాంకేతిక కళాకారులను తీర్చిదిద్దుతున్నారు. నవతరంలోని సృజనను వెలికి తీస్తున్నారు. నాటకానికి కొత్త వెలుగు ప్రసాదిస్తున్నారు.

ఆయనకు పేరు తెచ్చిన పాత్రలు ఎన్నో ఉన్నాయి. నటునిగా ఆయనకు పరిపూర్ణ సంతృప్తి కలిగించినవి ఎర్రగులాబీలు (శేఖర్), గోటూహెల్ (రామశాస్త్రి), నాటకాంతం (అప్పాజి). ఇది ఆయనకు అత్యంత ఇష్టమైన పాత్ర. ఒకప్పుడు ప్రజలను ఉర్రూతలూగించిన ఒక మహానటుని వార్ధక్యంలో కన్నబిడ్డే తండ్రిని దొంగగా ముద్ర వేయడంతో అతని అంతరంగ చిత్రీకరణ).

ప్రయోక్త (అంటే నటుడని అర్థం). మంచి నటుడికి ఉండవలసిన లక్షణాలు:

కుశలురు (గృహిణి, ధారణ జ్ఞాన ప్రయోగ యోగ్యులు)
విదగ్ధులు (ఊహాపోహ సమర్థులు)
ప్రగల్భులు (సభాకంపం లేనివారు)
జితశ్రములు (శ్రమను జయించినవారు)
గ్రహణము (గురు ముఖతః గ్రహించినవారు)
ధారణము (గ్రహించిన దానిని మరచి పోకుండుట)
జ్ఞానము (గ్రహించిన దానిని అర్థం చేసుకొనుట)
ప్రయోగం (సభారంజకంగా ప్రదర్శించుట)

ఊహము అంటే పరిజ్ఞాన చిత్తం (రూపక కర్త ఆశయాన్ని గ్రహించటం) అపోహము అంటే కర్తవ్యతా జ్ఞానం (ఆ రూపకాన్ని తాను ఎలా ప్రదర్శించుకోవాలో నిర్ణయించు కోవటం).

భరతుడు నాట్యశాస్త్రం దాని 26వ అధ్యాయంలో, మేధ (శీఘ్ర గ్రహణశక్తి); స్మృతి (జ్ఞాపకాలు), గుణశ్లాఘ (తోటి నటుల ప్రతిభను హృదయపూర్వకంగా అభినందించగల సహృదయత); రాగం (ప్రయోగంపట్ల ఆసక్తి) సంఘర్షణ (ప్రతిభపట్ల ఆరోగ్యకరమైన స్పర్థ, పట్టుదల, ఉత్సాహాల కలయిక) భరతుడు పేర్కొన్న ఈ అన్ని లక్షణాలు కలవాడే చాట్ల.

చాట్ల జీవితం ఎంతో విస్తృతమయింది. అందుచేతనే నేమో చాట్ల జీవితాన్ని **"అభినయ భరతాచార్య డాక్టర్ చాట్ల శ్రీరాములు"** పేరుతో డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు గారు వ్రాయడానికి తొమ్మిది వసంతాలు శ్రమించారు.

చాట్ల నిగర్వి, స్నేహశీలుడు. హృదయంలో తడియారని దయాళువు! చాట్లని 'మిసిమి' పుటల్లో పరిచయం చేయటం కొండను అద్దంలో చూపడమే!

**– మిసిమి**

నోబెల్ సాహితీ పురస్కార స్వీకారోపన్యాసం

# అతనూ - అతని మనిషీ

*"బయటి వ్యక్తి ఎన్ని మారువేషాలతో, ఎన్నెన్ని ముసుగులతో ఆశ్చర్యకరంగా మన జీవితంలో కలుగజేసుకొంటాడు అనే విషయాన్ని అత్యద్భుతంగా చిత్రించ గలిగినందుకు ఈ పురస్కారం!*

*ఆయన రచనలన్నీ శిల్పచాతుర్యంతో చిత్రీకరింపబడి విలక్షణమైన శైలిలోవుంటాయి.*

*భావగర్భమైన సంభాషణలు, నిశితమైన పరిశీలనా దృక్పథం, వివేకవంతమైన సంశయాత్మకత ఆయన రచనలలో పొడసూపుతాయి. పాశ్చాత్య సంస్కృతిలోని బాహ్యాడంబర నైతికతనూ, నిర్దాక్షిణ్యమైన హేతుబద్ధతను నిశితంగా విమర్శించాడు.*

*ఆయన మేధోపరమైన నిజాయితి ఎటువంటి సానుభూతిని ఆశించకనే చౌకబారు పశ్చాత్తాపానికి, గ్లానికి దూరంగా వుండిపోతుంది.*

*ఆయన నమ్మిన సిద్ధాంతాల దర్శనం కోసం– నోరు లేని జీవాల హక్కుల సమర్ధనలాంటి వాటి కోసం–వాదనలు పెట్టుకోవడంలో అంతగా నమ్మకం లేనివాడు.*

*ఏది తప్పు – ఏది ఒప్పు? ఈ తర్కం దేనికీ దారి తీయదని విశ్వసిస్తాడు.*

*ఈ విధమైన సంఘర్షణా సన్నివేశాలతో ఆయన రచనలలోని పాత్రలన్నీ మనముందు నిలబడతాయి.*

*చరిత్ర కథనంలోని అసత్యపు ఆర్భాటాలు ఎంత జుగుప్సాకరంగా వుంటాయో వివరిస్తూ అందులో మరుగుపడిన వ్యక్తులను, మూగపోయిన గొంతులను తన కథల్లో పలికించాడు.*

*క్లుప్తంగానే కాని, గాఢంగా, కవిత్వ, సాహిత్యరీతుల నైతికతను, చైతన్యాన్ని సమర్థించాడు. అవి లేకపోతే మన అస్తిత్వాలను చూడడానికి వెనుకాడే అధికార గణంలో చేరిపోతామన్నాడు!"* అంటూ స్వీడిష్ అకాడెమీ ప్రశంసించింది.

*– సం॥*



**జాన్ మాక్స్‌వెల్ కోయిట్జీ**

"ఇక నా కొత్త సహచరుణ్ణి గురించి – అతనివల్ల నాకు చాల సంతోషం కలిగింది. అతడు ఉపయోగకరంగా, అందుబాటుగా, సహాయకరంగా వుండేందుకుగాను అతనికి అన్ని విషయాలు బోధించడం ప్రారంభించాను, ముఖ్యంగా మాట్లాడడం, నేను మాట్లాడినప్పుడు అర్థం చేసుకోవడం. అతను అక్కడ నాకు దొరికిన ఖచ్చితమైన అంతేవాసి." డేనియల్ డిఫో (రాబిన్‌సన్ క్రూసో)

"లింకన్‌షైర్ సముద్రతీరానవున్న బోస్టన్ చాలా అందమైన బస్తీ. ఇంగ్లండులోకల్లా

తెలుగు సేత : బి.వి. రామిరెడ్డి, ఫోన్ : 9908856530



అత్యంత ఎత్తయిన చర్చి శిఖరం అక్కడ వుంది. సముద్రపు పైలెట్లు ఆ మీదుగా నావల్లో పయనిస్తుంటారు. బోస్టన్ చుట్టూ తేమతోకూడిన భూములున్నాయి. శకున పక్షులు బరువైన మూలుగులతో బిగ్గరగా అరుస్తుంటాయి. ఆ మూలుగులు తుపాకీ శబ్దాల్లా రెండుమైళ్ళ దూరం వినిపిస్తాయి" అని అతని మనిషి వ్రాస్తాడు.

ఈ లింకన్ షైర్‌లో మచ్చిక బాతులకోసం ప్రత్యేకమైన నీటి చెరువులున్నాయి. వాటిని మచ్చిక చేసుకునేందుకు చేతితో ఆహారాన్నందిస్తుంటారు. రుతువు వొచ్చాక వాటిని హాలెండ్, జర్మనీలకి పంపుతారు. ఆ దేశాల్లో అవి తమలాంటి పక్షుల్ని కలుస్తాయి. ఆ జర్మన్, డచ్ పక్షులు ఎంతదీనంగా బతుకుతున్నాయో, అక్కడి నదులు శీతాకాలంలో ఎలా గడ్డకట్టి పోతాయో, వారి భూములన్నీ మంచులో ఎలా కప్పబడి పోతాయో తెలుసు కుంటాయి. ఒక రకమైన భాషద్వారా ఈ విషయాలన్నింటిని తెలియజేస్తాయి. అవి వొచ్చిన ఇంగ్లాండులో మాత్రం పరిస్థితి భిన్నంగా వుంటుంది. ఇంగ్లీషు బాతులకు పుష్కలమైన ఆహారంతో నిండివున్న సముద్ర తీరాలున్నాయి. అలలు చొచ్చుకొచ్చేందుకు జాలులున్నాయి. సరస్సులు, నీటి ఊటలు, నీటిగుంటలు, చెట్లతో కమ్ముకున్న నీటి కయ్యలు మొదలైనవి ఎన్నో వున్నాయి. పొలాలనిండా పరిగ ఏరకుండా వొదిలివేయబడ్డ ధాన్యాలున్నాయి. హిమపాతాలు, పొగమంచులు అక్కడ తక్కువ.

ఇలాంటి విషయాలు చెప్పి, మచ్చిక బాతులు మిగిలిన సముద్రపు బాతులకు దగ్గరౌతాయి. ఆ విధంగా వాటిని ఆకర్షించి తమతో తీసుకుపోతాయి. అవి వాటికి మార్గనిర్దేశం చేసి హాలెండ్, జర్మనీల నించి సముద్రాల్ని దాటించి, తెచ్చి, తమ పెంపుడు చెరువుల్లో నివాసం ఏర్పరుచుకునేట్టు చేస్తాయి. తమ భాషలో, వాటితో, తాము చెప్పిన నీటి చెరువులు ఇవే అంటాయి. ఇక్కడ బోలెడంత రక్షణ వుంటుందని చెబుతాయి.

అవి అక్కడ నివాసం ఏర్పరుచు కున్నప్పుడు డెకాయ్ మనుషులు తాము తయారుచేసిన రెల్లు పొదల్లోకి దూరి, కనుపించకుండ, నీటి మీద ధాన్యాన్ని చల్లుతారు. పెంపుడు బాతులు తాము తీసుకు వచ్చిన విదేశీ అతిథి బాతులతో ఆ ధాన్యం చల్లబడ్డ చోటికి వొస్తాయి. రెండు మూడు రోజులు అలా తమ అతిథుల్ని తీసుకెడతాయి. ఇంగ్లండులో తామెంత సౌఖ్యంగా జీవిస్తున్నాయో చూపెడుతుంటాయి. నెమ్మదిగా వలల్లోకి నడిపిస్తాయి.

అప్పుడు పెంపుడు బాతుల మనుషులు, తమ పెంపుడు కుక్కల్ని పంపుతారు. వాటికి ఈత ఈదుతూ, మొరగడం చక్కగా నేర్పించి వుంచుతారు. ఆ భయంకరమైన జంతువును చూసి, భయపడి, ఆ బాతులు ఎగిరేందుకు ప్రయత్నించి, పైనకట్టివున్న వలలకు తగిలి మళ్ళీ నీళ్ళలోపడి ఈదవలసి వుంటుంది. పైన కట్టిన వల నెమ్మదిగా కుచించుకుపోతుంది. చివరికి ఎదురుగా వొచ్చిన బాతు మనుషులు వాటిని ఒకటొకటిగా పట్టుకుంటారు. తమకు సాయపడ్డ పెంపుడు బాతుల్ని ఆప్యాయంగా దువ్వుతారు. పాపం! ఆ విదేశీ అతిథులు వందలుగా, వేలుగా అమ్మబడతాయి.

లింకన్ షైరుకు సంబంధించిన ఈ వార్తలన్నింటిని 'అతని మనిషి' ఈక పెన్నుతో చక్కగా వ్రాసి పంపుతాడు. అతడే మరో విషయం రాస్తాడు – హాల్‌ఫాక్స్‌లో, కింగ్‌జేమ్స్–I దాన్ని తీసివేయించేదాకా శిక్షను అమలు చేసే యంత్రం వుండేది. ఎవరికైతే మరణశిక్ష పడిందో అతని తలను దిమ్మె మీద ఉంచి, శిక్షకుడు ఆ యంత్రానికున్న ఒక మేకును తీసివేసేవాడు. బరువైన పెద్ద పదునైన కత్తి క్రిందికి వేగంగా పడి ఆ నేరస్తుడి తలను నరికి వేసేది. హాలీఫాక్స్‌లో ఒక ఆనవాయితీ వుంది. అది–ఆ మేకును శిక్షకుడు తీసివేసే లోపల ఆ శిక్షననుభవించాల్సిన మనిషి ఒక్క ఉదుటిన కొండక్రిందికి పరుగెత్తి, నదిని అడ్డంగా ఈది, పారిపోగలిగితే, అతణ్ణి వొదిలేసే వారు. హాలీఫాక్స్‌లో ఆ యంత్రం వున్నంతకాలం ఎప్పుడూ అలాంటి సంఘటన జరగలేదు.

ప్రస్తుతం 'అతని మనిషి' కాదు – అతనే బ్రిస్టల్‌లో తన గదిలో కూచుని తన మనిషి వ్రాసిన విషయాలను చదువుతాడు. ప్రస్తుతం అతను ముసలివాడయ్యాడు. ముఖచర్మం వేడివల్ల నల్లబడింది. ముక్కు మీద నల్లని మచ్చ. అతని గొడుగు అతని గదిలోనే ఓ మూల వుంది. తనతో వొచ్చిన చిలక చనిపోయింది. పాపం, రాబిన్! అది అతని భుజంమీద కూచుని పొడుస్తుండేది. పాపం! రాబిన్ క్రూసో! అతన్నెవరు రక్షిస్తారు? అతని భార్య ఆ పక్షిగోలని భరించలేక

పోయేది. దాని గొంతు పిసికేస్తాననేది. కాని, అంత ధైర్యం చెయ్యలేకపోయింది.

అతను తన ద్వీపం నుంచి తన చిలుకతో ఇంగ్లండుకు తిరిగొచ్చాక, అతని పెట్టెనిండా సంపద. కొంతకాలం తన ముసలి భార్యతో, హంటింగ్టన్‌లోని తన ఎస్టేట్‌లో ప్రశాంతంగా జీవించాడు. అతను చాలా ధనవంతుడయ్యాడు. తన సాహస కృత్యాలతో కూడిన తన పుస్తకాన్ని ప్రచురించాక మరింత ధనవంతుడయ్యాడు. అయితే అతడు ఆ ద్వీపంలో నివసించిన సంవత్సరాలు, తన సేవకుడు ఫ్రైడేతో చేసిన ప్రయాణాలు అతని జీవితాన్ని స్తబ్ధంగా తయారుచేశాయి. నిజం చెప్పాలంటే, అతని వైవాహిక జీవితం కూడా నిరాశాజనకమే. పోనుపోను అతను తన గుఱ్ఱాలతోనే గడిపాడు. అవి మాట్లాడలేకపోయినా, సకిలించి, తాము అతణ్ణి అర్థం చేసుకున్నామని తెలియజేసేవి.

ఆ ద్వీపం మీద ఫ్రైడే వొచ్చే వరకు అతను నిశ్శబ్దంగా జీవించాడు. అతను భార్యతో కలసి పడుకున్నప్పుడు అతని తలమీద గవ్వలవాన కురిసినట్టు ఫీలయ్యేవాడు. అతని భార్య అతణ్ణి శాశ్వతంగా వొదిలివేసి వెళ్ళిపోయినపుడు ఏడ్వాడు కాని, విచారపడలేదు. ఆవిణ్ణి మట్టిచేశాక బ్రిస్టల్ వొద్దున గది తీసుకున్నాడు. తన హంటింగ్టన్ ఎస్టేటును తన కుమారుడి పర్యవేక్షణకు వొదిలివేశాడు. తనతో ఆ ద్వీపం నుంచి తెచ్చుకున్నదీ, తనను ప్రసిద్ధుణ్ణి చేసినవీ అయిన ఆ పెట్టెను, కొన్ని అత్యవసర వస్తువులను తనతో తెచ్చుకుని వొంటరిగా జీవించాడు. రోజంతా పైప్ పిలుస్తూ సముద్రం వొద్దున తిరిగేవాడు. సంఘజీవనం అతనికి ఆనందాన్నివ్వలేదు. అతడు ఏకాంతవాసానికి అలవాటుపడినాడు.

అతడేమీ చదివేవాడుకాదు. అతనికి పఠనంమీద ఆసక్తిపోయింది. తన సాహసకార్యాలను గురించి వ్రాసుకోవడం అతనికి అలవాటయింది. అదే అతనికి సత్కాలక్షేపం. సాయంసమయాల్లో కాగితాలు బయటికి తీసి, ఈక పెన్నును చెక్కుకుని తన మనిషిని గురించి ఒకటి రెండు పేజీలు వ్రాస్తాడు. లింకన్ షైరునించి బాతుల గురించి అతడు పంపిన సమాచారం, హాలీఫాక్స్‌లోని నేరస్తుల్ని చంపే యంత్రం గురించి తెలుసుకుంటాడు. హార్బర్‌గుండా ప్రక్కగా నడుస్తూ హాలోఫాక్స్ యంత్రాన్ని గురించీ, రాబిన్ గురించీ ఆలోచిస్తాడు. దేవుని కరుణ వేగవంతమయింది. ఆ యంత్రపు పదునుకత్తి అంతకంటె వేగవంతమైనదా? మనం దాన్ని ఎలా తప్పించుకోగలం? ఏ మనిషి దేశమంతా తిరుగుతూ, మృత్యు దృశ్యాలను చూస్తూ రిపోర్టు చేస్తుంటాడు?

అతడు తనను వ్యాపారస్తుడిగా తనలోతనే ఆలోచించుకుంటాడు. అతడు ధాన్య వ్యాపారో, చర్మాల వ్యాపారో అనుకుందాం, లేదా ఇంటి కప్పు పెంకులు తయారు చేసేవాడు, కప్పేవాడు అనుకుంటే అతడు విస్తృతంగా పయనించాలి. అతడు బాగా వృద్ధిలోకి రావాలి. అతనికో భార్య నివ్వాలి. భార్య అతణ్ణి ప్రేమించాలి. ఎక్కువగా వాగకూడదు. అతనికి పిల్లల్ని కనాలి – ప్రధానంగా ఆడపిల్లల్ని. అతనికి సంతోషం కలగాలి. హఠాత్తుగా అతని సంతోషం అంతమవ్వాలి. ఏ శీతాకాలంలోనో థేమ్స్‌నది పొంగుతుంది. పెంకులు కొట్టుకు పోతాయి. ధాన్యపు గోదాములు తుడిచి పెట్టుకుపోతాయి. చర్మ వస్తువులు ఊడ్చివేయబడతాయి. అతడు సర్వనాశనమయ్యాడు. అతని మనిషి నాశనమయ్యాడు. అప్పులవాళ్ళు ఈగల్లాగ ఎగబడ్డారు. ఇంటిని వొదిలి, పెళ్ళాం పిల్లల్ని తీసుకుని పారిపోయి, అడుక్కు తినేవాళ్ళ గొందిలో దొంగపేరుతో మారువేషంలో దాక్కుంటాడు. ఇదంత ఒక పోలిక – పడవమునక, ద్వీపం, రాబిన్ ఈ ప్రపంచాన్నించి 26 సంవత్సరాలు ఒంటరై పోవడం, పిచ్చెక్కినంతపని.

అతను జీన్లు తయారుచేసే వాడయితే అతనికో యిల్లు, ఒక షాపు, వైట్‌ఛాపెల్‌లో ఒక గోడౌను, గడ్డం మీద ఒక మచ్చ, ప్రేమించే భార్య, ఎక్కువగా వాగనిది, అతనికి ఆడపిల్లల్ని కని సంతోషాన్నిస్తుంది. ఇంతలో పట్టణంలో ప్లేగు వ్యాపిస్తుంది. అది 1665వ సంవత్సరం. ఇంకా లండన్ పట్టణంలో ఆ ఘోర అగ్ని ప్రమాదం జరగలేదు. లండన్ నగరం మీద



జాన్ మాక్స్‌వెల్ కోయిట్జి

ప్లేగువ్యాధి వచ్చిపడింది. రాజులు, ధనవంతులు, పేదలు తేడా లేకుండా అసంఖ్యాకపు చావులు. జీన్ల వ్యాపారంతో ధనవతుండైన ఆ మనిషిని డబ్బు కాపాడలేదు. భార్యా పిల్లల్ని పట్టణానికి దూరంగా పల్లెకు పంపించి వేశాడు. తను కూడా పారిపోవడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. బైబిలు గ్రంథాన్ని అదరాబాదరా తెరిస్తే అందులో వాక్యం–"రాత్రి భయాలకు భయపడకు, పగలు ఎగిరి వొచ్చే బాణంగాని, చీకట్లో నడిపించే రోగం గాని, మధ్యాహ్నాన్ని నాశనం చేసే వినాశనంగాని వీటికి వేటికీ భయపడకు. నీకు ఒక ప్రక్క వెయ్యిమంది, మరో ప్రక్క పదివేలమంది పడిపోతారు కాని అది నిన్నేమీ చేయలేదు".

అతడు లండన్‌లోనే వుండి నివేదికలు వ్రాస్తుంటాడు. వీధిలో ఒక గుంపు ఎదురయింది. వాళ్ళమధ్యలో ఒక స్త్రీ చెయ్యెత్తి స్వర్గంవేపు చూపుతోంది. ఆవిడ అంటోంది – "దేవమాత తెల్లని ఆహార్యంతో, చేతిలో భగభగమండుతున్న ఖడ్గంతో దిగి వస్తోంది. చూడండి." ఆ గుంపు తమలో తాము తలలూపుతారు. 'నిజంగా అంతే–దేవదూత ఖడ్గంతో' అంటారు. మన జీన్లు తయారుచేసే అతనికి దేవదూత, ఖడ్గం ఏవీ కనబడవు. అతనికొక్కనిపించిందల్లా ఒక విచిత్రమైన ఆకారాన్ని తీసుకున్న ప్రకాశవంతమైన మేఘశకలం.

అతడు లండన్‌లోనే వుండి నివేదికలు వ్రాస్తుంటాడు. వీధిలో ఒక గుంపు ఎదురయింది. వాళ్ళమధ్యలో ఒక స్త్రీ చెయ్యెత్తి స్వర్గంవేపు చూపుతోంది. ఆవిడ అంటోంది - "దేవమాత తెల్లని ఆహార్యంతో, చేతిలో భగభగమండుతున్న ఖడ్గంతో దిగి వస్తోంది. చూడండి." ఆ గుంపు తమలో తాము తలలూపుతారు.'నిజంగా అంతే-దేవదూత ఖడ్గంతో' అంటారు. మన జీన్లు తయారుచేసే అతనికి దేవదూత, ఖడ్గం ఏవీ కనబడవు. అతనికొక్కనిపించిందల్లా ఒక విచిత్రమైన ఆకారాన్ని తీసుకున్న ప్రకాశవంతమైన మేఘశకలం.

'అదంతా ఒక ప్రతీకాత్మకమైన కథ' – అని ఆ స్త్రీ అరుస్తుంది. అతనికి తన జీవితంలో అలాంటి కథలే వున్నట్టు అనిపించదు. అదే విషయాన్ని అతడు తన రిపోర్టులో వ్రాస్తాడు.

మరో రోజున వాకింగ్‌లో నది వొడ్డున నడుస్తున్నాడు. ప్రస్తుతం అతనికి ఏ వృత్తీలేదు. ఎవరో ఒక స్త్రీ తన గుమ్మంలో నించుని రాబర్ట్, రాబర్ట్ – అని పిలుస్తోంది. ఒకతను వొడ్డుకువొచ్చి, నదివొడ్డున రాతిమీద ఒక సంచిని వుంచి మళ్ళీ నదిలోకి వెళ్ళిపోతాడు. ఆ స్త్రీవొచ్చి, ఆ సంచిని తీసుకుని విచారంగా ఇంటికి వెళ్ళిపోతుంది. ఆ రాబర్ట్ అనే అపరిచితునితో అతడు మాట్లాడతాడు. ఆ స్త్రీ తన భార్య అనీ, తన భార్యా పిల్లలకి ఒక వారానికి సరిపడే నిత్యావసరాలు ఆ సంచిలో వున్నాయనీ; ఆమె పిల్లల దగ్గరికి వెళ్ళే ధైర్యం తనకు లేదనీ, వాళ్ళకి ప్లేగు వచ్చిందేమోనని భయమనీ, అలా తన గుండెలు బాధతో పగిలి పోతున్నాయనీ చెబుతాడు. ఈ కథంతా రాబిన్‌సన్ యొక్క ఆ దీవిలోని ఏకాంతవాసాన్ని తెలియజేసే అలంకారికమైన కథ.

అతడు గొప్ప నిరాశలో కుమిలిపోతున్నప్పుడు, ఎలుగెత్తి ఇంగ్లండులో వున్న తన వాళ్ళను పిలిచేవాడు. ఆ బాధాకాలంలో మరొక రిపోర్టు – తన చంకలో వొచ్చిన వాపు వల్ల కలిగే బాధ భరించ శక్యం కాకుండా వుంది. అది ప్లేగుకు గుర్తు. నగ్నంగా వొక మనిషి వీధిలోకి పరుగెత్తి, ఏవో సైగలు చేస్తుంటాడు. అతని భార్యా పిల్లలు అతని వెనుక ఏడుస్తూ పరుగెడుతుంటారు, వెనక్కి వొచ్చేయమని ప్రాధేయ పడుతుంటారు. అతని చిందులు, ఎగరడాలు కూడా అలంకారికమే. ఓడ మునిగిపోయాక, తన సహచరులెవ్వరూ కనుపించకుండా పోయాక, తానొక ప్రమాదకరమైన దీవి మీద ఒంటరిగా మిగిలినట్లు గ్రహించాక, తనకిక రక్షణ, విముక్తి లేక నశించిపోవడం ఖాయమని తెలిశాక అతని స్థితికి ఈ కథ ప్రతీక.

సంవత్సరం క్రితం రాబిన్‌సన్ బ్రెజిల్ నించి తెచ్చిన ఒక ఆకుపచ్చని చిలుకను రెండు గినీలకు కొన్నాడు. అది పూర్‌పూర్ పూర్‌పూర్ అంటూ వుంటుంది. దానికింకేమీ మాటలు రావు. తనగదికున్న చిన్న కిటికీలోంచి ఓడ స్థంభాలశిఖరాలమీదుగా అట్లాంటిక్‌ని చూస్తూ – ''ఇది ఏమి దీవి? నేనిక్కడ విసిరివేయబడ్డాను. భయంకరమైన చలి! నా రక్షకుడా! నా యీ అత్యవసరసమయంలో నీ వెక్కడ వున్నావు?'' అని అడుగుతాడు.

రాత్రి పొద్దుపోయింది. ఒకడు తాగి క్రిపుత్‌గెట్టో ప్రాంతంలో ఒక గుమ్మంముందు పడిపోయి, నిద్రలోకి జారుకుంటాడు. చనిపోయిన వాళ్ళను తీసికెళ్ళే మహాప్రస్థాన వాహనం వొస్తుంది. వాడు చచ్చాడనుకుని, ఎత్తి ఆ వాహనంలోని శవాలలో పడేస్తారు. ఆ వాహనం మౌంట్‌మిల్‌లో ఆ శవాలను పూడ్చి పెట్టే చోటికి వొస్తుంది.

అతడు గభాల్న లేచి, అయోమయంలో–'నేనెక్కడున్నాను? అంటాడు. "నిన్ను ఈ చచ్చిన వాళ్ళతో పూడ్చేస్తాం" – అంటాడు బండివాడు. "అయితే నేను చచ్చిపోయానా?" అంటాడతను. ఆ దీవి మీద అతని జీవితానికి ఇదీ వొక ప్రతీకే.

కొంతమంది లండన్ వాసులు, వాళ్ళ పనులమీద వెడుతుంటారు. వాళ్ళు తాము ఆరోగ్యవంతులమనీ, తమకు గండం తప్పిందనీ అనుకుంటారు. అయితే వాళ్ళకి తెలియకుండా వాళ్ళ రక్తంలోకి ప్లేగు ప్రవేశించింది. ఆ జబ్బు గుండెలదాకా చేరాక వాళ్ళు హఠాత్తుగా చనిపోతారు. ఇది మొత్తం మానవ జీవితానికే ప్రతీక. మనం మృత్యువు కోసం సరైన విధంగా తయారవ్వాలి. లేకపోతే ఎప్పుడో ఉన్న పళాన పడిపోతాం. రాబిన్‌సన్ తన ఏకాంత దీవిమీద, హఠాత్తుగా, మనిషి పాదముద్రల్ని చూశాడు. అది మనిషిగుర్తు. ఆ గుర్తు "నీవు ఒంటరి వాడివి కావు. ఎంత దూరం వెళ్ళినా, ఎక్కడ దాక్కున్నా నీ ఉనికి తెలిసి పోతుంది" అని తెలియజేస్తుంది.

అతడు వ్రాస్తున్నాడు – ప్లేగు వచ్చిన సంవత్సరం చాలామంది, భయంవల్ల, పెళ్ళాల్ని పిల్లల్ని అందర్నీ వొదిలేసి లండన్ పట్టణానికి సాధ్యమైనంత దూరంగా పారిపోయారు. ప్లేగు పోయాక అందరూ అలా పారిపోవడం పిరికితనం అని నిందించారు. ప్లేగును ఎదుర్కోవడం ఎలాంటి ధైర్యమో మనం మర్చిపోతాం. అది సైనికుడి సాహసంకాదు; అది మృత్యువు మీద చేసే యుద్ధం.



స్వీకారోపన్యాసం

అతని చిలుక అతను నేర్పని ఏ మాటనూ ఉచ్చరించ లేదు. మరి అతని మనిషికి మాత్రం తన యజమాని కంటె బాగా వ్రాయడం ఎలా సాధ్యమైంది. పెంపుడు బాతులు, వాటి యజమానులగురించి రాబిన్‌సన్ కేం తెలుసు? అతని మనిషి వాళ్ళను గురించి వ్రాసేదాకా అతనికేమీ తెలియదు.

లింకన్‌షైర్ పెంపుడు బాతుల వ్యవహారం, ఉరివేసే యంత్రం మొదలైన వాటిని గురించి వ్రాస్తూ అతని మనిషి బ్రిటన్‌ను తన స్వంత దీవిని చేసుకున్నాడనిపిస్తుంది. ఈ ద్వీపం మీద అనుకరణవాదులవిగాక ప్రజలకు తమకు దూరం చేయబడ్డ జీవితాన్ని గురించి కథలు కల్పించి చెప్పారు. వాళ్ళని అతడు నరమాంస భక్షకులుగా భావించాడు. అతను వ్రాశాడు –నరమాంస భక్షకుల నుండి నన్నునేను రక్షించుకుంటున్నపుడు వాళ్ళు నన్ను చంపి, బాగా వేయించి, ముక్కలుగా చీల్చి తినాలని చూశారు. వాళ్ళు రాక్షసపు ఆకలిగాళ్ళని నేను ఊహించలేదు.

ఇప్పుడతని హృదయంలో సాటి మనుషులయెడ, ఈ అనుకరణ వాదులయెడ కొంచెం మానవతా స్పందన యేర్పడింది. అతనికిప్పు డనిపిస్తోంది – ఈ ప్రపంచంలో కొద్ది కథలే వున్నాయని. యువకులకు అవకాశం యివ్వకపోతే వాళ్ళు శాశ్వతంగా నిశ్శబ్దంలో వుండి పోవలసిందే. ఆ విధంగా అతడు ఆ దీవిలోని సాహసకృత్యాలను వల్లించే క్రమంలో అతనొక రాత్రి సైతాను పెద్దకుక్క రూపంలో తనమీద పడ్డట్టు భయపడిపోయి మేల్కొన్నాడు. లేచి, తనను రక్షించుకునేందుకు ఒక తుంటె కర్రను తీసుకుని కుడియెడమలకి విసురుతూ వుంటే, తన మంచం ప్రక్కనే వున్న చిలక భయంతో అరిచింది. చాలా రోజుల తరువాత అతను గ్రహించాడు – తనమీద దయ్యమూ, కుక్కా ఏవీ పడలేదనీ, అది కేవలం తన భ్రమ మాత్రమేననీ, నిద్రలో తాను కాలు కదపలేకపోవడంవల్ల దానిమీద ఏదో వుందని భ్రమించాడు. చివరికి గ్రహించుకున్నదేమంటే – భ్రమయే సైతాను అని. అందుచేత సైతానును గురించిగాని, ప్లేగు గురించి గాని కథలు వ్రాసేవాళ్ళని ఫోర్జరీ గాళ్ళుగానో, దొంగలుగానో అనుకోవాలి.

సంవత్సరాల క్రితం అతను తన దీవి అనుభవాలను గ్రంథస్థం చేయాలని నిర్ణయించాడు. అయితే మాటలకోసం తడువుకోవలసి వచ్చేది. కలం ముందుకు సాగేదికాదు. చేతులు కూడా మొద్దుబారి సహకరించేవి కావు. రోజు రోజుకు, నెమ్మది నెమ్మదిగా వ్రాయడంమీద అధికారం సాధించాడు.

ఫ్రైడేతో కలిసి, శీతలానికి బిగుసుకుపోయిన ఉత్తర ప్రాంతానికి సంబంధించిన సాహసకృత్యాలదాకా రచన బాగానే సాగింది.

వ్రాతలో పూర్వపు వెసులుబాటు తననించి వెళ్ళిపోయింది. తన చిన్న వ్రాతబల్ల ముందు కూచున్నపుడు కిటికీలోంచి బ్రిస్టల్ హార్బరు కనుపించేది, చేతిలో పెన్ను ఇదివరకులాగ నిలిచేదికాదు.

మరి అతని మనిషికి తనకులాగ వ్రాయడం యిబ్బంది కరంగా లేదా? అతను బాతుల్ని గురించీ, చంపే యంత్రాన్ని గురించీ, లండన్ ప్లేగు గురించీ వ్రాసే కథలు అందంగా వచ్చాయి. ఇదివరలోనూ అంతే. అతడు తనని సరిగా అంచనా వేసుకోలేదనుకుంటాను. ఆ చిన్న మనిషి ఈ క్షణాల్లో, తన అద్దె గదిలో వొంటరిగా కూచుని, కలాన్ని సిరాలో ముంచుతూ, ఎన్నో సందేహాలతో వెనకా ముందాడుతూ మరీ మరీ ఆలోచిస్తుంటాడు.

అతణ్ణీ, అతని మనిషినీ ఎలా అనుకోవాలి? యజమాని బానిస ననుకోవాలా? కవలసోదరులనుకోవాలా? యుద్ధంలో భాగస్వాములనుకోవాలా? శత్రువులనుకోవాలా? తనతో సాయంత్రాలనీ, ఒక్కోసారి రాత్రులనీకూడా తనతో పంచుకున్న ఆ పేరులేని మనిషికి ఏ పేరు పెట్టాలి? పగలు మాత్రం కనుపించక తీరంమీద నడుస్తూ, కొత్తగా ఎవరైనా వొచ్చారేమోనని పరిశీలనచేస్తూ తిరిగే రాబిన్‌ని ఏమని పిలవాలి?

అతను తన ప్రయాణాల్లో బ్రిస్టల్‌కి వొస్తాడా? అతణ్ణి కలుసుకుని, కరచాలనం చేసి, అతనితో ఆ తీరాన నడుస్తూ, వ్రాతలో అతని సాహసకృత్యాలని గురించి మాట్లాడాలని వుంది కాని, అతనికి భయం – ఈ జీవితంలో అతణ్ణి కలుసుకోవడం కుదరదని. తామిద్దరూ కలిసి స్థిరపడాలంటే తాము వ్యతిరేక దిశలలో, పశ్చిమానికీ, తూర్పుకూ పయనించే ఓడల్లాగ వుంటామని వ్రాస్తాడు; లేదా అలాంటి ఓడల్లో, శుభ్రం చేసే పనిమనుషుల్లాగ వుంటారు. వారి ఓడలు ఒకదాన్నొకటి కూతవేటు దూరంలోనే దాటిపోతాయి. కాని, సముద్రం అల్లకల్లోలంగా వుంది, తుఫాను వాతావరణం; చూసుకుందామన్నా ఆ తుఫాను నురగల పొగమంచులో వొకరి కొకరు కనుపించరు. ప్రక్కనించే వెళ్ళిపోతారు. చేతులనిండా చెత్తా చెదారం. పనివొత్తిడిలో ఒకరి కొకరు చేతులూ ఊపుకోరు!

---

## పెద్ద మనుష్యులు

ఒక నాటకశాలకు రెండు ప్రక్కలా ద్వారములున్నవి. ఒక ద్వారం మీద "పెద్ద మనుష్యులు" అని వ్రాసి వున్నది. రెండవ ద్వారంపైన 'స్త్రీలు' అని వున్నది. ఈ వ్రాతలు చూచి మేము నవ్వుకొన్నాము. మానవజాతినంతా రెండు విభాగాలు చేసి ఒక విభాగానికి 'పెద్ద మనుష్యుల'ని, రెండవదానికి 'స్త్రీలు' అని పేరు పెట్టించారు ఆ హాలు యజమానులు.

"ఈ రెండు శాఖల క్రిందనే మానవజాతి విభజింపబడినది కాబట్టి 'స్త్రీలు' కాని వాళ్లంతా పెద్ద మనుష్యుల క్రిందే లెక్క" అని నేను అర్థం తీశాను.

ఆ మాట మీద మిత్రుడు శ్రీ బాపిరాజు, నరసింహారావుతో అంటాడు "అల్లాగ కాదండి మాస్టారూ, పెద్ద మనుష్యులు కాని వారంతా స్త్రీల క్రిందే లెక్క" అని ఆయన అల్లాగ చమత్కరించాడు.

"అయితే మనం ఎవరము అయినట్లు" అని అడిగాను నేను.

"మనలను ఎవరు పెద్ద మనుష్యులంటారండి! మనం స్త్రీల క్రిందే లెక్క" అని నవ్వినాడు మిత్రుడు.

**- మునిమాణిక్యం నరసింహారావు**

# ముళ్ళపూడి వెంకటరమణ – నేను

**బా**పూ రమణలజంట తెలుగువారందరికీ సుపరిచితమే. రమణకి కాలేజీ విద్య లేకపోయినా విస్తృత పఠనంవల్ల, పరిశీలనవల్ల ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకున్న విద్యాధికులు. మాయిద్దరి మధ్య జరిగిన కొన్నిసంఘటనలు గుర్తుచేసుకోవడంకోసమే ఈ వ్యాసం.

రమణగారు రచించిన "మూగమనసులు" సినిమా నేను రాజమండ్రిలో బి.ఇడి. చదువుతున్నప్పుడు చూశాను. ఒకసారి కాదు, చాలాసార్లు. అప్పటినుంచే నేను ఆయనకు ఫాన్‌ని. ఆత్రేయ పాటలకు, ముళ్ళపూడి మాటలకు నేను ముగ్ధుణ్ణై పోయాను. అప్పటికి ఆయనతో నాకు ముఖపరిచయంకూడా లేదు. ఒకసారి దర్శకులు పర్వతనేని సాంబశివ రావుగారు, ముళ్ళపూడిగారు, నేను కలిసి కూర్చున్నాము. అది మా తొలి పరిచయం. కానీ అప్పటికే ఆయన రచనలన్నీ నేను చదివేశాను. వారి శైలి వారిదే. వారి హాస్యం వారిదే. వారి మాటకారితనం, వారి సొంతమే. ఇదంతా ఒక ఎత్తు. జరిగిన సంఘటనల గురించి వివరణ ఒక ఎత్తు. వారికి రచయితలన్నా, కళాకారులన్నా చాలా గౌరవం, ప్రేమ. నేను కూడా సినిమాలకు రాయడం మొదలెట్టాక, నేను కథ మాటలు సమకూర్చిన "ఊరుమ్మడి బతుకులు", "కమలమ్మ కమతం", "ప్రాణం ఖరీదు" సినిమాలను చూసి నన్ను ప్రోత్సహించారు. ''గోదావరి మాండలికం బాగా రాశారు'', అని అభినందించారు. ఆయనదీ గోదావరి జిల్లాయే కావడం చేతనో, నేను రాసిన సినిమాలునచ్చో నాకు తెలియదు గానీ వారి మెప్పును పొందగలగడం ఒక తీయని జ్ఞాపకం నాకు. ఆ మాత్రం పరిచయంతో వారికి ఫోను చేసే చనువొచ్చింది నాకు. కలిస్తే నమస్కరించి, పలకరించే దగ్గర తనమూ వచ్చింది.



ముళ్ళపూడి వెంకటరమణ

లలితకళాతోరణంలో డా. మాడుగుల నాగఫణిశర్మగారి సహస్రావధానం జరుగుతోంది. ఆ కార్యక్రమానికి అధ్యక్షులు మాజీ రాజ్యసభసభ్యులు సింగాపురం రాజేశ్వరరావు. యిద్దరు, ముగ్గురు కార్యదర్శులలో నేనూ ఒకణ్ణి. ఆ అవధాన కార్యక్రమానికి ఒక ప్రేక్షకుడిగా వచ్చి రమణగారు వెనక ఎక్కడో కూర్చున్నారు. వేదిక మీదున్న అవధానిగారు వారిని గమనించి, నన్ను పిలిచి "రమణ గారు జనంలో ఉన్నారు. వారిని విశిష్ట పృచ్ఛకులుగా వేదిక మీదకి ఆహ్వానించండి" అని చెప్పారు. నేను వెళ్ళి వారిని వేదిక మీదకు రమ్మని ఆహ్వానించాను. ''నేను విని ఆనందించడానికి వచ్చాను. నన్ను యిక్కడే ఉండనివ్వండి" అన్నారాయన. నేను ఆ మాటతో వదిలిపెట్టకుండా "మీరు ఏదో ఒక ప్రశ్న వేసి వారినించీ సమాధానాన్ని రాబడితే వినాలని కుతూహలపడే ప్రేక్షకు లున్నారు. నామాట కాదనక అవధానిగారి కోరికమేరకు ఒక్కసారి వేదిక మీదకు వస్తే బాగుంటుంది, మా అందరికీ తృప్తి" అన్నాను వినయంగా. నా కోరికను మన్నించి ఆయన వేదిక మీదకి వచ్చి అవధానిగారిని పలకరించి నవ్వుతూ "సాధారణంగా ప్రతి యింటి ఇల్లాలూ ప్రొద్దున్న లేచిన దగ్గర నుంచీ యింట్లో

సి.యస్. రావు, ఫోన్ 9885017122

అవధానం చేస్తూనే ఉంటుంది. భర్త అవసరాలను తీర్చడం, పిల్లల ప్రశ్నలకి సమాధానాలు చెప్తూ స్కూలుకి పంపడం కోసం తయారు చేయడం, అత్తమామల ప్రశ్నలకి సమాధానాలు చెప్పి అవసరాలను సమకూర్చడం యిదంతా అవధానమే కదా. మీరు చేసే అవధానానికీ, యిల్లాలు చేసే అవధానానికీ తేడా ఏమిటి? పద్యంలో చెప్పినా సరే, గద్యంలో చెప్పినా సరే" అన్నారు అవధానిగారు. ఒక్క క్షణం ఆలోచించి "అది కుటుంబంలో అవధానం అయితే, నాది సాహితీ కుటుంబంలో అవధానం. నా అవధానానికి ప్రేక్షకులున్నారు. యిల్లాలి అవధానానికి ప్రేక్షకులుండరు. కుటుంబ సభ్యులే పృచ్ఛకులూ, ప్రేక్షకులూ కూడా ఆమెకు. తరువాత అవధాన నిర్వహకులు ముళ్ళపూడిగారి "బుడుగు," "రెండు జడల సీత", "యిద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ" లాంటి వారి రచనల గురించి వివరించారు. కానీ ప్రేక్షకులలో పెద్దగా స్పందన లేదు. వారికో శాలువా కప్పవలసిన బాధ్యత కార్యదర్శిగా నాకుంది. కనుక అప్పుడు వారి గురించి ప్రేక్షకులకి నాలుగు మాటలు చెప్పవలసొచ్చింది.

అవి ఏమిటంటే – "నేను 1992లో తొలిసారి అమెరికా వెళ్ళాను. నేనొక లెక్చరర్‌ని కావడంతో అక్కడ స్థిరపడిన నా విద్యార్థులు కొందరు, సన్నిహితులు కొందరు తానా ఉత్సవాలు అయిపోయిన తరువాత వారి వారి యిళ్ళకు నన్ను తీసుకెళ్ళారు. నా అమెరికాయాత్ర గురించి ప్రేక్షకులకి చెప్పడం కోసం ఈ విషయం మాట్లాడడంలేదు. వారి వారి యిళ్ళకు వెళితే, యింట్లోకి అడుగుపెట్టగానే ఒక వినాయకుడి విగ్రహమో, లక్ష్మీదేవి విగ్రహమో, వెంకటేశ్వరస్వామి చిత్రపటమో ఉండేవి. ఆ యింటి యిల్లాలు అమెరికాలో కూడా చక్కటి తెలుగు భోజనం పెడుతూ ఉంటే మాట్లాడగా నాకు తెలిసిన విషయాలు ఏమిటంటే చాలామంది యిళ్ళల్లో సత్యన్నారాయణస్వామివ్రత కథ, వరలక్ష్మివ్రత కథ, భగవద్గీత, భారత, భాగవతాల్లాంటి పుస్తకాలు ఉంటాయని తెలిసింది. వాటితోపాటు అప్పటికి సి.డి.లు లేవు కనుక "ముత్యాలముగ్గు" సంభాషణల క్యాసెట్టుకూడా పదిలపరుచుకుని, అప్పుడప్పుడూ విని ఆనందిస్తారని తెలిసింది. ఆ ''ముత్యాలముగ్గు'' సంభాషణల రచయిత ఈ ముళ్ళపూడిగారే. సంభాషణలు సి.డి. రూపంలో వచ్చి, పాటలకంటే ప్రేక్షకులను అలరించిన మాటల రచయిత అనిపించుకున్నారీయన'' అనగానే ప్రేక్షకులందరూ చప్పట్లు కొట్టారు. అది సినిమాకున్న శక్తి, ముళ్ళపూడి మాటలకున్న ప్రత్యేకత.

మరో ముఖ్యసంఘటన. మహాకవులు రచించిన సంస్కృత నాటకాలను ఈ తరానికి చిత్రీకరించి చూపించాలనే ఉద్దేశ్యంతో ఆ నాటకాలను సేకరించి సంస్కృత పండితుల చేత ఎపిసోడ్స్‌గా విభజింపజేసి దూరదర్శన్‌కి పంపించడం జరిగింది. ఆ ప్రాజెక్టు పేరు "రసోవైసః." ఢిల్లీ దూరదర్శన్‌వారు అప్పటికి పి.వి. నరసింహారావుగారు ప్రధానమంత్రిగా ఉండగా, శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఐ.ఏ.ఎస్. ప్రధానమంత్రి కార్యదర్శిగా ఉండేవారు. వారికి కూడా ఈ "రసోవైసః" ప్రాజెక్ట్ నచ్చడంతో అప్పటికి దూరదర్శన్ డైరెక్టరు జనరల్‌గా ఉన్న శ్రీ. కె. ఎస్. శర్మ, ఐ.ఏ.ఎస్. గారి వద్దకు నన్ను ఈ కార్యక్రమ రూపశిల్పి దీక్షిత్, డి.ఎన్.ను పంపించారు. ఆ ప్రాజెక్టు శర్మగారు కూడా ఆమోదించారు. ఆ విధంగా ఆమోదించబడిన లేఖతో మేము తిరిగి హైదరాబాదుకొచ్చి, ఆ కార్యక్రమ చిత్రీకరణకు ప్రఖ్యాత దర్శకులు కొందరిని ఎంపిక చేసుకున్నాము. వారి అనుమతికోసం మద్రాసువెళ్ళి విశ్వనాథ్‌గారిని, సింగీతం శ్రీనివాసరావుగారిని, బాలూ మహేంద్రగారిని, పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ అప్పటి ప్రిన్సిపాల్‌ను, బాపూగారినీ కలిసి అంగీకారం తీసుకోవాలనుకున్నాము. కొందరు సరేనన్నారు. బాపూగారిని కలవడానికి మాకు మార్గం ఆనాడు ముళ్ళపూడి గారే. "మేము ఈ పనిమీద వచ్చాము, మీరు మమ్మల్ని బాపూగారి దగ్గరకు తీసుకుని వెళ్ళాలి" అని అడిగాను ఫోన్లో.

ముళ్ళపూడిగారు ఎంతటి సహృదయులంటే నేనూ దీక్షిత్ బసచేసిన హోటల్‌కి కారు పంపించి వారి "చిత్రకల్పన" ఆఫీస్‌కి మమ్మల్ని రప్పించుకుని బాపూగారి దగ్గరకి తీసుకు వెళ్ళారు. మా కోరిక బాపూగారికి వివరించారు. అప్పటికి బాపూగారి దర్శకత్వంలో వచ్చిన ఒక సినిమా బాగా ఆడలేదు. ఆ కారణంచేతనో ఏమో, "నేను తెలుగులో సినిమా తీస్తేనే జనం అర్థం కాకో, నాకు చూపించడంరాకో చూడటం లేదు. సంస్కృత నాటకాన్ని సంస్కృతంలో దృశ్యీకరించాలని చేబట్టిన మీ కార్యక్రమం గొప్పదే. కానీ నేనంత గొప్పవాణ్ణి కానని నా నమ్మకం. నేను తెలుగులో తీసిందే అర్థంకానప్పుడు, అంటే అర్థమయ్యేలా చెప్పలేనప్పుడు నాకే తెలియని సంస్కృతంలో టి.వి.లో చిత్రీకరిస్తే ఎవరు చూస్తారండీ? నాకు చేతకాదు" అన్నారు. ఏం సమాధానం చెప్పాలో నాకు అర్థం కాలేదు. ముళ్ళపూడి గారివైపు చూశాను. ఆయన చిరునవ్వునవ్వి, "ఆయన నిర్ణయాలను తొందరగా మార్చుకొనే మనిషి కాదు," అన్నారు. చివరికి "ఒక నాటకం స్క్రిప్టు కాపీ మీ కిచ్చి వెళతాం

వీలైనపుడు చూసి మీ సలహా యివ్వండి" అన్నాను నేను. "మా రమణకిచ్చి వెళ్ళండి," అన్నారాయన. ఇక్కడ ముఖ్యమైన విషయం ఎవరో నాలాంటి రచయిత ఒక ఫోను చేయగానే తన కారులో బాపూ గారి దగ్గరికి తీసుకుని వెళ్ళి పరిచయం చేసి, మాట్లాడించే సహృదయం రమణగారి సొత్తని చెప్పడానికే యీ వివరణ.

అంతేకాకుండా వారి కెమెరామెన్‌గా పనిచేసే ఆర్.కె. రాజుగారు, బాపూ రమణల గురించి నిర్మాతగా రమణగారు తన యూనిట్‌లోని లైట్‌బాయ్ దగ్గర నుంచే హీరో హీరోయిన్ల దాకా ప్రతి ఒక్కరినీ ఎంత శ్రద్ధగా, అభిమానంగా, చూసుకుంటారో నాతో అపుడపుడూ చెబుతూ ఉండేవారు. అవి విన్నప్పుడు నాకు చాలా ఆనందం కలిగేది. రమణగారు గొప్ప నిర్మాతే కాదు, గొప్ప రచయిత, గొప్ప మనిషి. మనిషిని మనిషిగా గౌరవించే మంచి మనిషి అనిపించేది.

మరో అందమైన సంఘటన, "ముత్యాలముగ్గు" సినిమా చిత్రీకరణ సమయం. రావుగోపాలరావు ప్రముఖ రంగస్థల, చలనచిత్రనటులు, రాజ్యసభసభ్యులు, నాకు ఆత్మీయ మిత్రుడు. "ముత్యాలముగ్గు" షూటింగు సమయానికి అప్పుడప్పుడే పైకొస్తున్న చలనచిత్రనటుడు మాత్రమే. ఆయనని "ముత్యాలముగ్గు" సినిమాలో కాంట్రాక్టరు వేషానికి బుక్ చేశారు. ఆ సినిమా నా మిత్రుడు రావుగోపాలరావుకి ఒక పెద్ద బ్రేక్. ఆ ఒక్క సినిమాతో ఎక్కడికో వెళ్ళిపోయాడు. ముళ్ళపూడి కలం నుంచి వెలువడి గోపాలరావు గొంతుతో పలకబడి తెలుగువారిని ఉర్రూతలూగించాయి. ఒకనాడు గోపాలరావు ముళ్ళపూడిగారి చమత్కారాన్ని డ్రమటిక్‌గా చెప్పాడు. అన్నపూర్ణ హోటల్‌లో నేను, ఆయన మరో కొందరు మిత్రులు కూర్చుని ఉండగా, అదేమిటంటే ఆ సినిమాలో అల్లురామలింగయ్యగారిది కోతివేషం. ఆయన బాగా నటించాలన్న ఉద్దేశ్యంతో కష్టపడిచేస్తుంటే వారి నటనను చూసి దర్శకులు బాపూ చిరునవ్వుతో "అంత అఖర్లేదు రామలింగయ్యగారూ, మీరు మామూలుగా డయిలాగు చెప్పండి సరిపోతుంది" అన్నారు. అయినా రామలింగయ్య గారు శ్రమపడి యింకా అలాగే నటిస్తూ ఉండగా రమణగారు అక్కడికి వచ్చి, బ్రేక్ టైమ్‌లో రామలింగయ్యగారిని తన దగ్గరికి పిలిచారట. "మీకు రెమ్యునరేషన్ ఎంత?" అని అడిగారు. "పదనుకుంటాను," అన్నారు రామలింగయ్య. "పదికి సరిపోయేటంతే నటించండి. యిరవైకి, పాతికకు నటించడ మెందుకు?" అని చమత్కరించారట. యిది గోపాలరావు నోటిద్వారా ముళ్ళపూడిగారి గురించి నేను విన్న చమత్కారం.

ఇక నేనొక ఏడాది క్రితం రచించిన విశ్వనాథ సత్యనారాయణగారి నవల "విష్ణుశర్మ, యింగ్లీషు చదువు"ని నాటకంగా మలిచాను. అంటే నవలను నాటకీకరించాను. ఆ పుస్తకానికి బాపూగారిబొమ్మ, ముళ్ళపూడిగారి ముందుమాట కావాలనుకుని సాంబశివరావుగారి ద్వారా ముళ్ళపూడిగారి ఫోను నెంబరు తెలుసుకుని ఫోను చేశాను. వెంటనే ముళ్ళపూడిగారు "విష్ణుశర్మ యింగ్లీషు చదువు" నవలను నేను నాటకీకరించిన నాటకప్రతిని పంపించమన్నారు. పంపించాను. శ్రద్ధగా రెండూ చదివి, వచన కవిత పద్ధతిలో యిలా రాశారు.

**బాబోయ్...ఇంగ్లీషు చదువు!**

*వినవిన రుచిరా - విశ్వనాథ! నీ మాటలాట కోలాటాలు*
*కనకన రుచిరా - కావ్యనాథ! నీ కవన కుతూహల మార్గణాలు*
*ఏమి చెప్పుదున్ గురునాథా! వాగ్విలాస వరలక్ష్మీ నాథా!*
*దివికి దీటుగా భువిని మేటిగా*
*కల్పవృక్షాన్ని శిల్పించి నిల్పిన కవినాథా!*
*ఏమని నుతింతు హే విశ్వనాథా!*
*పియ్యూసీ పుట్టయితే*
*బియ్యూసి బట్టేమిటి? రా!*
*ఎఫ్ డబల్‌ఓటీ పుట్టయితే*
*ఎఫ్‌డబల్‌ఓఎల్ ఫూలెట్లా? దొరా!*
*నిన్నా మొన్నా అన్న మాటలకు*
*దే బిఫోర్ దే ఆఫ్టర్ పక్కదన్నులేల?*
*అంటూ ఆ 'షా' లా - అచ్చునీలా*
*చెరిగేసి తిరగేసి మరగేసి*
*కడిగేసి ఉతికేసి ఆరేసి మడతేసిన*
*వ్యాకరణీక శబ్దార్థ చంద్రుడా!*
*కొందరికి అందని నారికేళ కేళీ విలాసా!*
*'నిన్ను' దివినుండి భువికి రప్పించి*
*ద్రాక్షాపాకంలో ముంచి*
*అందరికీ 'విందిం'చిన*
*సి.ఎస్.రావు గారిని*
*ఆదరించు ఆశీర్వదించు పెంచు.*

**ముళ్ళపూడి వెంకటరమణ**

ఆయన సాధారణంగా నాటకాలకి ముందుమాట రాయరు. ఈ ముందుమాటే బాపూగారు గీసిన ముఖచిత్రంతో కలిపి నాకు పంపించారు. పుస్తకం అచ్చయ్యింది. వారికీ యిచ్చాను. బహుశ రమణగారు ఆఖరిసారిగా రాసిన ముందుమాట యిదేనేమో. అలాగే డా॥ చాట్ల శ్రీరాములుగారి రంగస్థల జీవితచరిత్రను చదివి ఒక అందమైన ముందుమాట రాసి పంపించారు. *"తెలుగు కన్నెపిల్ల పట్టు లంగాఓణీలో మసులుతున్నట్టు"* అనిపించే చక్కని తెలుగు ముందుమాట అది.

పండితులు అంటూ ఉంటారు. త్రేతాయుగంలో శ్రీరాముడు అడవులకు రెండుసార్లు వెళ్ళాడు. విశ్వామిత్రునితో ఒకసారి. సీతాలక్ష్మణులతో కలిసి ఒకసారి. అప్పట్లో ఆ శ్రీరామచంద్రుని అందాన్నిచూసి అడవులలోని మహర్షులు ముగ్ధులై పోయారట. కొందరు ఋషులు శ్రీరాముని చెంతకు వచ్చి "మీ అందాన్ని చూస్తూ ఉంటే మాకెంతో పారవశ్యం కలుగుతోంది. ఒక్కసారి మిమ్మల్ని కౌగిలించు కోవాలనిపిస్తోంది" అని చేతులు జోడించి ప్రార్థించారట. శ్రీరామచంద్రుడు చిరునవ్వుతో "పురుషుడు, పురుషుడిని ఆలింగనం చేసుకుంటే కలిగే అనుభూతి ఏముంటుంది? ద్వాపర యుగంలో నేను శ్రీ కృష్ణునిగా జన్మిస్తాను. మీరందరూ గోపికలుగా జన్మిస్తారు. నాతో కలిసి మెలసి ఆడుకుంటారు. అప్పుడు మీ పరిష్వంగనలో నేను, నా పరిష్వంగనలో మీరూ తాదాత్మ్యం చెందుదాం" అన్నాడట.

అలాగ బాపూ రమణలు ఏనాడో అన్యోన్యదంపతులై దాంపత్య జీవితాన్ని అనుభవించి, ఒకరినొకరు అంతగా అర్థం చేసుకొని మనం దంపతులుగా కాకుండా ఆప్తమిత్రులుగా జీవించాలని ఉంది అని అనుకుంటే, యీ యుగంలో ఆ అన్యోన్యదంపతులు బాపూ రమణలై పుట్టారా? అనిపించే స్నేహం వారిది. "స్నేహం" జనానికి వదిలేసి దాని రుచి, స్వచ్ఛత, అందం, ఆత్మీయత జనానికి చూపించి రెండు అక్షరాల "స్నేహం"లోంచి "స్నే" వెళ్ళిపోయింది. "హం" అన్న పదంలో "యిద్దరు" అన్న అర్థం ఉంది. బాపు రమణని మర్చిపోలేక "హం," "మేము, యిద్దరం" అనే భావనలో ఉంటున్నారిపుడు.

*ముళ్ళపూడికి యిదే నా ఆత్మీయ వీడ్కోలు.*



**సి.యస్. రావు**




**('అభినయ భరతాచర్య' పుస్తకం అందుకుని చాట్లకు రాసిన ముళ్ళపూడి చివరి ఉత్తరం)**

# వెళ్ళిపోయిన బుడుగు

రమణ కలం నుండి జాలువారిన ప్రఖ్యాతమైన పాత్ర బుడుగు. తెలుగు సాహిత్యలోకంలో ఒక తియ్యని జ్ఞాపకం. బుడుగుకు అందం వుంది, ఆకతాయితనముంది, సిగ్గాన ప్రసూనాంబను రచ్చించె వీరత్వం వుంది, గోపాలం బాబాయి ప్రేమలేఖను రెండుజెళ్ళ సీతకు అందించే చలాకితనం వుంది, సీత నాన్నా! అని సంబోధించె చమక్కు వుంది.



ఇంతెందుకు అతగాడికి తెలియని విషయం అంటూ లేదంటె అతిశయోక్తి కాదు. బామ్మకు, అమ్మకు, నాన్నాకు, బాబాయికి వొకరేమిటి అందరికి ట్యూషన్ చెప్పగల సమర్ధతవుంది. మద్రాస్ కటింగ్ చేయమని అమాయకంగా మంగలిని అడుగుతుంటె, అతగాడి హాస్యపరిజ్ఞానం మనకవగత మౌతుంది. తనమీద తనకు నమ్మకమేకాదు తన ధాటికి ఏ మాష్టారు తట్టుకోలేడనె ధీమాగావుంది. అతగాడికి ప్రపంచం అంటె ప్రతివిషయం తెలుసుకునె పాఠశాల అనె గట్టినమ్మకం వుంది. అందర్ని తనచుట్టూ తిప్పుకునె, ఆకర్షించె గుణం వుంది. తనకు ట్యూషన్ చెప్పె మాస్టార్ల నుండి పొందిన చేదు అనుభవాలనుసైతం తాను బాధపడ్డా తన ఆ ఆటోబయాగ్రఫిలో హాస్యంగా చెప్పే సెన్స్ ఆఫ్ హ్యూమర్ వుంది, సైన్స్, లెక్కలు, తెలుగు, పురాణాలు, రాచ్చసులు, అంతా బుడుగు బుర్రలో చోటుచేసుకున్న వాళ్ళె. "గిరీశంతో మాట్లాడటం ఒక ఎడ్యుకేషన్" అయితె, బుడుగుతో మాట్లాడితె ఆరోగ్యం, ఆనందం. మనిషికి సమస్యల్లో సైతం శాశ్వత ఆనందాన్ని పంచి యిచ్చె టానిక్. బుడుగుతో గడిపితే 'క్రానికల్ డిసీజెస్' కూడా కనుమరుగవుతాయి.

తెలుగు సాహిత్యంలో ఏళ్ళోచ్చాక అవార్డు అందుకున్న పాత్రలను, పాత్ర సృష్టికర్తలను వోవర్ టేక్ చేసి అతిచిన్న వయసులో అవార్డు అందుకున్న ఘనత బుడుగుదే. బుడుగును గమనిస్తె కాలంతో పనిచేసుకుపోయే నైజం కన్నా, కాలంలో ఏముందో తెలుసుకోవాలనె తాపత్రయం వున్నట్టు కన్పిస్తుంది.

ముళ్ళపూడి మేధ నుండి పుట్టి బాపు కుంచెతో ప్రాణం పోసుకున్న బుడుగు తనకు తెలిసినంతవరకు అతిచిన్న వయసులో విశ్వానంతా చుట్టి 'బాపురె' అనిపించుకున్నాడు. "నొప్పించక తానొవ్వక ఎస్కేపై తిరుగువాడు ఎక్స్‌పర్ట్ సుమతి" అన్న రమణ హాస్యకేంద్రకం బుడుగు శాశ్వతానందానికి అతడె గొడుగు.

తెలుగుతనం నిండిన తేనలూరు హాస్యం పైవాడికి రుచి చూపించాలని ఇక సెలవ్ అన్నారు ముళ్ళపూడి. ప్రతి తెలుగువారి గుండెల్లో తనచిరునామ పదిల పరచుకొని కాస్తంత 7వండి ప్లీస్! అంటూ ఎవరికి మాటయిన చెప్పకుండా వెళ్ళిపోయారు. తన పాత్రలలో తనను చూసుకొని మనసార నవ్వుకోమని. ఇప్పుడు బుడుగులో చెలాకితనం లేదు నా గురూగారు లేకుండా నవ్వలేనని మోహం చాటేశాడు.

ఆకాశం ఎర్రపడినా, ఇంటి ముందర ముత్యాల ముగ్గు చూసిన, పూలరంగడులాంటి కుర్రాడు ఎదురైనా, రెండు జెళ్ళ సీత ఎదురుపడిన ముళ్ళపుడి మన మనసులో సుతిమెత్తగా గుచ్చుకొని నవ్వేరా! అంటారు. నిండైన తెలుగుతనం నిండిన అతని రూపం చెరగనివ్వకుండా మన నవ్వుల్లో అతనిని స్మరించుకొంటూ. నమస్కరిద్దాం.

అతని జ్ఞాపకం సగభాగం మిగిలినా.....

***ఆ కుంచెకు మాటలు మూగపోయాయి.***
***భగవంతుని కోతి కొమ్మచ్చి ఆటలో మనం కార్టూనులమే!***
***(ముళ్ళపూడి వారికి బాష్పాంజలి)***

**డా. నోరి రాజేశ్వరరావు**
హైదరాబాద్

# తెలుగుతల్లి దీవెన



దాయాదులు కారు మీరు నన్ను పంచుకోవనెంచ
సహోదరులు కానె కారు వంతులకై వైరమాడ
పలువిధాల కనిపించే నా మనసుకి రూపాలు
ఒక్కటైన నా ఆత్మకు వివిధ ప్రతిబింబాలు

కృష్ణాగోదావరైన కడప కర్నూలైన
మెదక్ నిజాంబాదులైన విశాఖ చిత్తూరైన
జిల్లాలవి కానె కావు నా శరీర భాగాలు
మీ జాతికి ఉనికినిచ్చు సైసర్గిక రూపాలు

కన్ను కాలు చేయి చెవి ముఖ్యమైన అవయవాలు
విడివిడిగా పనికిరాని దేహాంతర్భాగాలు
అవి అన్నీ కలసినపుడు ఒక దేహం అవుతుంది
వివిధ ప్రాంతాలు కలసి ఒక రాష్ట్రం అవుతుంది

ఈ రాష్ట్రం నా దేహం ఈ ప్రజలే నా ఆత్మ
భిన్నత్వం పరిధవిల్లు ఏకత్వం నా నైజం
యాసలు వేరైనా భాష నాది తెలుగు
ప్రాంతాలు వేరైనా జాతి నాది తెలుగు

ఆస్తులైతే పంచవచ్చు ఆత్మనెవరు పంచగలరు?
ఆంధ్రమాత అస్తిత్వపు ఎల్లలెవరు తుంచగలరు?
శ్రేయస్సును అభిలషిస్తు చేస్తున్నా నే ప్రార్థన
నా మంచిని కోరి నేనె ఇస్తున్నా ఈ దీవెన.

**- సురేంద్ర కె. దారా**



# కందువ రేవగలు

మలి సంజె సెలయేటి అలమీద కొలువాయె
కలనేత లలిరేక కలువపూవు
తలయూచి విరివంపు నెలవంక కళలెత్తి
కనుచూపు మొగసాల కనికరించె
విరజాజి చనువుగా నెరసొంపు నవ్వుగా
చలువ వెన్నెల యంచు సానబట్టె
నిండుజాబిలి చెండు నెలకొన్న గగనాన
మసరు పుప్పొడి గిన్నె పసుపు ఒలికె

ఎంత హృదయంగమముగా వసంతరాత్రి
వలపురాగము తావిగ యలల దేల్చె
సహజ నిబిడాను రాగార్ద్ర శాంత రుచిర
నేత్రయుగ్మము నా మీద నిలిపి నిలిపి
దాటి యామిని వరువాత తోటలోన
మాలికా జోలికల నూగె మలయసవము
పవము కోకిల గొంతున పాటయౌగ
పాటలో మేలుకొన్న స్వప్నములు మూగె

తెలిమంచు తెరలోన తొలివెల్గు లుదయించె
రసవార్ధి తూర్పులో రంగుపొంగి
మనసు రంజిల్ల సుమాళి పీఠముల – రా
గము ప్రస్తరించె బాలమధుపమ్ము
తరుణ మాకందపు తలిరుమేతలు మేసి
పాడె పంచమ పల్లవమ్ము పికము
కాషాయ లలిత శీకర శేఖరముల – చ
ల్లని గాలి జలతరంగిణి నదించె

తెల్లవారెను! యిచ్చోట తెలివి మీరి
కన్ను తెరిచిన కొలనిపై కాంతి కదలె
చలిత చైత్ర నదీ ముక్త సైకతముల
తరుణ ముగ్ధ సారంగి పాదముల వోలె
ఇది తెలుగు వారి యింటి విడిదికి వచ్చి
పచ్చ పచ్చని సొబగులు పంచిపెట్టు
ఇపుడుగాది చివురెట్టునైన చోట
కుసుమ శరదేవతామూర్తి గోచరించు

**- సాంధ్యశ్రీ**

# చెంగల్వ కాళయ్య

*తంజావూరులో రఘునాథ నాయకుని కాలంలో ఉన్న రామభద్రమ్మకు, విజయరాఘవుని కాలంలో రాణించిన కృష్ణాజీకి తెలుగు కవిత్వం నేర్పిన గురువు పేరు* **చెంగల్వ కాళకవి.** *ఈయన పాకనాటివాడు, కాళహస్తీశ్వర భక్తుడు. ఇతని తండ్రి శ్రీకంఠుని వద్ద మంత్రిగా ఉండేవాడు. ఆయన పేరు వెంకటయ్య. అతడు కూడా కవే. 'పార్వతీ పరిణయం' అనే ప్రౌఢ కావ్యాన్ని వ్రాశాడు. అది నేడు లుప్తమైంది. పాకనాటి నుండి చెంగల్వవారు ఎప్పుడు తంజావూరు వచ్చారో తెలియదు. 'రణరంగ గంధవారణ' అనే బిరుదు ధరించిన శ్రీకంఠుని వద్ద తండ్రి మంత్రిత్వం చేస్తే కాళకవి తంజావూరులో విద్యా వ్యాసంగం చేశాడు. నాగవాసంలోని జవరాండ్రకు చదువులు చెప్పాడు.*



వేదుల రాజేశ్వరిదేవి

*ఆ చెంగల్వ కాళకవి విరచితమైన* ***రాజగోపాల విలాసం*** *ఆధారంగా వేదుల రాజేశ్వరిదేవి వ్రాసిన అర్ధశతాబ్దంనాటి వ్యాసమొకటి ఇస్తున్నాం. ఇది ఆనాటి రచనాశైలిని ప్రవచించినా, సులభ గ్రాహ్యంగా వుండటంతో యథాతథంగా ప్రచురిస్తున్నాము. కావ్యాలలో అష్టవిధ నాయికలు – కృష్ణునికి అష్టభార్యలు. ఈ రెండింటినీ సమన్వయపరుస్తూ చెంగల్వ కాళకవి* ***రాజగోపాల విలాసం*** *వ్రాసినారు.*

*రాజేశ్వరి ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు తెలుగు సాహిత్య విభాగంలో డాక్టరేటు గౌరవ పట్టాను పొందిన తొలితరపు మహిళలో నొకరు. 25 సంవత్సరముల పాటు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా సేవలందించారు. ప్రస్తుతం విశాఖ నివాసి.* **– సం॥**

చెంగల్వ కాళకవి దక్షిణాంధ్ర యుగానికి జెందినవాడు. ఈ యుగము కాలపరిమితిచే నెంత సుదీర్ఘమో ప్రక్రియా వైవిధ్యముచే నంత విలక్షణమైనది. వచనరచన, కవులతోపాటు కవయిత్రుల యవతరణ, యక్షగానముల ప్రాచుర్యము, వాగ్గేయకారుల వైశిష్ట్యము ఆ యుగ లక్షణములలో ముఖ్యములు. నాటి వాఙ్మయము పండిత ప్రకాండుల కంచుఢక్కల సవాలులకే కాక, కోటలోని రాజునకును, పేటలోని పౌరునకును మధ్య వంతెనయై నిలచినది. ఆ కార్యకలాపమునకైన సాహిత్యమునకు గీతి తోడైనది. ఈ యుగమునందుద్భవించిన మేలిమి కృతులలో కృష్ణరాయల రసికతయు, దదన్యములలో క్షీణయుగపు చిహ్నములును గోచరించును. రసరాజమగు శృంగారము ఈ యుగమునకు ధర్మమే యైనది. కాని అయ్యది యతివేల మగుట కొంతవరకు గాలధర్మమునకు విడిచి వేయవలెను.

కాళకవి రఘునాథుని కాలములో నుండినవాడు. కాని యాస్థానకవిగా బేర్కొనబడలేదు. విజయరాఘవునకు కాళకవి తండ్రినుండి క్రమప్రాప్తముగ సంక్రమించి పిమ్మట యాస్థానకవియైనట్లున్నది. రఘునాథ, విజయరాఘవుల యాస్థానములందు సుప్రసిద్ధులగు రామభద్రాంబాది విదుషీమణులందరకు నించుమించు కాళకవియే గురువు.

గ్రంథస్థ విషయమునుబట్టి కాళకవి పాకనాటి యార్వేల నియోగి బ్రాహ్మణుడుగా, కవికుటుంబమునుండి వచ్చిన వాడుగా దెలియుచున్నది. ఈతని తండ్రి వెంకటయ్య, తల్లి కృష్ణాంబ. ఈమె రావినూతల తిరుమలయ్య తనూజ.

కాళకవి ఘటికా శత గ్రంథ ఘటనుడు; ఓష్ఠ్య, నిరోష్ఠ్యాది నియమములతో గవిత చెప్పగలవాడు; పరిహృతేతర యుక్తిబాగ నూతన కథాకథకుడు; భరత శాస్త్ర పారంగతుడు. విజయరాఘవుని యాస్థానకవియై ఇతడు తద్రాజ నామాంకితముగ *రాజగోపాల విలాసమును* వ్రాసినాడు. కాళకవికి రఘునాథునితోగల సంబంధ మెట్టిదైనను, విజయరాఘవునకు మాత్ర మాతడాస్థాన కవియే కాదు ఆప్తుడు కూడ. రాజుతోడనేగాక రాజకుటుంబినుల యొద్ద గూడ జనవు గలవాడు. విజయరాఘవుడు రాణులతో గూడ గాళకవి మందిరమున విందులారగించు వాడు.

ఇన్నిట బ్రసిద్ధుడైన యితడెన్ని కృతులను రచించెనో తెలియదు. ఒక్క *రాజగోపాలవిలాసము* మాత్రము వివాదము లేని కృతిగా స్పష్టపడినది. ఇది సరసమైన యొక మధుర ప్రబంధము. అవసరమున్నను లేకున్నను అష్టాదశ వర్ణనల నెట్టెట్టో యిరికించి తీరవలయునను ఛాందసము పొంత బోక కవి యిందు గొంత క్రొత్తదనమును వెలయించినాడు. అది అష్టవిధ శృంగార నాయికలను అలంకారికముగా తీర్చిదిద్ది ప్రసాదపూర్వకముగా రాజగోపాలున కర్పణము సేయుట. కృష్ణు డష్టవిధ నాయికల మనసు నచ్చునట్లు రంజింపజేయుట యిందలి ప్రధానాంశము. అది కథ యనలేము కాని కావ్యమున కాత్మ యదియే.

కావ్యమందలి నాయకుడు దక్షిణుడు. అందులకు సర్వథా అమరిన యన్వర్థ నామధేయుడు గోపాలకృష్ణుడు. పురాణము మొదలు పువ్వుబోడుల పాటల వరకు గల వాఙ్మయ ప్రక్రియ గృష్ణ చరిత్ర నెన్నియో రీతుల నుపయోగించు కొన్నవి. అందు గొన్నిటిలో అష్ట మహిషుల చరిత్రయు గలదు. కాని యందునుగూడ నీ యష్టవిధనాయికలు అలంకార మర్యాద ననుసరించి తీర్చిదిద్దబడినట్లు తోపదు. ఇది కాళకవి తలనే పుట్టిన ప్రత్యేక భావము.

ఇందు మొట్టమొదటి బేర్కొనబడిన నాయిక రుక్మిణి. ఈమె యష్ట మహిషులలో నగ్రగణ్య. ప్రాచీన వాఙ్మయములలో రుక్మిణి కృష్ణునియందు దైవాంశను భావించిన భక్తురాలుగా బ్రతిపాదింపబడి రూఢమైనది. కృష్ణుడెటనున్నను మనసు మాత్రము తత్త్వమెరిగిన రుక్మిణి కడనే యుండును. ఆ దృష్టితో చూచినచో రుక్మిణి స్వాధీనపతిక యనక తప్పదు. పురాణ పురుషుల వాలకములు దక్షిణాంధ్ర యుగములో మారినట్లే రుక్మిణి కాళకవి చేతిలో **గలహాంతరిత**యైనది. ఈ మార్పు అలౌకికమైన వాతావరణమునకు గొంత భంగకారి యనక తప్పదు. అలౌకిక పాత్రల నతిలౌకికముగ జిత్రించుట ఆ యుగకవులకు బరిపాటి. కాళకవియు నద్దానికి గురికాక తప్పనిసరిగా గాదు.

**చెలువుడ నీవు నా దచట చెక్కులపై కొనగోర కస్తురిన్**
**వలపున మన్మథాంకములు వ్రాయుచు నేర్పిన నాటనూదినన్**
**చెలులు కనుంగొనంగ జడచే నిను కొట్టిన యట్టి నేరముల్**
**తలపున నిల్పి నీవు దయతప్పిన నిప్పుడు తాళనేర్తునే?**

*(రాజగో. 1-104)*

ఈ విధంగా బాధపడే శృంగార నాయికను కలహాంతరిత అంటారు.

భద్ర భయశీల. ఆమె కృష్ణునెంత గాఢముగ వాంఛించునో సవతుల రంతుల కంత వెరచును. అది యెరిగినవాడు కాళకవి. కావుననే యామె **నభిసారిక**గా జిత్రించినాడు.

*అభిసరణ అవ్యక్తంగానూ, వ్యక్తంగానూ ఉంటుంది. వెన్నెల రాత్రి కనుగుణంగా ఆభరణాలు ధరించని తన శోభను వెన్నెల కాంతిలో విలీనం చేసుకుని తన ప్రేమను అవ్యక్తంగా వుంచుతుంది. ఈమె శుక్లాభిసారిక. ఇంకా కవులు అభిసారికను ఏడు రకాలుగా గుణాత్మకంగా వర్ణించారు.*

లక్షణ **వాసవసజ్జిక.** నాడు యదువల్లభుడు తన మందిరమునకు వచ్చు పావనదినము. వేగునప్పటినుండియు సంభ్రమాందోళితయై లక్షణ సలక్షణముగా తనువును, గృహమును భర్తృహితముగోరి యలంకరించుకొని విరహపడును. 'రాజగోపాలుడు రసికుడౌనమ్మా'యని చెలి చెప్పువరకు నామె కూరట లేదు. మనసిజరాగమగ్న మానసుడై గోపాలుడు రాగ మొలచిన మోహభారమున లక్షణ వినమ్రయగును.

**వారము నేడె యంచు యదువల్లభు రాకను గోరి లక్ష్మణా**
**సారసగంధి కేళిమణిసౌధము తా గయి చేసి వేడుకన్**
**హారపదాంగద ప్రముఖ హారిణియై తపనీయ మందిర**
**ద్వారమునందు నిల్వ నొక వారిజలోచన చేరి యిట్లనెన్.**

*(రాజగో. 2-242)*

జాంబవతి **విప్రలబ్ధ;** 'సంకేత మరసి నాథుడు రామివగ జెందు' కాంత. కృష్ణసమాగమాసక్తయగు నీమె విరహము, ప్రియుని యాగమనము, కలికి పొలయలుక కళా శాస్త్రానుసారముగా జెప్పబడినవి.

**మగవారికి కల గుణముల**
**మగువల వలపించు దనుక మమకారంబుల్**
**మగువలు వలచిన పిమ్మట**
**దగవులు మరి వేరే కావె తామరసాక్షీ!** *(రాజగో. 3-12)*

మిత్రవింద **ఖండిత**గా నిరూపింపబడినది. నిజమున కీ పాత్రధారణము సత్యభామది గాని యామెది కాదు. కృష్ణుడు తనకు జేసిన బాసలన్నియు మరచి యద్దమరేయిదాక రాక దక్కును. అప్పుడైనను తూలుచు వాలుచు వచ్చిన వాలకము మిత్రవింద శంకించి కుందుటకు గారణ మగును. ప్రియురాలి మన మరయగోరి తానట్లు నటించితినని చెప్పి తప్పుకొనుచు ధూర్తగోపాలు డామె ననున యించును.

**చెక్కిట గోరులున్ నిదుర చిన్నెలు చూపెడి వాలుచూపులున్**
**బుక్కటి వీడియంబును గుబుల్కొను మేను జవాదివాసనల్**
**టెక్కులు చూపి మీన్‌బిరుదు టెక్కెము వాని విలాసవైఖరిన్**
**జొక్కుచువచ్చి! నాయకుని చూసి కషాయితలోచనాంతయై.**
*(రాజగో. 3-29)*

సుదంత **విరహోత్కంఠ.** ఆ విరహములో చంద్రోపాలంభనాదులు ప్రబంధోచితముగ సంధింపబడినవి.

*ఆమె ఎలదోటలలో ఒక మనోహరమైనచోట చలువగంధపు గిన్నెలు, తాటాకు విసనకర్రలు, తామర తూళ్లు మొదలైనవి పట్టుకొని చెలికత్తె లామెని ఊరడిస్తున్నారు. 'సొలపుల్ మీరగ వాడు వచ్చి కను మెచ్చుల్ చేయడమేమందునే!' అని ఆమె విచారించింది. అతని దోషాలు లెక్కించుదా మనుకొంది.*

**అతనిపై నేరముల నెన్ను నట్టి వేళ**
**నతని సద్గుణములే యాత్మ దోచు**
**మమత లిటువంటి నతినికి మరులుకొంటి**
**తామసించిన నింక నే తాళజాల** *(రాజగో. 3-69)*

*కాంతుని శంకించక, రాత్రంతా అతని ఎడబాటుకి విలపించే నాయికను 'విరహోత్కంఠిత' అంటారు.*

పతి తన్ను విడచి గొల్లపల్లె కేగెనని విరహపడు కాళిందిపట్ల **ప్రోషితభర్తృకాత్వము** నిరూపింపబడినది. వాడవాడల విలాసములు పచరించు మురళీధరుడు పురవీథుల బడిపోవ గొల్ల పడతుకలు సాభిలాషిణులై చూతురేమోయని యామె మనసులోని బాధ. ఇందు రాజపురవీథుల వెడలుట యను ప్రబంధలక్షణము కాళింది యా శంకలో ముచ్చటగ నిమిడిపోయినది.

**పలుకుల దెచ్చుకోల్వలపు పై బచరించుచు వింత వింతలౌ**
**కులుకుల లేని మచ్చికల గూర్చుచు గైతవనర్మ మర్మముల్**
**సొలపుల జూపు జంతలకు జొక్కుదు రింతయు కాక గట్టిగా**
**వలచినవారిపట్ల మగవారల కెక్కుడి మోహమక్కటా!**
*(రాజగో. 4-8)*

సత్యభామ పురాణములనుండి వీధి నాటకముల వరకు, ప్రబంధములనుండి గొల్ల సుద్దులవరకు ఖండిత నాయికగా ప్రజానీకము దృష్టిలో రూఢమైనది. నారదునకు గలహ ప్రియత్వ మెంత రూఢమో, సత్యభామకు ఖండిత నాయికాత్వ మంత సిద్ధమైనది. కాళకవి యేకారణమువలననో యామెను **స్వాధీనపతిక**గా జిత్రించి మురిసినాడు. 'విజయ రాఘవుని చర్యలు రాజగోపాలుని పేరిట కవి వ్రాసినా'డను వదంతియే నిజమైనచో ఈ మార్పు సాభిప్రాయమె.

ఏవంవిధగుణభూయిష్టమగు నీ గ్రంథము ముఖ్యముగా మూడు భాగములు. మొదటిది యవతారికగా నమరిన కవివంశ ప్రతిష్ఠా ప్రజ్ఞాదులు, విజయరాఘవుని యాస్థానవైభవమును సూచించును. రెండవ భాగమున శ్రీకృష్ణుని యష్టవిధ శృంగార నాయికల యుదంతము గలదు. మూడవ భాగమున చంపకారణ్యమును, దక్షిణ ద్వారకావర్ణనము, తన్మాహాత్మ్యమును జెప్పబడినవి. కథాగతి ననుసరించి చూచినచో భాగత్రయమునకు వస్త్వైక్య మంతగా లేదు. ప్రత్యేకించి చూచినచో దేనికది వేర్వేరు ప్రయోజనములు గలది. చారిత్రక విషయములు, అలంకారశాస్త్ర మర్యాద, క్షేత్రమాహాత్మ్యము అనునవి వరుసగా వర్ణింపబడినవి.

రచనలో ప్రసాద గుణమును మించిన ధారాశుద్ధియు, నర్థగౌరవమును సాధింపబడినవి. పలుకుబడులును, పదబంధములును పారిజాతాపహరణముతో ప్రతిభటత్వము వహించినవి. మొత్తముపై కాళకవి రచనలో నొక వైలక్షణ్యమున్నది. సంస్కృత కవులలో భారవి కెట్టి స్థానము గలదో, దక్షిణాంధ్ర కవులలో కాళకవి కట్టి పూజ్యత గలదు. ఈ విషయమును 'కలిత లలితోక్తి భారవి కాళసుకవి' యని తానే ముక్తకంఠముగా జెప్పి కొనినాడు. ఱ

# పెళ్లిగోల

- కె. రామలక్ష్మి

'ఆరుద్ర ఇంటి పట్టున దొరకడం లేదు. అలా అని సాయంత్రం పూట సినిమా కంపెనీలోనూ వుండడం లేదు. నువ్వు కాస్త శ్రద్ధ తీసుకోకపోతే – చేయిజారి పోతాడు' అని ఆరుద్ర నాన్నగారికి బోలెడు కథలూ, గాథలూ చెప్పారు శ్రీనివాసరావుగారు. ఆయన గారికి ఆరుద్రకి రాయడం ఇష్టం లేక "శంకరం గురించి రకరకాలుగా చెప్పాడు. నువ్వేం చేస్తున్నావు? కాస్త కనుక్కుని రాయి' అంటూ అన్నారుద్రకి (ఆరుద్ర అన్నగారు సూర్యనారాయణ శాస్త్రి) రాశారాయన! ఆయన సూటిగా ఆరుద్రకు రాస్తే – ఒకలా వుండేది. ఇలా ఆరాలు తీసి, నేరాలు విని పెద్ద కొడుకుని కనుక్కోమనడం – వీరిద్దరికీ ఇష్టంలేదు! "మనలో మంచి సంబంధాలున్నాయి. ఇప్పుడు శంకరం కాస్త కుదురుగావున్నాడు, సంబంధం చూసి పెళ్ళి చేస్తాను" అని రాశారు. దానికీ ఈ ఇద్దరికీ సమాధానం రాసే ధైర్యం లేక వూరుకున్నారు. చూసీచూడనట్టు వూరుకుంటే సమస్య అదే కనుమరుగై పోతుందని వారి నమ్మకం.

శ్రీనివాసరావుగారికి ద్రావిళ్ల పిల్లని చేస్తే శంకరం సుఖపడతాడనీ గట్టి నమ్మకం. అంతేకాదు, "అందంలేదు, మరీ తెలివైనది – నీతో సమానంగా స్విన్ బర్న్‌నీసారోయాన్నీ చర్చించే తెలివి ఎక్కువగల స్త్రీ సుఖం యివ్వదు" అని హెచ్చరిక లాంటిది ధ్వనించారు కూడా. కాని యీ విషయంలో ఆరుద్ర అతనితో ఏకీభవించలేకపోయాడు. అసలు, తన వునికికి, ఎదుగుదలకి శ్రీనివాసరావే కారణం. ప్రాణంలో ప్రాణం అని గట్టిగా నమ్మిన వ్యక్తి ఆరుద్ర. వారి మీద ఈగ వాలినా భరించలేడు. రక్షణ కవచంగా తానే వుండాలని నమ్మిన వ్యక్తి ఆరుద్ర. అలాంటి వ్యక్తిని దూరం చేసుకోలేదు గాని నా విషయంలో రాజీ పడలేకపోయాడు. నాది దాపరికం లేని పద్ధతి. నచ్చడం, నచ్చకపోవడం అంతే. కాని సద్దుకు పోవడం నా కంత రుచించదు.

చివరికి "నా జాతకం(!) శాఖ వివరాలు రాస్తే ముహూర్తం పెట్టిస్తాను. ఒడుగు చేసి పెళ్లి చేస్తాను. నా కిష్టం మున్నా, లేకున్నా అయిష్టంగానే ఒప్పుకుంటానని వాడితో చెప్పు" అని అన్నారుద్రకు ఉత్తరం రాశారు. ఆరుద్రకు దాని మీద చాలా కోపం వచ్చింది. కాని అన్నారుద్ర నా దగ్గిర యీ సంగతె చెప్పారు. ఆయన బాగా శాస్త్రాలూ, కావ్యాలూ చదువుకున్నవారు. ఆంధ్రపత్రిక (దిన) ఉద్యోగం చేసేవారు. "నాకు జాతకం లేదు. మరీ వేస్టుగా ఏడాది చివరి రోజు డిసెంబరు 31 న పుట్టానని నాన్న ఎప్పుడూ విసుక్కునే వారు. చిన్న బహుమతో, కొత్త బట్టలో కొనే అవకాశం కూడా లేదు! అంచేత మీరు మా నాన్నగారికి రాయండి – ముందు మీరు ఆరుద్రని కూర్చోపెట్టి మాట్లాడండి. నేను యీ తతంగం పెళ్లి చేసుకోను. అదికూడా చెప్పండి, అప్పుడు చూద్దాం" అని చెప్పాను. *మా నాన్న యీ అన్నారుద్రని 'శాస్త్రీ' అని పిలిచేవారు. ఎప్పుడూ ఆరుద్రని 'పంతులూ' అనే పిలిచే వారు.* పాపం అడకత్తెరలో పోక చెక్కలా అయింది అన్నారుద్రపని...ఈ విషయాల రచ్చ ఆరుద్రని చాలా విసిగించింది. "మనం వాళ్లీ పనులు చేసే ముందరే పెళ్ళి చేసేసుకుందాం" అని పట్టు పట్టాడు. నెలలు గడిచాయి. ఒకరోజు అన్నారుద్ర వచ్చి – అన్నీ సిద్ధం చేసుకుని బాబు కుటుంబంతో బయలుదేరి వస్తున్నానని రాశాడు. "వీడు అగ్గిరాముడై నా మీద ఎగురుతున్నాడు. అసలు వాడు మాట్లాడడు! ఎలా? అన్నారు." "మీరు యీ మాట ఎత్తకండి అన్నారుద్రా మేం ఏప్రిల్‌లో వివాహం చేసుకుంటాం. నాకూ, అతనికీ కూడా 'స్పెషల్ మేరేజస్ యాక్టు' కింద చేసుకోవాలని వుంది... ఏం జరిగితే అదే జరుగుతుంది" అని చెప్పాను. "ఏంలేదు రామలక్ష్మీ, ఆరుద్ర తననుంచి వేరైపోతున్నాడని శ్రీనివాసరావు బాధ. పెళ్లి చేసుకుంటే వీడు ఒకదారిన పడతాడని నాకూ వుంది. నేను చెప్పి చూశాను. కాని

కె. రామలక్ష్మి, ఫోన్ 040-24162885

శ్రీనివాసరావు నువ్వంటే సహించలేడు. నీ మాట ఎత్తితే కోపం, అరుపులు.... అటు బాబుకి, ఇటు వీడికి మధ్య నేను నలిగి పోతున్నాను" అని బాధ పడ్డారు ఆన్నారుద్ర. నాకు చాలా ధైర్యం – ఒక విషయలో. ఒక నిర్ణయం అంటూ తీసుకున్నాక అడుగు వెనక్కి వేసే తత్వం నాదీ కాదు, ఆరుద్రదీ కాదు... లోకంలో ఎవరి స్వార్థం వారికి వుంటుంది. అది సహజమే. కాని సంఘంలో అది చాలా వరకు బయటపడకుండా వుండకల్గడమే కదా నాగరికత అంటే!



కె. రామలక్ష్మి ఆరుద్ర

నేనూ ఆరుద్ర చాలా కాలంగా మిత్రులం. కబుర్లు, కాకర కాయలు. కవిత్వం, కథలూ, సరదా సాహిత్యం, సీరియస్ సాహిత్యం – ఇద్దరం యుద్ధం లెవెల్లో చర్చించి – తరవాత నవ్వుకునేవాళ్లం – యీ విషయాలకి ఇంత రెచ్చిపోవాలా అని... నా మిత్రులంతా అతనికీ మిత్రులే – నా మిత్రుడు యస్. స్టాల్ (డచ్ – జ్యూ) నమస్సివాయం (కారైనగర్ జాఫ్నా సిలోన్), నరసింహారావు (వెటర్నరీ డాక్టరు రాజమండ్రి), సంతాన్ రాజ్ (క్రిస్టియన్ – ఆర్టిస్ట్ ) వీళ్లలో ఎవరికీ ఒకరితో చదువులో పోలికల్లేవు. కాని అందరూ మంచి మిత్రులు. ఆరుద్ర కూడ వీరితో చేరి చాలా సరదాగా వుండడం నేర్చుకున్నాడనాలి. విక్టోరియా హాస్టల్‌డేకి వీరికి మేం ఉభయులం అతిథులం! వేరే చెప్పాలా! అబ్బాయిల హాస్టల్ ఎంత గోలగా వుంటుందో. కాలం చాలా హాయిగా వుండేది. ఎన్నిరకాల వూహల కలబోత! ఎంత మెదడుకి మేత... ఇదంతా ఆస్వాదించడం మరిగిన ఆరుద్ర చాలా మారిన మనిషి అయ్యాడని ప్రొడ్యూసర్లు కూడా అనేవాళ్లు. భావనారాయణగారు (రాజమండ్రి, నిర్మాత, మా నాన్నకి కూడా పరిచయం ఉన్నవారు) "ఏమిటీ ఆరుద్రా! సాయంత్రం అయేసరికి పియామిలనకోజానా!" అంటున్నాడు. ఇదా విషయం అని వేళాకోళం చేసేవారు. నన్ను తూ.గో.జి. అనేవారు. అంటే వాళ్లు లిటిగెంట్స్ అని! రేడియోస్టేషనుకి, కాలేజీలలో నాటక పోటీలకి హాయిగా వెళ్లేవాళ్లం. లా కాలేజి వాళ్లకోసం ఆరుద్ర 'దేవుని ఎదుట' నాటకం రాశారు. అలాగే క్వీన్ మేరీస్ కళాశాల ఆడపిల్లల కోసం 'సీతాకోక చిలుక' నాటకం రాశారు. చూశాం...నావి ప్రేమ పొరలు కప్పిన కళ్లు కావు. ఆ నాటకం చూసిన వాళ్లు అచ్చులో చదివిన వాళ్లు.. వేళాకోళం చేసేవారు – నన్నూ ఆరుద్రనీ. అందులో కాబోలు – 'నా జీవిత పత్రం మీద గూడు కట్టుకొని – నన్నే తినమని వాక్యం వుంటుంది... అందరికీ తెలిసింది గాని, నాకే తెలియలేదీ సంగతి.

ఇంత జరిగినా ఆరుద్రకి పీటల మీద పెళ్లి చేస్తారేమో నన్న భయం పట్టుకుంది.! 'మన పెళ్లి మనిష్టం మీద జరగాలని నువ్వు మీ నాన్నగారితో ధైర్యంగా చెప్పు, ఒప్పించు. కర్రా విరక్కుండా పాము చావకుండా పనులు జరిపించుకోవడం అలవాటు చేసుకో – అందుకే 'అంతా అతనే – నాకు' అంటున్న నువ్వు శ్రీనివాసరావుతో చెప్పు, ఒప్పించమను.' అన్నారుద్ర చేయలేకపోయారు కదా, అంటే నా మీద చాలా కోపం వచ్చిందారోజు ఆరుద్రకి. 'నేనతనితో సూటిగా వాదించలేను. అతనికీ పెళ్లి ఇష్టం లేదు. కాని అయిష్టంగానే ఒప్పుకుంటాడు. అందుకే అతను మన పెళ్లికి సంతకం చెయ్యాలని నా కోరిక. అందుకే ముందే పెళ్లి చేసుకుందాం' అని. నా కప్పుడప్పుడు అనిపిస్తుంది – సాహసం చేయదలిస్తే ఆడదే గట్టిగా నిలబడతుందేమోనని.

నేను కొత్తదాన్ని కాదు. నన్ను తరుచు స్వతంత్ర కార్యాలయంలో చూస్తూన్న వ్యక్తే – అయినా నాపై ఎందుకో యింత అయిష్టత అనుకునేదాన్ని. ఆరుద్ర దగ్గిర తన స్వేచ్ఛ కోల్పోతాననా? లేక నిజంగానే నేనతనికి తగని దాన్ననా? నాకు అర్థం కాలేదు. ఒకసారి గోరాశాస్త్రిని అడిగాను యీయనగారికి నేనంటే ఇంత కోపం ఎందుకా?' అని. 'నీలాంటి వాళ్లంటే భయమే. చనువుకి చోటివ్వవు, అలా అని నిర్లక్ష్యంగా మాట్లాడవు. అలాంటప్పుడు మగాడు ఎలా రియాక్టు

కావాలో తెలియక తికమక పడతాడు' అన్నాడు. నిజమేనేమో సరదాగా మాట్లాడినంత మాత్రాన కొందరు వేరేగా అర్థం చేసుకొంటారు! తెలివిగా మాట్లాడితే భరించలేరు!! మాట్లాడకుండ వూరుకున్నా భరించలేరు. ఈ లోకాన్ని – చుట్టూ మనుషులని అర్థం చేసుకోవడం – కత్తిమీద సామే.

మేం ఇంకా ఇలా కొట్టుకుంటూండగానే ఏప్రిల్ '55' రానేవచ్చేసింది. ఎవరి వ్యూహాలు వారు రచిస్తూనే వున్నారు. చివరికి ఒకరోజు నాన్నతో అన్నాను. 'మేం రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్తాం నాన్నా. రిజిస్టర్ చేస్తాం. టైమిస్తారు. అప్పుడు చూద్దాం. ఇంటి దగ్గిరా? ఆఫీసులోనా అని.'

'చూడు అతన్ని కూడ అడుగు. అనవసరంగా అతని తల్లిదండ్రుల కిష్టంలేని పని చేయడం వల్ల తరవాత ఇబ్బంది అవుతుందేమో, 'ఎలా పెళ్లి చేసుకున్నా – తప్పదు!' అన్నా. 'నిజమే – చూసిచేసిన పెళ్లిళ్ల కేమేనా గ్యారంటీ వుంటోందా? ఇష్టపడి చేసుకున్న పెళ్లికీ గ్యారంటీ వుండదు. బ్రతకడం నేర్చుకోవాలంటే!.. బాధనిపిస్తే రోగనివారణ చేసుకోవాలి!' అన్నాను.

నాన్న చాలా వేదాంత ధోరణిలో కాస్సేపు ఆలోచించారు. అతనికీ నచ్చిన ఈ ఆరుద్ర పంతులుకి కుటుంబంలో యిబ్బందులు ఏర్పడతాయేమోనని.

''ఫరవాలేదు నాన్నా. అన్నారుద్రవున్నారు. చూసుకుంటారు" అనేశా. కాని మేం రిజిస్ట్రార్ కార్యాలయానికి బయలుదేరేదాకా.. ఒక విధమైన ఆలోచనల ఆరాటం. వెళ్లాక ఏముంది?

---

ఉగాది చిత్రం:

## గూడూరి ప్రభాకరరావు

"కళ, కళకోసమే కాదు, దానికొక సామాజిక ప్రయోగముందని నమ్మేవాళ్ళ"లో గూడూరి ఒకరు. పశ్చిమ గోదావరి జిల్లా 'మామిడి కుదురు'లో జన్మించిన (1949లో) గూడూరికి బాల్యంలోనే తల్లిదండ్రులు స్వర్గస్తులు కావటంతో, హైదరాబాదులో నున్న చిన్నాన్న నారాయణమూర్తి దగ్గర పెరిగారు. ఆయన చిత్రకారుడవటం, తనకు కూడా అభిలాష ఉండటముతో చిత్రకళలో ప్రావీణ్యం సంపాదించారు.



1966వ సంవత్సరంలో మొదటి సారిగా ఆయన వేసిన చిత్రమొకటి ఆంధ్రప్రభలో ప్రచురితం కావటంతో రెట్టింపయిన ఉత్సాహంతో ఆ రంగంలో మరింత ముందుకు దూసుకు పోయారు. అధ్యయనంగా చిత్రకళను, ఎక్కడా అభ్యసించలేదు. డ్రాయింగ్ హైయ్యరు పాసయి రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖలో 36 సంవత్సరాలపాటు ఆర్టిస్టుగా పనిచేశారు. అక్కడ ఎయిడ్స్ నిరోధానికి ఆయన వేసిన చిత్రాలు రాష్ట్రమంతటా ప్రచారానికి ఉపయోగించ బడ్డాయి. ప్రభుత్వం తరఫున పంపబడే గ్రీటింగ్ కార్డులకు రూపకల్పన చేసి ఢిల్లీ నుంచి బహుమతు లందుకున్నారు.

1975వ సంవత్సరంలో తనకున్న అరకొర ఒనరులతో 'హాస్యప్రభ' అనే పేరుతో ఒక కార్టూనుల పత్రికను 10 సంవత్సరాలు నడిపారు. 1976వ సంవత్సరంలో 100 మంది కార్టూను చిత్రకారులను పరిచయం చేస్తూ, వారి చిత్రాలను (బాపూ, చంద్ర లాంటి వారితో) ఒక పుస్తకంగా ప్రచురించారు. ఇది తెలుగులో వచ్చిన మొదటి కార్టూన్ సంపుటి అనుకోవచ్చు.

ఉద్యోగ విరమణ అనంతరం హైదరాబాద్, వసంత్‌నగర్, కూకట్‌పల్లిలో ఉంటూ ఎందరో వర్ధమాన చిత్రకారులకు శిక్షణ ఇస్తున్నారు. రసరమ్య రంగులు, వస్తువులు పోటీపడేలా చిత్రాలను ఆవిష్కరించటంలో ఆయనదొక విలక్షణమైన శైలి.

**వాణి : 9866876020**



# కాఫ్కా కోరిక

**- లయ**

*కాఫ్కా మనసు కల్లోల సముద్రం. ఆ కడలి లోతులలో అడుగడుగునా అగ్ని పర్వతాలు. ఆత్మలోకాన్ని అతలాకుతలం చేసిన భూకంపాలు. అనుభవాలను దహించివేసిన సహస్రబాహువుల బడబాగ్ని జ్వాలలు, క్షణం విరామ మివ్వని తుఫానులు. సుడిగాలులు. అది యాతనామయ చేతన! 'ప్రేయసీ, నువ్వు ప్రేమఖడ్గానివి. గుండెను చీల్చి పదిలంగా నిన్ను దాచుకుంటాను" అని లేఖ రాసిన మనిషి ఆలోచనా ధోరణిని మరెలా వర్ణించమంటారు!*

*అంతుచిక్కని అధికారపు చీకటి వరండాలు, చట్టపరంగా వ్యక్తి స్వాతంత్ర్యాన్ని హరించే న్యాయవ్యవస్థలు, భయాందోళనలకు లోనుచేసే రక్షక వ్యవహారాలు – ఇవన్నీ నేటికీ, ఇప్పటికీ మనల్ని వెంటాడే కాఫ్కా భయాలు!!*

ఆస్ట్రో హంగేరియన్ సామ్రాజ్యంలోని ప్రాగ్ నగరంలో పుట్టి పెరిగాడు ఫ్రాంజ్ కాఫ్కా (1883–1924). 'లా' లో పట్టభద్రుడు. కాని ప్రాక్టిస్ చెయ్యలేదు. అంతకన్నా గుమాస్తాగా ప్రభుత్వోద్యోగం మెరుగనుకున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా వున్న సర్కారు కచేరీల్లో కనిపించేదేమిటి? అక్కడి భరించలేని దుర్గంధానికి మూలమేది? ఫైళ్లలో పేరుకుపోయిన దుమ్ములాంటి అవినీతి. తోటి వుద్యోగుల 'లౌక్యం' భరించలేడు కాఫ్కా. దీనికి మరో కారణముంది. అతడి తండ్రి ఒక సక్సెస్‌ఫుల్ సెల్ఫ్‌మేడ్ వ్యాపార ప్రముఖుడు (ఇలాంటి వాళ్ల అహంకారాన్ని, దర్పాన్ని చలం అనేకసార్లు తన కథల్లో చిత్రించాడు). కొడుకు, తనను ఆదర్శంగా తీసుకుని పైకి రానందుకు 'ఎందుకూ పనికి రాని చవట' అన్నాడు. మాట పరుషం. అతడి మౌనం మరింత గాయపరుస్తుంది. తృణీకారంగా చూసే చూపు నిలువునా కాల్చివేస్తుంది (కాఫ్కా తండ్రికిరాసిన లేఖకు సాహిత్యంలో ప్రత్యేక స్థానముంది).

పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. చేసుకోలేకపోయాడు. క్షయవ్యాధి పట్టుకుంది. ఫ్రాయిడ్‌ను చదివి దీనికి మూలం మనోవేదన కాబోలు అనుకున్నాడు. సగం జీవితం గడిచింది. అర్థంకాని ఆత్మగ్లాని అంతరాంతరాలను తొలిచేస్తున్నది. భౌతిక జీవితానికీ, మానసిక జీవితానికీ తేడా లేకుండా పోతున్నది. ఈ వింత అంతర్లోకాన్ని మాటల్లో పట్టుకోవాలి. అలా ప్రారంభమైంది రచన.

"రచనకు మాత్రమే అనుకూలిస్తుంది నా జీవితం. టైం లేదు. శక్తి పరిమితం. ఆఫీసులో కనిపించేవన్నీ హారర్ దృశ్యాలే. అపార్టమెంటులో గోల భరించలేక పోతున్నాను. ఎంత దాచుకోవాలని ప్రయత్నించినా 'రచన'లో అలసట ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది"

"రచయితగా నా జీవితం ఎలా వుండబోతోందో నాకు తెలుసు. కళ్ళముందు కనిపించే లోకాన్ని గురించి కాక, స్వప్నావస్థ గురించి రాయటమే నాకిష్టం. ఇది తప్ప, మరే పని చేసినా తృప్తి వుండదు. మరణం సుఖమే. మరణ వేదనను భరించటమే క్షణక్షణం నరకం. ఇక, చివరి క్షణం దాకా నన్ను చేయిపట్టుకుని నడిపిస్తుంది మృత్యువు."

"కుటుంబం ఆఫీసు, మిత్రులు, నగరం, వీధులు అంతా వూహ. మరి సత్యమేమిటి? కిటికీలూ, తలుపులూ లేని చెరసాలలో రాతి గోడకేసి తలబాదుకుంటున్నాను. అదొక్కటే సత్యం. నా గోల ఎవరికీ వినిపించదు.

"ఇంతకూ, నేను పుట్టానా లేక పుట్టటానికి సందేహిస్తున్న అశరీర జీవినా? అంటూ రాసుకున్నాడు లేఖల్లో, డైరీల్లో.

కాఫ్కా కథలు రాశాడు. "కాని అవి కథలుకావు, పొడుపు కథలు" అన్నారు. దేని గురించి రాస్తున్నాడో తెలియదు. ఆయన సాహిత్యమంతా ఆత్మకథాత్మకమేగాని అది మనం అర్థం చేసుకోగలిగిన ఆత్మకథ కాదు. ఆ రచనలన్నీ అసలు సిసలైన 'అమ్మ కథలు'. అన్నీ ప్రతీకలే. కాని దేనికి ఏది ప్రతీకో తెలియదు.

ఉదాహరణకు 'ది ట్రయల్' (కాఫ్కారాసిన మూడు అసంపూర్తి నవలల్లో యిదొకటి. మిగతా రెండు: అమెరికా, ది కాసిల్.) లో కథా ప్రదేశం గురించిన ప్రస్తావన వుండదు. అది ప్రాగ్ కావచ్చు లేదా మరో యూరోపియన్ నగరమైనా

కావచ్చు. కథా నాయకుని పేరు జోసెఫ్ కె. వయసు ముప్పై ఏళ్ళు. బ్యాంక్‌లో వుద్యోగం. బోర్డింగ్ హౌజ్‌లో వుంటాడు. బ్రహ్మచారి. మిత్రులెవరూ లేరు.

ఒక ఉదయం, నిష్కారణంగా యిద్దరు వ్యక్తులు వచ్చి అతణ్ణి అరెస్టు చేస్తారు. తనేం నేరం చేశాడో తెలియదు. ఎప్పుడు కోర్టులో హాజరు పరుస్తారో తెలియదు. ఏ చట్టాల ప్రకారం విచారణ జరుగుతుందో తెలియదు. నేరం తెలియదన్నాంగద. అవును. ఎవరు ఏ నేరం ఆరోపిస్తే అదే. అరెస్టయినా, రోజువారీ పనులు చేసుకోవటానికి అభ్యంతరం చెప్పరు అధికారులు. విచారణ ప్రారంభ మవుతుందిగాని అది కోర్టు హాలో మరే ప్రదేశమో తెలియదు. అంతా మురికి. దుర్గంధ భూయిష్టమైన వాతావరణం. విచారణ పద్ధతులు అర్థం కావు. ఉన్నతాధికారులు, అవినీతి పరులు గాని, కింది వాళ్లు ఫరవాలేదు. న్యాయమూర్తులు కనిపించరు. అసలు వాళ్ళున్నారో లేదో కూడా వూహకందదు. ఏళ్ళ తరబడి కొనసాగుతుంది విచారణ. ఎప్పుడూ, ఎవరూ విడుదల కారు.

తనేనేరం చెయ్యలేదని నిరూపించుకోవటానికి విఫలయత్నం చేస్తాడు కె. కనీసం ఆరోపణ ఏమిటో తెలిసినా బాగుండును. సహాయం అర్థిస్తూ అనేకమందిని కలుస్తాడు. మొదట బోర్డింగ్ హౌజ్‌లోనే వుంటున్న స్నేహితురాలు మిస్ బర్స్టన్ (టైపిస్ట్) కు తన గోడు చెప్పుకుంటాడు. కాని యితర్ల సమస్యలు వినటానికి ఆసక్తి చూపదామె. ఒక ఆదివారం నాడు జరిగిన విచారణలో తన నిర్దోషిత్వాన్ని నిరూపించు కోవటానికి సుదీర్ఘంగా వాదిస్తాడు కె. హాల్లోని ప్రేక్షకులు తన పట్ల సానుభూతి చూపించారనే అనుకుంటాడు. కాని, మరుక్షణమే వాళ్ళంతా కోర్టువారి ఏజంట్లని తెలుస్తుంది. మరోసారి విచారణను రమ్మని ఆదేశాలు వస్తాయి. తన కనుకూలంగా తీర్పు వస్తుందేమోనని ఆశ. హడావిడిగా కోర్టుకు చేరుకుంటాడు. కాని, ఆ ప్రాంగణం, హాలు నిర్మానుష్యంగా వుంటాయి. ఇదే అదనుగా అక్కడున్న 'లా' పుస్తకాలు తిరగేస్తాడు. వాటిలో బూతు బొమ్మలు తప్ప మరే సమాచారమూ వుండదు.

కోర్టు చుట్టూ తిరగటంతో బ్యాంకుపని కుంటుపడుతుంది. నిస్పృహలో, తన కేసు వాదించమని, ఒక లాయర్ను అడుగుతాడు. కాని ఆ లాయరు జబ్బు మనిషి. అతడి సెక్రటరీతో ప్రేమలో పడతాడు కె. ఆ తొందరపాటు చర్యతో కేసు చేజేతుల పాడు చేసుకున్నావంటాడు అతడి అంకుల్. పునర్విచారణకు ఆదేశించాలని, అత్యున్నత న్యాయస్థానానికి అర్జీపెట్టుకోవాలని ఆలోచన వస్తుంది. కాని ఆ వెంటనే కోర్టువాళ్లు యిలాంటి అప్పీళ్లు పరిగణలోనికి తీసుకోరని కూడా తెలుస్తుంది.

కోర్టుకు ఒక ఆస్థాన ఆర్టిస్టు వుంటాడు. అక్కడ, అతడికి బోలెడంత పరపతి వుందని చెబుతారు హితైషులు. కె. కేసు ఆసాంతం విని, మూడు పరిష్కారాలు సూచిస్తాడు ఆర్టిస్టు. ఒకటి; విడుదల కావచ్చు. కాని అది అసంభవం. రెండు; తాత్కాలికంగా విడుదల కావటం అంటే, తిరిగి అరెస్టయ్యే అవకాశాన్ని చేజేతులా కొనితెచ్చుకోవటం. మూడు; విచారణను నిరవధికంగా వాయిదా వెయ్యటం.

తను ఎంపిక చేసుకున్న లాయరు శ్రద్ధ కనపర్చటం లేదని, మరో యువ లాయర్ను కలుస్తాడు కె. కాని, అందరు లాయర్లూ అంతే.

చివరి విచారణ చీకటి గుయ్యారంవంటి చర్చిలో జరుగుతుంది. అక్కడ, ప్రీస్టు, కె. ను పక్కకు పిలిచి, ఓ పిట్టకథ చెబుతాడు. చట్ట ప్రపంచంలోకి ప్రవేశించటానికి ఓ వ్యక్తి అనుమతికోసం నిరీక్షిస్తుంటాడు. కాని, ద్వారపాలకుడు అతణ్ణి అనుమతించడు. ఏళ్లు గడుస్తాయి. లంచమివ్వటానికి ప్రయత్నిస్తాడు. డబ్బు తీసుకుంటాడుగాని లోపలికి మాత్రం వెళ్లనివ్వడు ద్వారపాలకుడు. ఒక జీవితం గడిచిపోయింది. చివరి క్షణాల్లో "లోపలికెవ్వరూ వెళ్ళగూడదా?" అని అడుగుతాడు. "నీ ఒక్కడికే అనుమతి వుంది. కాని, నువ్వు త్వరలో మరణిస్తావు గనక. ఇక ఈద్వారం మూసేస్తాం" అంటాడు ద్వారపాలకుడు. ఇంతకూ ప్రీస్టు చెప్పిన కథేమిటి? అదే దేనికి ప్రతీక? – కె.కు అర్థం కాని ప్రశ్నలవి (మనకూ అర్థంకావు).

ఏడాదితర్వాత, తొలుత అరెస్టు చేసిన వాళ్ళు తిరిగి వస్తారు. ఈసారి, కె.కు వాళ్ళను ప్రతిఘటించే ఓపిక కూడా లేదు. ఆత్మరక్షణకోసం ప్రయత్నించడు. ఒకడు చేతులు విరిచి పట్టుకుంటే, మరొకడు బాకుతో ఛాతీలో పొడుస్తాడు. దీనికి మతపరంగా, తాత్వికపరంగా పలువ్యాఖ్యానాలు చేశారు పండితులు.

కాఫ్కా లోకం ఎవరికీ అంతుపట్టదు. నిర్దయులు, క్రూరులు చట్టాల్ని తమ కనుకూలంగా మలచుకుని పరిపాలిస్తున్నారు. మనం, వాళ్ల అధికారానికి తలూపటమే తప్ప, ఎదురు తిరిగి ప్రయోజనం లేదు.

కాఫ్కా కథల్లో ముఖ్యమైనది మెటమార్ఫసిస్. "మొదటి వాక్యం ఒక్కటి చాలు, ముక్కుకు మూగుదాడు వెయ్యటానికి." "ఉదయం లేచేసరికి గ్రెగర్‌జంజా పెద్ద కీటకంగా మారిపోయాడు" ("ప్రపంచ కథాసాహిత్యంలోని అత్యంత ప్రసిద్ధ ప్రథమ వాక్యం యిది" అంటారు విమర్శకులు). ఫ్రాయిడ్ మానసిక విశ్లేషణ సిద్ధాంతాలతో ప్రభావితుడైన కాఫ్కా 'తన అదుపాజ్ఞల్లో బతకాలని శాసించిన తండ్రిముందు తన అల్పత్వానికి ప్రతీకగా ఈ కీటకాన్ని సృష్టించాడు.

ఇంతకూ ఈ కీటకం ఎలావుంది? "సన్నటికాళ్లు" అన్నాడు గనక అది బొద్దింకకావచ్చు. కాదుకాదు. "పేడపురుగు" అన్నారు మరికొందరు. "కాళ్లు చాలావున్నాయి. శరీరం పొడుగ్గా వుంది" అనికూడా అన్నాడు. ఆరుకన్నా ఎక్కువ కాళ్లంటే అది జెర్రి అయ్యే అవకాశమూ లేకపోలేదు. 1915లో యిది పుస్తకంగా వచ్చినప్పుడు ముఖచిత్రంగా కీటకంబొమ్మ గీయకూడదని ఆంక్షపెట్టాడు కాఫ్కా. అదే కీటకమో తెలియనప్పుడే పాఠకులు తమకుతోచినట్టుగా వూహించుకుంటారు.

"సాహిత్యం పదచిత్రాలతో, విజువల్‌గా వుండాలనే అభిప్రాయం బలపడుతున్న ఈ రోజుల్లో, పాఠకుల ఆలోచనలకు పదునుపెట్టటమే లక్ష్యంగా సాగిన కాఫ్కా ఒంటరి పథికుడు అనటంలో సందేహంలేదు" ఇది అమెరికన్ రచయిత జాన్ అప్‌డైక్ అభిప్రాయం.

"నా అంతస్సంఘర్షణ ఎవరికీ పట్టదు. గుడ్డివాళ్లకు సినిమా చూపించినట్టు రాస్తున్నాను" అన్నాడు కాఫ్కా.

ఈయన స్వాప్నిక ప్రపంచానికీ, జేమ్స్ జాయిస్ ఆదిగా వచ్చిన చైతన్య స్రవంతి ప్రక్రియలకూ తేడావుంది. కాఫ్కావి కేవలం వూహలు, ఆలోచనలు కావు. అది అతని అంతర్లోకం. నిత్యానుభవమైన వాస్తవం. ఆ బాధలు, భయాలు, సందిగ్ధత నిజం. అతను రాసింది. పాత్రల మనస్తత్వమో లేక స్వంత చీకటిలోక విహారమో ఎవరూ విడమర్చి చెప్పలేరు. సాహిత్యంలో యిన్ని రహస్య ద్వారాలగుండా ప్రయాణించిన రచయిత మరొకరు లేరు. రచనలే సరస్వంగా బతికి, ఆ రచనలన్నీ, తననితానూ అసహ్యించుకున్నాడు కాఫ్కా.

జీవితకాలంలో ఒకే ఒక్క కథా సంకలనం అచ్చయింది. తరువాత, తను రాసిందంతా తగలెయ్యమని, తన మిత్రుడు మాక్స్‌బ్రాడ్‌ను వీలునామాలో కోరాడు కాఫ్కా.

ఆప్తమిత్రుని చివరి కోరికను తిరస్కరించి, సాహిత్యానికి మహోపకారం చేశాడు బ్రాడ్.

నవలలు, కథల్నే కాదు. ఆయన నోట్స్, డైరీలు, ప్రైవేటు లేఖలు, చివరికి టెలిగ్రాముల్ని కూడా అధ్యయనంచేసి కాఫ్కాను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు పరిశోధకులు. ఆత్మాశ్రయ రచయితలకు ఆరాధ్యుడు కాఫ్కా..

కాఫ్కా రచనల్లోంచి మెరుపుల్లాంటి, మెరికల్లాంటి వాక్యాలు కొన్ని :

1. లోపల గడ్డ కట్టిన సముద్రాన్ని పగలకొట్టే గొడ్డలి కావాలి పుస్తకం.
2. కార్యశూరుడు, ఆలోచనల పద్మవ్యూహంలో చిక్కుకుంటే అది విషాదమే.
3. తన చుట్టూవున్న లోకంలో సౌందర్యం చూడగలిగిన వాణ్ణి వృద్ధాప్యం దరిచేరదు.
4. మానవ సంపర్కమే వ్యక్తికి ఆత్మపరిశీలన నేర్పుతుంది.
5. ప్రగతిలో నమ్మకముందంటే అర్థం, యిప్పటికే ప్రగతి జరిగిందని నమ్మటంకాదు.
6. రాత్రవుతుందేమోనని భయం. రాత్రి యింకా ఎందుకు కాలేదని భయం.
7. కార్యసాధన నుండి మన దృష్టిని మరల్చేదే ఈవిల్.
8. దేవుడు, మనకు గట్టి పెంకులున్న కాయల్ని ఆహారంగా యిచ్చాడు. కాని వాటిని మనమే పగులకొట్టుకోవాలి.
9. ఆత్మజ్ఞానం ఒక వూహ. బాహిర ప్రపంచ జ్ఞానం వాస్తవం.
10. అన్ని దుర్వ్యసనాలకూ మూలం అలసత్వం.
11. మనిషి శాశ్వతంగా జీవిస్తాడనుకుంటే, యిక రేపు ఎప్పుడొస్తుంది?
12. పండిత చర్చల్లో వుదాహరణలు ప్రేమ గీతాల్లాంటివి. అందంగా వుంటాయి గాని దేన్నీ నిరూపించవు.
13. స్వేచ్ఛకన్న సంకెళ్లే క్షేమం.
14. చివరి తీర్పును నమ్ముతాం. అంటే మరణం తర్వాత కూడా అన్నీ చట్టప్రకారమే జరుగుతాయన్నమాట!
15. కడుపు నిండిందంటే, ఆ క్షణానికి ప్రపంచంలోని సమస్యలన్నీ పరిష్కారమైనట్టే.
16. బైబిల్ పరిశుద్ధగ్రంథమే. లోకమే అశుద్ధం.
17. నడుస్తున్న మనిషి రెండు కాళ్లమధ్య దూరమే మానవ చరిత్ర.
18. నిరంకుశత్వం, బానిసత్వం రెండూ విద్యా విధానంలో భాగమే. రెండింటికీ మూలం స్వార్థం. తల్లిదండ్రులు, పిల్లలకు చదువు చెప్పటానికి ఈ పద్ధతులే వాడతారు.
19. వివాహమంటే జీవితంతో రాజీపడటమే.

కాఫ్కా యెస్క్ అంటే ఒక అధివాస్తవిక ధోరణి. అనివార్యమైన ప్రమాదానికి సంకేతం. మి

# ఊర్వశి ఎవరు?

విక్రమోర్వశీయంలో కాళిదాసే పురూరవుడు. ఇందుమతీ, రతీ, శకుంతలా, మాళవికా వాళ్ల వాళ్ల ప్రియుల ప్రేయసులు. ఊర్వశి కాళిదాసు ప్రేయసి.

'అనంత యౌవనా' అని ఊర్వశిని ఆప్యాయంగా పిలిచి పిలిచీ రవీంద్రుడు ఎంత పాట పాడాడు? ఎలాంటి పాట పాడాడు? అసలు సామాన్య గేయాలు పాడే కవి కంఠంలో కూడా ఉజ్వల ప్రతిభ నింపుతుంది ఊర్వశి; నందనానిలం కదిపేసే మందాకిని లాగ దాన్ని పాడించేస్తుంది ఊర్వశి.

పాపం రవివర్మ ఒక్కడే ఊర్వశిని చిత్రిస్తానని ఉత్త స్త్రీని చిత్రించారు. ఊర్వశిని కవి ఒక్కడే ఎరుగును. కవి వాక్కు రుషివాక్కయితే లోకంలో ఊర్వశి ఒకత్తే ఉంటుంది కూడా.

లోకంలో రంభలు చాలామంది ఉన్నారు. ఒక్క ఊర్వశే ఉంది. అస్థి మాంసాదులతో రంభను చేశారు. ఆనందంతో, ఆశయాలతో వివిధానుభవాలతో ఊర్వశిని చేశారు. ఒక చక్కని స్త్రీ ఎలా ఉందో దాన్ని లోకము రంభ అంటుంది. ఒకస్త్రీ ఎలా ఉండాలో దాన్ని కవి ఊర్వశి అంటాడు.

ఊర్వశి స్త్రీ. విషంతో, అమృతంతో, చీకటితో, వెన్నెలతో కలిగిన ఊర్వశి తొలి వియోగిని, తొలి ప్రేయసి, నహుమాతా, నహు కన్యా, నహువధు అన్నాడు రవీంద్రుడు. దివ్యతరం, ఉజ్వలతరం అయిపోతూ ఉన్న ఆదర్శ సౌందర్యం ఊర్వశి. ఊర్వశి వేశ్యేమిటి? రంభ వేశ్య! ఊర్వశి మోహినీ హసమల్లి, వైజయంతీ పరిమళము, హరజటా పారిజాతము.



**కంటపడిన ప్రతిలావణ్యాన్ని కదిపీ, కదిపీ**
**పక్కన మ్రోగిన ప్రతి హృదయాన్ని పలకరించి, పలకరించీ**
**లోకంలో తనకు నచ్చిన సౌందర్యం లేదనీ**
**తన్ను ప్రేమించి, తాను ప్రేమించే ప్రేయసి లేదనీ**
**కుంగిపోయి, కుంగిపోయీ, ముచ్చిచ్చులో వేగివేగి**
**"నాకుగాదులు లేవు, నా కుషస్సులు లేవు"**
**అన్న నరకంలోకి వచ్చాక**
**తపస్సు పూర్తి అయ్యాక, శాంతచిత్తుడై**
**తానీ ప్రేయసిని సృష్టించుకున్నాడు.**

కనుక ఈ ఊర్వశి ఎవ్వరని? స్వకీయా? పరకీయా? అని అడిగేవారు తెలియక అడుగుతున్నారు.

ఊర్వశి కవిలో ఉంది. కవి హృదయంలాంటి హృదయమూ,

కవి భావన వంటి భావనను సంపాదించు. నీకూ దర్శనమవుతుంది. సీతమ్మ లోకైక మాతయితే, ఊర్వశి విశ్వప్రేయసి. నిజంగా ఎవరికైనా ప్రేయసి ఉంటే ఆ ప్రేయసి వానికి ఊర్వశి అన్నమాట.

*'అమ్మా, అమ్మా'* అంటే సీతమ్మ అన్నమాట
*'ప్రేయసీ, ప్రేయసీ'* అంటే ఊర్వశి అన్నమాట.

ఇది – దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదటి రేడియో ప్రసంగమే కాదు, మద్రాసు రేడియోనుంచి వచ్చిన మొదటి తెలుగు సాహిత్య ప్రసంగం కూడా (సంక్షిప్తంగా).

**– 'మిసిమి'**

# ఆరోహణ – 3

- ముక్తవరం పార్థసారథి



**ప్రాచీన అవశేషాల కాల నిర్ధారణ చెయ్యటానికి యిటీవల కొత్త ఆవిష్కరణ ఒకటి అందుబాటులోకి వచ్చింది. అదే, అందరికీ, సుపరిచితమైన 'రేడియో కార్బన్ డేటింగ్.' ఈ పద్ధతిని జీవ అవశేషాల వయస్సు నిర్ధారణ చెయ్యటానికి ఉపయోగిస్తారు. వాతావరణంలోని నత్రజని అణువులు రోదసి నుండి నిరంతరంగా వస్తున్న కోటానుకోట్ల కిరణాలతో ప్రభావితమై, రేడియో యాక్టివ్ కార్బన్ - 14లోకి చేరిపోతాయి. కిరణజన్య సంయోగక్రియవల్ల, ఈ అణువుల్ని మొక్కలు గ్రహిస్తాయి. ఈ మొక్కల్ని తిన్న జంతువుల్లోకి కూడా ప్రవేశిస్తాయివి. అంటే, వాతావరణంలోని కార్బన్-14 అణువులు, మనకు జీవజాలంలో కూడా లభిస్తాయి. జీవి మృతిచెందటంతో, అది రేడియో కార్బన్‌ను గ్రహించటం ముగుస్తుంది. క్రమేణా, ఇది వాటిని వదిలిపోతుంది. ఒక జీవి (అవశేషం) వయస్సును నిర్ధారించటం అందులో వున్న రేడియో కార్బన్ పరిమాణాన్నిబట్టి జరుగుతుంది. అయితే, 40,000 సంవత్సరాలకన్నా పూర్వపు సాక్ష్యాలను నిరూపించటానికి ఈ పద్ధతి నిరుపయోగం. ఎందుకంటే, అప్పటికి, వాటిలో రేడియో కార్బన్ ఏమీ మిగలదు. ఇది 1949 నాటి ఆవిష్కరణ.**

పొయ్యి వెలిగేతేనే యిల్లు – అది యింటికి ప్రతీక. ముప్ఫైవేల సంవత్సారాల క్రితం హెుమోసేపియన్ తన కొత్త జీవితం ప్రారంభించిన తర్వాత, గుహలే అతనికి ఇళ్లుగా మారాయి. 'మనిషి' లక్షణాలు వచ్చిన కనీసం పదిలక్షల ఏళ్ళదాకా అతడు ఆహార సంపాదన, వేట మాత్రమే తన ముఖ్యకార్యకలాపాలుగా బతికాడు. ఆ చరిత్ర పూర్వకాలానికి చెందిన సాక్ష్యాలేమీ మనకిప్పుడు లభ్యం కావటంలేదు. యూరోపియన్ మంచుయుగం చివరి దశకు చెందిన అవశేషాలను బట్టి (ఇవి ఆల్టామైరా గుహల్లోనూ, స్పెయిన్, దక్షిణ ఫ్రాన్స్‌లోనూ దొరికాయి) ఆనాటి మనిషి గురించి మనం కొద్దిగా తెలుసుకోగలం. ఈ (గుహా) కుడ్యచిత్రాల్లో యిరవై వేల ఏళ్ల క్రితం మనిషికున్న వేటాడే సామర్థ్యాన్ని, జంతువులనూ మనం చూడవచ్చు.

గుహాచిత్రాల వంటి మౌలికమైన కళ (మానవచరిత్రలో), యింత ఆలస్యంగా ప్రారంభం కావటం, యింత అరుదుగా లభించటం ఎందుకో అర్థం కాదు. 'ఆవిష్కరణ'లు లభించినంత అధికంగా ఈ దృశ్యకళ ఎందుకు విరివిగా వ్యాప్తి చెందలేదు? మనిషి బలహీనుడు. వేగంగా పరుగెత్తలేడు, నిరాయుధుడు. అందువల్ల ఒక రాతి ఆయుధం, ఒక కత్తి, ఒక బరిసె లాంటివి కనిపెట్టాడు. ఇవి అతని ఆత్మరక్షణకు, ఆహార సంపాదనకు కూడా అవసరం. కాని చిత్రకళ కేవలం ఒక అలంకరణ మాత్రవే. ఇదీ ఒక అవసరమని ఎందుకనుకున్నాడు? పైగా, తను ఎక్కడవున్నాడో అక్కడ గాక, ఎక్కడవేటాడో అక్కడగాక, చీకటిగా వున్న ఈ గుహల్లో నివసించి ఈ గోడలమీద ఎందుకు 'జంతువులను వేటాడుతున్న' బొమ్మలు గీశాడు?

సహజమైన సుస్పష్టమైన కారణం ఒకటి కనిపిస్తున్నది. ఈ అంధకారంలో, అతనికి ఒక ఐంద్రజాలికత గోచరించి వుంటుంది. జంతువులు 'మాజికల్'గా కనిపించాయి. ఇంద్రజాలం కేవలం ఒకపదం మాత్రమే. దేనికీ జవాబుకాదు.

ముక్తవరం పార్థసారథి, ఫోన్ : 9177618708

దాని అర్థం, మనిషి తనకు కొన్ని ప్రత్యేక శక్తులున్నట్టుగా గుర్తించాడని. కాని ఏవా శక్తులు? చిత్రాల ద్వారా సంక్రమించాయని ఆ వేటగాళ్లు విశ్వసించిన శక్తులేవి?

దీన్ని గురించి, నేను నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే మీతో పంచుకోగలను. ఆ బొమ్మలో అతడు తన వూహాశక్తిని గోడల మీద చూసుకున్నాడు. తన చర్యలనే గోడలమీద చిత్రించి తను రోజూ యిలా చేస్తున్నానా అని ఆశ్చర్యపడ్డాడు. వేటలో వున్న ప్రమాదాన్ని ముందే వూహించి చిత్రీకరించాడు. చీకటిలో తాను వేటాడిన దున్నలు, జింకలు, అడవిపందులు మాంత్రికతను సంతరించుకున్నాయి. జంతువును చంపే చివరి క్షణంలో దానికి అత్యంత సమీపంగా ఎలా వున్నాడో, ఆ సామీప్యాన్ని, సాన్నిహిత్యాన్ని గోడలమీద చిత్రిస్తున్న క్షణంలో అనుభవించాడు. క్షణికానుభవానికి అమరత్వం కలిగించటమంటే అదే. కాలగర్భంలో కలిసిపోని అనుభవమది.

గుహా చిత్రాలు, మనకు ఆనాటి మానవుని జీవనసరళిని సూచించే ఒక చారిత్రకాధారం మాత్రమే. మనకవి గతంలోకి తొంగిచూసే తలుపుకన్నం లాంటివి. అవి, అతనికి భవిష్యత్తును దర్శించే గవాక్షాలు. మొత్తం ఎవరు ఏ చివరి నుండి చూసినా, అవి టెలిస్కోపు లాంటివే – ఊహాశక్తి అనే టెలిస్కోపు ఆ అస్పష్టమైన రేఖా చిత్రాలు మన వూహాశక్తిని ప్రేరేపిస్తాయి – భూత, భవిష్యత్తుల వాహికలు అవి.

కళ, శాస్త్రం (సైన్సు) రెండూ మనిషి మాత్రమే సృష్టించగల విలక్షణ రంగాలు. వీటి మూలం దార్శనికత. వూహాశక్తి, భవిష్యత్తును అంచనా వెయ్యగలగటం. తదనుగుణంగా ప్రణాళికలు రచించగలగే సామర్థ్యం. కళ్ల ముందర లేనిదాన్ని గురించి ఆలోచించటం, గుహాంధకారంలోనైనా, టీవి తెరమీదనైనా దర్శించగలగటం మనిషికి మాత్రమే సాధ్యం.

తొలి ఆయుధం లేదా తొలి చిత్రానికి రూపకల్పన చేయాలనుకున్నప్పుడు మనిషి భవిష్యత్తులోకి తొంగి చూశాడు. అవి అతని సంతకాలు. "ఇది నేను. మానవుణ్ణి" అని ఆనాడే తన ముద్ర వేశాడు.



మానవచరిత్రా క్రమం ఎగుడు దిగుడుగా సాగింది. మొదటివి జీవసంబంధమైన పరిణామదశలు – అంటే చింపాజీల నుండి అతణ్ణి వేరుచేసిన దశలు. అవే కొన్ని లక్షల సంవత్సరాలపాటు కొనసాగాయి. ఆ తర్వాత ప్రారంభ మవుతుంది సాంస్కృతిక చరిత్ర – అంటే, యింకా వేటతోనే గడుపుతున్న ఆఫ్రికా తెగలకూ, ఆస్ట్రేలియాలోని (ఆహారసేకరణలో గడిపే) సంచారజాతులకు, మనకూ నాగరకతలో వున్న తేడా. అయితే, వాళ్లకూ, మనకూ సాంస్కృతిక పరంగా వున్నతేడా కొద్దివేల సంవత్సరాల నాటిది మాత్రమే. పదీ, పన్నెండువేల మధ్య వుండొచ్చు. ఎలా చూసినా యిరవైవేలకు మించదు. ఇక నేను, గత పన్నెండువేల సంవత్సరాల గురించే మాట్లాడతాను–మనం దృష్టి సారించిన మానవారోహణా క్రమం యిదే. కాని, కోట్ల సంవత్సరాల జీవపరిణామంతో పోల్చితే, కొద్ది వేల సంవత్సరాల సంస్కృతీ పరిణామం ఎంతగొప్పది!

ఒకసారి, మళ్లీ మనం పునశ్చరణ చేసుకుంటే – మధ్య ఆఫ్రికాలో, రెండు కోట్ల సంవత్సరాల క్రితం రాతి ఆయుధం చేతపట్టుకున్న ఆస్ట్రాలోపెతికస్ నుండి హూమోసేపియన్స్ దాకా. ఇతర జీవులతో పోల్చితే, జీవపరిణామ ఫలితంగా మనిషి ఎక్కువ మారాడని అనుకున్నా – అందుకు ఎంత సుదీర్ఘకాలం పట్టిందని! కాని హూమోసేపియన్స్ యిరవై వేల ఏళ్లలో మన వూహలనే మించిన ఆధునిక మానవుడిగా ఎదిగాడు. కళాకారులు, శాస్త్రజ్ఞులు, నగరనిర్మాణ వాస్తుశిల్పులు, యాత్రికులు, పరిశోధకులు – వూహాశక్తికి హద్దుల్లేవని నిరూపించిన మహానుభావులెందరు! సాంస్కృతిక విప్లవం కొనసాగిన వేగం అదీ! ఒకసారి అది ప్రారంభమైన తర్వాత, జీవపరిణామంకన్న వందరెట్లు వేగంతో అప్రతిహతంగా ముందుకు దూసుకెళ్లింది.

“ప్రారంభమైన తర్వాత” అన్నాం గదా; అదే కీలక దశ. ఈ భూగోళాన్ని తన గుప్పిట్లో పెట్టుకోగలిగిన మనిషి సాంస్కృతిక విప్లవం ఎందుకంత ఆలస్యంగా ప్రారంభమైందసలు? ఇరవై వేల ఏళ్ల క్రితం మనిషి వేటగాడే. ఆహారంకోసం వెదుకులాడే సంచారజీవి మాత్రమే. పదివేల ఏళ్ల క్రితం, కొన్ని ప్రాంతాల్లో, కొన్ని జంతువులను మచ్చిక చేసుకుని మొక్కల్ని పెంచటం ప్రారంభించాడు. నాగరికతంటూ మనకు తెలిసింది కేవలం గత పన్నెండువేల సంవత్సారాల్లో మాత్రమే. క్రీ.పూ. 10,000 ఏళ్ల ప్రాంతంలో ఒక పెద్ద పేలుడులాంటిదేదో సంభవించి వుండాలి. అదే, మంచుయుగం చివరి దశ.

హిమనదాలు కరుగుతున్న వాసనలు కూడా మనం పీల్చవచ్చు నిక్కడ (ఇది టి.వి.సీరియల్‌లోని కథనం). మంచుటెడారుల కలవాటుపడ్డ మనిషి, నేలమీద మొక్కలు మొలిచి, పూలు పూయటం చూసి, పులకించి పోయి వుంటాడు. ఇక, అతడి జీవితమే మారిపోయింది.

దీన్ని మనం ‘వ్యావసాయిక విప్లవం’ అంటాం. నేను అంతకన్నా పెద్దమాటే వాడదలచుకున్నాను. ఇది ‘జీవ విప్లవం’ – మొక్కల పెంపకంతోపాటు, జంతువులను మచ్చిక చేసుకోవటం, వాటి పోషణ కూడా ప్రారంభమైంది. భూమి మీద మనిషి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు – అంటే కేవలం నేలమీద మాత్రమే కాక, జంతుజాలాల్ని కూడా తన అవసరాలకనుగుణంగా మలచుకున్నాడు. ఈ విప్లవాలతో, సామాజిక విప్లవానికి కూడా తెరలేచింది. మనిషికి స్థిరజీవితం గడపడం సాధ్యమైంది. కాదు, కాదు. అవసరమైంది. లక్షలాది సంవత్సరాల పాటు సంచారిగా బతికిన ఈ జీవి స్థిర నివాసం ఏర్పరుచుకొనే క్రమంలో, అతడి మానసిక సంఘర్షణ ఏమిటి? ఇది మానవ శాస్త్రాధ్యయనంవల్ల మాత్రమే కాదు, బైబిల్–పాత నిబంధనలో కూడా తెలుస్తుంది.

సంచారజీవి సాక్ష్యాలను మిగల్చలేదు. ఉదాహరణకు పర్షియా (ఇరాన్)లోని బక్తియారీ తెగవారు ఒంటరిగా కదిలిపోతారు. ఇతర్లు వాళ్ల వునికి కూడా గమనించరు. ఇతర సంచార జాతుల్లాగానే, తాము ఒక కుటుంబమనీ, తామంతా ఒకే మూలపురుషుని సంతానమనీ అనుకుంటారు (యూదులు తమను తాము ఇజ్రయేలు లేదా జేకబు సంతతి వాళ్ళ మనుకున్నట్టుగా) మంగోలుల చారిత్రక పశువుల కాపరి బక్తియార్ నుండి వాళ్లకు (బక్తియార్లకు) ఆపేరు వచ్చింది.

“ప్రాచీన కాలంలో కొండల్లోంచి వచ్చిన మా మూలపురుషుడు బక్తియార్ తనతేజస్సుతో మమ్మల్ని అసంఖ్యాకంగా సృష్టించాడు. ఆయన సంతానమలా దినదినాభివృద్ధి చెందింది” అంటారు బక్తియార్లు.

ఇది సరిగ్గా బైబిల్ కథలాగే ధ్వనిస్తుంది.

జేకబ్ కిద్దరు భార్యలు. అతడు కూడ పశువుల కాపరిగా ఒక్కో భార్య వద్ద ఏడేసి ఏళ్లు పని చేశాడు.

“బక్తియార్ మొదటి భార్యకు ఏడుగురు కొడుకులు. ఒక్కొక్కరి నుండి ఒక్కొక్క వంశం ఏర్పడింది. అతడి రెండో భార్యకు నలుగురు కొడుకులు. వీళ్లంతా దాయాదుల పిల్లల్నే పెళ్లాడుతారు. లేకపోతే వంశం చెల్లాచెదరవుతుంది.”

ఇజ్రయేలు సంతతి లాగానే, యిక్కడ కూడా, కుటుంబ ఐక్యత ముఖ్యం. ఇది కాల్పనిక కథ కాదు. లేదా కుటుంబ శ్రేయస్సుకు ఒక సలహాదారు చేసిన సూచనకాదు.

**“ప్రాచీన కాలంలో కొండల్లోంచి వచ్చిన మా మూలపురుషుడు బక్తియార్ తనతేజస్సుతో మమ్మల్ని అసంఖ్యాకంగా సృష్టించాడు. ఆయన సంతానమలా దినదినాభివృద్ధి చెందింది” అంటారు బక్తియార్లు. ఇది సరిగ్గా బైబిల్ కథలాగే ధ్వనిస్తుంది. జేకబ్ కిద్దరు భార్యలు. అతడు కూడ పశువుల కాపరిగా ఒక్కో భార్య వద్ద ఏడేసి ఏళ్లు పని చేశాడు**

క్రీ.పూ.10,000 ఏళ్ల నాడు సంచారజాతుల వాళ్లు జంతువుల కదలికలను బట్టి తమ జీవిత విధానాన్ని మలచుకున్నారు. కాని, మేకలకు, గొర్రెలకు ప్రత్యేకమైన వలస ప్రయాణాలంటూ వుండవు. పదివేల ఏళ్లనాడే వీటిని మచ్చిక చేసుకున్నారు – కుక్కల్ని పెంచుకొనటం తరువాతి దశలో జరిగింది. అంటే మనిషి జంతువులను వెంబడించటం గాక, వాటిని పెంచి పోషించే బాధ్యతను తనమీద వేసుకున్నాడు.

సంచారజీవితంలో స్త్రీలకో ప్రత్యేక బాధ్యత వుంది – ముఖ్యంగా పురుష సంతానాన్ని వుత్పత్తి చెయ్యటం. ఆడపిల్లల్ని దురదృష్టంగా భావించారు. వాళ్ల పనులు వంట చెయ్యటం, బట్టలు కుట్టటానికే పరిమితమయ్యాయి. ఉదాహరణకు, బక్తియార్ తెగస్త్రీలు, బైబిలో చెప్పినట్టు – రాళ్ల కింద మంట బెట్టి, ఆసెగ మీదే రొట్టెల్ని కాలుస్తారు. అయినా, పురుషులు యింటికి తిరిగి వచ్చి, భోజనం ముగించిందాకా తాము తినరు. పాలుపితికి, మేకచర్మం సంచుల్లో గిలకొట్టి గట్టి పెరుగు తయారుచేస్తారు. ప్రయాణాల్లో వెంట తీసుకు పోగలిగిన అతి సామాన్యమైన పనిముట్లు మాత్రమే వాడతారు. సింపిల్‌గా వుండే పరికరాలంటే మనకు చాలా రొమాంటిక్‌గా వినిపిస్తుంది. కాని యిందులో రొమాన్సు ఏమీలేదు. రోజూ సాయంత్రం వాడుకొని, తెల్లవారి, కట్టకట్టి మోసుకుపోగలిగిన పరికరాలు సంచారజీవితానికి అవసరం మరి.

మానవారోహణలో తొలిమెట్టు – సంచారజీవితం మాని, ఒకచోట స్థిరపడి వ్యవసాయం ప్రారంభించటమే. ఇదెలా సాధ్యపడింది? మనిషి కోరుకున్నంత మాత్రాన ఏదీ జరగదు. మంచుయుగం తర్వాత, భూమి మీద వికసించిన అనేక లక్షల జాతుల మొక్కల్లో, పశ్చిమ ఆసియాలో పెరిగిన అడవి గోధుమ రకం ఒకటి. అనేకచోట్ల గోధుమలు దర్శనమిచ్చాయి. అందులో ప్రధానమైనది జెరికోలోని ప్రాచీన ఒయాసిస్ ప్రాంతం.

సంచారజీవితంలో, మన్నికవున్న వస్తువులకన్నా ఏ రోజు కారోజు వాడుకోగలిగిన వస్తువులకే ప్రాధాన్యత ఎక్కువ. నిజానికి బక్తియార్లకు గృహోపకరణాలు చెయ్యటం తెలియదు. వాళ్లకు, మెటల్ బిందెలు అవసరమైతే, దారిలో కనపించిన యితర జిప్సీల నుండి కొనుక్కుంటారు.

ఒక మేకు, ఒక బొమ్మ, పిల్లలను సముదాయించే చిరుగంటలు, ఏవీ వాళ్లు తయారు చెయ్యలేరు. ప్రతిదీ కొనుక్కోవాల్సిందే. లేదా వస్తుమార్పిడిలో సంపాదించుకోవలసిందే. సంచారజీవితంలో ఆలోచనకూ, ఆవిష్కరణలకూ అవకాశంలేదు. ఏ రెండు రాత్రులూ ఒక చోట గడపరు. కొత్తగా ఆలోచించడం వాళ్లకు తెలియదు. కొడుక్కు, తండ్రిని అనుకరించాలనే కోరిక తప్ప మరే ఆశయమూ వుండదు.

బక్తియార్లు, ప్రతి సంవత్సరం కనీసం ఆరు పర్వత శ్రేణుల్ని దాటుతారు. (కొన్నిసార్లు అదే మార్గం గుండా తిరిగి వస్తారు.) పదివేల ఏళ్లనాటి వాళ్ల పూర్వీకులకూ, నేటి బక్తియార్లకూ ఒకటే తేడా. ఆనాటి సంచారులు కాలినడకన బరువులు మోసుకుంటూ ప్రయాణించారు. నేటివాళ్లు గుర్రాలు, గాడిదలు, కంచరగాడిదలెక్కి, వాటిమీద సామాన్లు వేసి ప్రయాణిస్తారు. – ఆ జంతువులను వాళ్లు మచ్చిక చేసింది కూడా అంత వరకే. తమ పూర్వీకుల పవిత్ర స్థలాలంటూ వాళ్లకేమీ వుండవు. బక్తియార్ ఎక్కడపుట్టాడు? జేకబ్‌ను ఎక్కడ సమాధి చేశారని అడిగితే వాళ్లు చెప్పలేరు.

ఈ దుర్గమ, అగమ్య ప్రస్థానంలో ఎవరెంత దూరం ప్రయాణిస్తారో ఎవరికీ తెలియదు. ముందుక్కదల్లేని వృద్ధులు ఎ్కడికక్కడ ఆఖరి మజిలీల్లో కన్ను మూస్తారు.

మానవారోహణలో తొలిమెట్టు – సంచారజీవితం మాని, ఒకచోట స్థిరపడి వ్యవసాయం ప్రారంభించటమే. ఇదెలా సాధ్యపడింది? మనిషి కోరుకున్నంత మాత్రాన ఏదీ జరగదు. మంచుయుగం తర్వాత, భూమి మీద వికసించిన అనేక లక్షల జాతుల మొక్కల్లో, పశ్చిమ ఆసియాలో పెరిగిన అడవి గోధుమ రకం ఒకటి. అనేకచోట్ల గోధుమలు దర్శనమిచ్చాయి. అందులో ప్రధానమైనది జెరికోలోని ప్రాచీన ఒయాసిస్ ప్రాంతం.

వ్యవసాయ దశకు ముందునుండీ వుంది జెరికో. అక్కడి వాళ్లు గోధుమ పంటను కోసిన ఆధారాలూ వున్నాయి. అయితే వాళ్లకు 'నాట్లు' వెయ్యటం తెలియదు. కోతలకు రాతిపనిముట్లను వాడినట్టుగా జాన్ గార్‌స్టాంగ్ 1930లలో జరిపిన తవ్వకాలలో తెలిసింది. పదివేల ఏళ్ల క్రితం యిక్కడ నటూఫియన్ వ్యవసాయపూర్వనాగరకత యిక్కడ విలసిల్లిందని నిర్ధారించారు.

ఆనాటి వ్యవసాయంలో వచ్చిన మార్పులకు ముఖ్యకారణం కండెనిండా గింజలున్న రెండు గోధుమరకాలు.

క్రీ.పూ. 8000 ఏళ్లకుముందు గోధుమకండెల్లో యిన్ని గింజలుండేవికాని, అప్పుడు గోధుమమొక్కకూ, ఇతర గడ్డిమొక్కలకూ పెద్ద తేడాకూడా లేదు. యాదృచ్ఛికంగా జరిగిన ఒక జన్యుసంయోగంవల్ల, అడవి గోధుమలు, 'మేకగడ్డి'తో 'క్రాస్' అయి కొత్త గోధుమ వంగడం పెరిగింది (14 క్రోమోజోమ్‌ల అడవి గోధుమ, 14 క్రోమోజోమ్‌ల మేకగడ్డి సంయోగ ఫలితంగా, ఎమ్మెర్ రకం 28 క్రోమోజోమ్‌ల గోధుమ పెరిగింది). తరువాత యిది సహజంగా, విస్తృతంగా పెరిగింది.

ఆ తర్వాతి మరో జన్యుచిత్రం – 42 క్రోమోజోమ్‌ల 'బ్రెడ్ గోధుమ' మొక్క మరో జన్యుసంయోగం తర్వాత మాత్రమే, మనకు తెలిసిన గోధుమలు మొలకలెత్తాయి. ప్రకృతిలో జరిగిన జన్యుసంయోగ చిత్రాలు అనూహ్యం.

మొత్తంమీద, మానవ ప్రయత్నానికి ప్రకృతి సహకరించటం వల్లనే వ్యవసాయం సాధ్యపడింది. ఆనాడు సారవంతమైన పశ్చిమ ఆసియాలోని 'చంద్రవంక' (ప్రాంతం)లో ప్రారంభమైన 'పాత వ్యవసాయం' అనేకసార్లు పునరావిష్కరింపబడి మనదాకా వచ్చింది. మనిషికి గోధుమలతో పాటు మొక్కజొన్న కూడా ముఖ్యమైన ఆహారమే. క్రమంగా ఈ పంట గురించి కూడా తెలుసుకున్నారు జెరికోవాసులు.

ధాన్యాగారంగా మారిన జెరికోను చూసి యిరుగు పొరుగులకు కన్నుకుట్టటం కూడా సహజమే. అందువల్ల జెరికోచుట్టూ కోటగోడలు నిర్మించారు. తవ్వకాలలో బయటపడిన గత నాగరకతా అవశేషాలలో మట్టిపాత్రలు చేయటానికి పూర్వదశ, తరువాతి దశలు కూడా మనకు కనిపిస్తాయి. ఇది జరిగింది ఏడువేల సంవత్సరాల క్రితం. ఆ తర్వాత మనం గుర్తించగలిగినవి, తొలి రాగి, తొలి యిత్తడి, మధ్య యిత్తడి దశలు. ఇదంతా మనకు నలభై అయిదు అడుగులలోతు నేలలో కాక, నలభై అయిదు అడుగుల గత నాగరకత!

చరిత్రకు కేంద్రబిందువు జెరికో. తరువాతి తవ్వకాలలో యితర చోట్ల నాగరకతా అవశేషాలు కనిపించలేదని కాదు. మొదటి దశలో, ప్రకృతిని లొంగదీసుకోవటమే మనిషి సాధించిన ఘనవిజయం అనుకున్నాం. లొంగదీసుకోవటం కాదు, దాన్ని తనకు అనుకూలంగా మలచుకోవటమే నిజమైన విజయమని యిప్పుడు చెప్పవచ్చు.

క్రీ. పూ. 6000 సంవత్సరాల నాడు జెరికో ఒక పెద్ద వ్యావసాయిక కేంద్రం. కాత్లీన్ కెన్యన్ పరిశోధనల ప్రకారం, అక్కడ 3,000 వేల మంది నివసించేవారు. ఎనిమిది నుండి పదెకరాల విస్తీర్ణంలో గోడలు కట్టారు. ఆనాటి స్త్రీలు, పెద్ద రుబ్బు రాళ్ళతో గోధుమలను పిండి చేసేవారు. పురుషులు, యిటుకలు చేశారు – ఆ యిటికల మీద వాళ్ళ వేలిముద్రలు మనం ఈ నాటికీ చూడవచ్చు. మనిషి స్థిరనివాసానికి అలవాటు పడ్డాడు. ఇలా స్థిరనివాసం ఏర్పరుచుకున్నవాళ్లు తమ మృతులను గౌరవించేపద్ధతి కూడా భిన్నంగా వుంటుంది. మనకు లభించిన పుర్రెల మీద అలంకరణలున్నాయి. వాటి అర్థం తెలియదుగాని, అవి తప్పక గౌరవ సూచకమే అయివుండాలి.

భూకంప ప్రభావిత ప్రాంతంలో వుంది జెరికో. తూర్పు ఆఫ్రికాలోని గ్రేట్ రిఫ్ట్ వాలీకి కొనసాగింపుగానే వుంటాయి రెడ్‌సీ, డెడ్‌సీ. భూమి 'లో' పొరలు యిక్కడ వదులుగా వుంటాయి. అందువలన షాక్స్‌వచ్చి భూకంపాలు సంభవిస్తాయి. బైబిల్లో, పలుసార్లు ప్రకృతి విచిత్రాలు, వైపరీత్యాల గురించి ప్రస్తావించటానికిదే కారణం. ఒకసారి వరదలొచ్చాయి, ఒకసారి రెడ్‌సీ, జోర్డాన్‌నది ఎండి పోయాయి, జెరికో కోటగోడలు కూలి పోయాయి.

బైబిల్‌లో మనకు తెలిసేది ఒక వింత చరిత్ర – అందులో కొంత వాస్తవమూ, కొంత జానపద కథల వూహా దాగి వున్నాయి. విజేతలే చరిత్ర రాస్తారు. అంటే, ఇజ్రేలీయులు రాసిన చరిత్ర యిది. బైబిల్ వాళ్ల కథే – సంచార తెగలు, వ్యవసాయిక తెగలుగా స్థిరపడిన వైనం.

వ్యవసాయం, పశుపాలన చాలా సులభమైన వృత్తులనుకుంటాం మనం. కాని నాటూఫియన్ కొడవలిని చూస్తే ఆ అభిప్రాయం మారిపోతుంది. వ్యవసాయంలోనూ.

**భూకంప ప్రభావిత ప్రాంతంలో వుంది జెరికో. తూర్పు ఆఫ్రికాలోని గ్రేట్ రిఫ్ట్ వాలీకి కొనసాగింపుగానే వుంటాయి రెడ్‌సీ, డెడ్‌సీ. భూమి 'లో' పొరలు యిక్కడ వదులుగా వుంటాయి. అందువలన షాక్స్ వచ్చి భూకంపాలు సంభవిస్తాయి. బైబిల్లో, పలుసార్లు ప్రకృతి విచిత్రాలు, వైపరీత్యాల గురించి ప్రస్తావించటానికిదే కారణం. ఒకసారి వరదలొచ్చాయి, ఒకసారి రెడ్‌సీ, జోర్డాన్‌నది ఎండిపోయాయి, జెరికో కోటగోడలు కూలిపోయాయి.**

పశువులను మచ్చిక చేసుకోవటంలోని ప్రతి దశలోనూ అనేక ఆవిష్కరణలు అవసరమయ్యాయి. అంటే ఎంతో కొంత 'సాంకేతికత' అవసరమవుతుంది. అదే శాస్త్రీయమైన సూత్రీకరణలకు దారి తీస్తుంది. గ్రామాల్లో మనకు కనిపించే చిన్న చిన్న పనిముట్ల వెనక ఎంత మేధోశక్తి దాగివుందో! ఇవేవీ న్యూక్లియర్ ఫిజిక్స్‌లోని అత్యాధునిక పరికరాలకు తీసిపోవు.

సూది, కుండ, పలుగు, పార, దారం, మగ్గం, కొలిమి, మేకు, స్క్రూ, గాలి తిత్తులు, గాలం, బొత్తాము, పాదరక్షలు – యిలా వందలాది, ఈనాడు అత్యంత ప్రాథమికంగా కనిపించే వస్తువులన్నీ మానవారోహణాక్రమంలో సోపానాలే! ఒకదానిమీద ఒకటి ఆధారపడిన ఈ ఆవిష్కరణలు, ఒక దాన్నొకటి, ప్రోత్సాహిస్తాయి. సంస్కృతి అంటేనే వివిధ ఆలోచనల సంగమం.

వ్యవసాయంవల్ల గ్రహించిన సాంకేతిక పరిజ్ఞానమే, ఫిజిక్సులాంటి యితర శాస్త్రాలకూ ప్రేరణ. కొడవలి రూపు మార్చుకున్న క్రమమే దీనికి నిదర్శనం. మొదట దళసరిగా వున్న కొడవలి (దీంతో కోస్తే గింజలు రాలిపోతాయి) క్రమంగా, వాడిగా సులభంగా కొయ్యటానికి అనువుగా మారింది. ఈ పరిశీలనా జ్ఞానం, ఈ సాంకేతిక నైపుణ్యం – నిరూపించేదొకటే. ఆలోచనలకు మూలం మనిషే అయినా, ఆ ఆలోచనలే మనిషిని ప్రతిదశలో కొత్తగా ఆవిష్కరించాయి.

వ్యవసాయిక దశలో జరిగిన అత్యంత ముఖ్యమైన ఆవిష్కరణ 'నాగలి.' ఇది కేవలం దున్నటానికే అనుకుంటాం గాని, కిందకి నొక్కి, పైకి లేపటంలో యిది లివర్‌గా పనిచేస్తుందని కూడా తెలుసుకున్నాడు మనిషి. కేవలం దున్నటంకన్న ముఖ్యమైన జ్ఞానం యిది. ప్రముఖ శాస్త్రవేత్త ఆర్కిమెడిస్ తన 'థియరి ఆఫ్ లివర్' ను గ్రీకులకు వివరిస్తూ, సరైన లివర్ దొరికితే భూమిని కూడా ఎత్తవచ్చునన్నాడు. కాని, అంతకు వేల సంవత్సరాల క్రితమే, పశ్చిమ దేశాలలోని ఆదిమ కృషీవలుడు, "నాకు లివర్ యివ్వు. నేను భూమి ఆకలి తీరుస్తా" అంటూ భగవంతుణ్ణి ప్రార్థించాడు.

నాగరకతా పరిణామంలో వ్యవసాయం అనేకసార్లు ఆవిష్కరింపబడిందన్నాన్నేను. కాని, నాగలి, చక్రం మాత్రం అలాగే వున్నాయి. ఎందుకంటే, వీటికి పశువులవసరం కూడా వుంటుంది. పశ్చిమ ఆసియాలో పశువులను మచ్చిక చెయ్యటం, వ్యవసాయం తరువాతి ముఖ్యమైన దశ.

మనకు, తొలి చక్రం క్రీ.పూ. 3000 సంవత్సరాలనాడు దక్షిణ రష్యాలో లభించింది. అవి చెక్కతో చేసిన చక్రాలు. ఇరుసు సాయంతో బళ్లను లాగటానికి వుద్దేశించినవి. ఈ ఇరుసు – చక్రం కలయిక మరో పెద్ద మలుపు. ఇది కేవలం బళ్లులాగటానికే కాదు, గోధుమలను పిండాడించటానిక్కూడా పనికొచ్చింది. మొదట, జంతువుల శ్రమతో, తరువాత, నీరు, గాలి శక్తుల సాయంతో చక్రం తిరిగింది. భ్రమణానికి సంకేతం చక్రం. శాస్త్ర, కళారంగాలలో మానవాతీతశక్తిని చక్రంగా చిత్రిస్తారు. సూర్యుడి రథానికి చక్రాలుంటాయి. ఆకాశమే వలయాకారంలో వుంటుంది. బాబిలోనియన్లు, గ్రీకులు, నక్షత్రభ్రమణాన్ని యిలాగే వూహించారు. ఆధునిక శాస్త్రజ్ఞులకు, చలనం (సహజమైన కదలిక) సరళరేఖలో వుంటుందని తెలుసు. కాని గ్రీకులకు 'చలనం' వృత్తాకారంలో వుంటుందన్నదే సహజంగా తోచింది.

*4వ భాగం వచ్చే సంచికలో*

# బెజవాడ

బెజవాడను విజయవాడ అనటం తెలిసిందే. అయితే ఆ పేరు మున్సిపాలిటీ ఉత్తర్వుల ప్రకారం అయిందని కొందరి భావన. అది సరికాదు. 9వ శతాబ్దం నాటికే బెజవాడకు ఆ పేరుంది. ఇంతకూ బెజవాడలోని బెజ్జ అనేది ఒకరకం గడ్డి పేరు. అంతే తప్ప కృష్ణానది రెండుకొండల మధ్య బెజ్జం చేసుకుని ప్రవహించటం వలనకాని, దిబ్బలువలన గాని రాలేదు. శాసనాల్లో పెచ్చవాడగా కూడా వ్రాయబడింది. ఆ పదాలలోని 'ప' కారాన్ని, 'చ' కారాన్ని 'బ' కారంగా, 'జ' కారంగా చదవాలి. అలా చదవాలనే సంగతి శాసన పరిశోధకులకు తెలిసిందే. బెజ్జ ఒక రకం గడ్డి అని చెప్పటానికి మూలం బెజ్జంకి అనే గ్రామం శ్రీకాకుళం జిల్లాలో వుంది. ఒక శాసనంలో బెజవాడను వీరరాజేంద్రచోళ నగరంగా ప్రస్తావించబడింది.

**- యార్లగడ్డ బాలగంగాధర రావు**

# ఎక్కడ గొట్టో అక్కడ నట్టు

- లగడపాటి సంగయ్య

'ఎక్కడ గొట్టో అక్కడనట్టు' అన్నట్లుగా తెలుగు అధ్యాపకులం విద్యార్థులకు పాఠం చెప్పేటప్పుడు కఠినమైన పదాలు వస్తే వాటి అర్థాలను తెలుసుకోడానికి నిఘంటువును ఆశ్రయిస్తాం. నిఘంటువులో కొన్ని పదాలకు అర్థాలు దొరకవు. తెలిసిన పెద్దల నడుగుతాం. వారి నుండి సరైన, సంతృప్తికరమైన, సమంజసమైన అర్థం లభించనప్పుడు వ్యాఖ్యానాలుంటే చూస్తాం. వాటిలో కూడా మనకు ఎక్కడ గొట్టో అక్కడనట్టన్నట్లుగా ఉంటాయి. ఏవో పొసగని పొంతనలేని అర్థాలుంటాయి. ఫ్! లాభం లేదని మూతి విరిచి, విద్యార్థులకు పాఠాన్ని బోధించేటప్పుడు ఆగొట్టుగా ఉన్నచోట తెలివిగా దాన్ని ఎగురగొట్టి, కప్పదాటు వేసి అసమర్థంగా చెప్పుకుంటూ వెళ్తాం. అధ్యాపకులుగా అందరూ ఏమో తెలియదుగాని, కొందరం అన్నా ఆ కొందరికీ కోపం రావచ్చుగనుక ఎవరినీ తప్పు పట్టకుండా నన్ను నేనే తప్పు పట్టుకుంటూ నేను పాతికేళ్ల విద్యాబోధనలో చేసిన పని, చేస్తున్నది ఇదేనని ఒప్పుకుంటున్నాను. నా అజ్ఞానాన్ని అందరూ మన్నింతురుగాక! అయితే అలాంటి జటిలమైన పదాల ముడివిప్పేవరకు నా మనస్సును అవి పురుగుల్లా తొలుస్తూ ఉంటాయి. కాలక్రమంలో ఎప్పుడో ఒకప్పుడు వాటి అర్థాలు స్ఫుర్తిస్తూ ఉంటాయి. వాటిని నలుగురితో చర్చించిన మీదట వాటిని అందరి ముందుంచే ప్రయత్నమే ఈ వ్యాసం. చాలామందిని, రెండు, మూడు విశ్వవిద్యాలయాల్లో పనిచేసిన విశ్రాంతాచార్యులను, అనుభవజ్ఞులైన అధ్యాపకులను సంప్రదించినా తగిన సమాధానం దొరక్క తపనపడ్డాను. కావ్యాల్లో అక్కడక్కడా నాకు తారసపడ్డ నాలుగైదు పదాల గురించి (ఇంకా ఇలాంటివి చాలానే ఉన్నాయి).

**1. తీఱములు :** భారతంలో ఆదిపర్వం, చతుర్థాశ్వాసం, శకుంతలోపాఖ్యానంలోనిదీ పదం. శకుంతల దుష్యంతునితో – భర్తకు భార్యవలన ఒనగూరే వాటిని గురించి చెపుతున్న సందర్భంలోనిది. "ధర్మార్థ సాధనకుపకరణంబు, గృహనీతి విద్యకు గృహము," అనే సీసపద్యానికి క్రింద ఉన్న ఆటవెలది పద్యంలో "ఎట్టి ఘట్టములను, నెట్టియాపదలను, నెట్టి తీఱములను ముట్టబడిన వంతలెల్లఁబాయు నింతుల, బ్రజలను నొనరజూడఁగనిన జనులకెందు" అని అంటుంది. ఈ పాదాల్లో పట్టుకొన్నది 'ఎట్టి తీఱములను ముట్టబడిన వంతలెల్ల' అన్నది. దీనికి 'తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఇటీవల ముద్రించిన భారతంలో దివాకర్ల వారు, జి.వి. సుబ్రహ్మణ్యంగార్ల వ్యాఖ్యానంలో ఉన్నదీ ఇప్పటివరకూ అనూచానంగా చెపుతున్న అర్థం–ఎలాంటి సముద్ర తీరాలనయినా, ముట్టబడిన అంటే తాకిన, వంతలు అంటే కష్టాలు; పాయు అంటే తొలగిపోతాయని, సందేహమేమిటంటే సముద్ర తీరాలను ముట్టబడిన కష్టాలేంటి? సముద్రతీరాలను ముట్టడం ఏమిటి? దీన్ని సమర్థించడానికి అధ్యాహారంగా సంసారం సాగరం లాంటిదని సాగరంలో ఆటుపోట్లు తీరానికి తగిలి పోయినట్లుగా సంసారంలో వచ్చే కష్టాలు తొలగి పోతాయని దూరాన్వయం చేసి ఎక్కడా సముద్రమనే అర్థమిచ్చే పదం లేకపోయినా 'తీరం' ఉందని సముద్రాన్ని మధ్యలోకి తెచ్చి పెట్టి చెప్తున్నాం. 'తీఱము'లో బండి 'ఱ' ఎందుకు కవి ఉపయోగించాడు? దీని అర్థమేమిటని ఇంత కాలం తర్వాత ఆలోచన చేసి మథిస్తే తట్టినట్టిది. నిఘంటువును ఆధారం చేసుకుంటే వచ్చినట్టి అర్థమేమిటంటే – 'తీఱముల'ను అనే పదానికి ముందున్న ఎట్టి ఘట్టములను, ఎట్టి యాపదలను' అనే వాటి వరసను గమనంలోకి తీసుకోవాలి. అప్పుడు "తీఱములను' అనేదానికి సూర్యరాయాంధ్ర నిఘంటువులోని అర్థం ప్రకారం – తీఱు = పూర్తియగు (పని పూర్తికావటం) దీనికి వ్యతిరేక పదం – 'తీఱమి.' 'తీఱమి' అని కవి

డా. లగడపాటి సంగయ్య, ఫోన్ : 9490769242

ప్రయోగాలు భారతంలో చాలా చోట్ల ఉన్నాయి. తీఱమి అంటే కాని పని. దీనికి బహువచనం తీఱములు – అంటే కాని పనులు, అసాధ్యమైన పనులు, దుస్సాధ్యమైన పనులు అని. అవి కూడా అవుతాయని అర్థం. ముట్టబడిన అనే క్రియను 'వంతలెల్ల' అనే దానికి అన్వయించుకుంటే చుట్టుకొన్న లేదా చుట్టుముట్టిన బాధలన్నీ; పాయున్ తొలగిపోతాయని చక్కని సమంజసమైన, సముచితమైన అర్థం వస్తుంది. తి.తి.దే. వారి ప్రతిలో ఎట్టి తీఱములను అని శకటరేఫతో ఉన్నప్పటికీ అర్థం మాత్రం సముద్రపు ఒడ్డు అనే ఉన్నది. శకటరేఫను సాధురేఫగా తలంచటంవల్ల సరిగా అన్వయం పొసగని 'సముద్రం' మధ్యలో వచ్చిపడింది. శకటరేఫ, సాధురేఫల ప్రయోగాల్లోని అర్థతారతమ్యం విజ్ఞులెఱిగినదే. ఎట్టి ఘట్టాలలోగాని, ఎట్టి ఆపదలలోగాని, ఎటువంటి కానిపనులుగాని, చుట్టుముట్టిన ఎలాంటి బాధలు కాని భార్యవలన తొలగిపోతాయని పిండితార్థం.

**2. కొల్లి :** శ్రీనాథుని కావ్య భీమేశ్వర పురాణంలో గుణనిధి కథలో – గుణనిధి చెడిపోవటానికి కారణం తల్లియేనని చెపుతున్న సందర్భంలో కవి – 'తల్లి బడి కొల్లి చట్టంచు' అని ప్రయోగించాడు. కాశీఖండం 4వ ఆశ్వాసంలో 96వ పద్యంగా కూడా ఇది ఉంది. సంస్కృతమూలం 13వ ఆశ్వాసంలో 62వ శ్లోకంలో ఉంది. చట్టు + అంచు (అనుచు) అంటే శిష్యుడని అనుచు. తల్లి బడిలోని శిష్యుడు – తల్లి చెప్పినట్లుగానే తయారవుతాడు కాని వేరే విధంగా ఎట్లా తయారవుతాడు? తల్లి తొలిగురువు కదా! ఆమె బడిలో తయారయ్యాడీ శిష్యుడు గుణనిధి. ఈ అర్థాన్ని చెపుతున్నాం బాగానే ఉంది కానీ మధ్యలో 'కొల్లి' అనేది ఎందుకు వచ్చి పడింది? ఇది 'కొల్లి' యా లేక తల్లి బడికి + ఒల్లి అనా? ఇలా విడదీసి చెప్పితే 'తల్లి బడికి అంగీకరించి శిష్యుడనుచు' అని అర్థం వస్తుంది. కాని, అంగీకరించి '(న)' శిష్యుడనుచు అని రాదు. 'న' అనేది లేకుండా అంగీకరించి శిష్యుడనుచు అని చెప్పవలసి వస్తుంది. అర్థం సంతృప్తికరంగా చెప్పటం సాధ్యపడటం లేదు. చాలా మంది నడిగాను. 'ఒల్లి' అన్నపదమసలు నిఘంటువుల్లో లేదు.

రైతన్న జీవితాన్ని స్నేహభావంతో (ఇంపుగా) వర్ణించటానికి పూనుకుంటే సెలయేటి ప్రవాహ వేగంతో మాధుర్యాన్ని సంతరించుకొన్న వాగ్జలం ప్రవహిస్తుందని చెప్పకొని యితరులు – భగ్నాశులై, యీర్ష్యతో అనే చోట్ల భగ్నాశులై అంటే భగ్నమైన ఆశగలవారై అనే అర్థం చెప్పటం పరిపాటిగా వస్తుంది. గైడులోను అలానే వ్రాశారు. కాని కవి ఈ అర్థంలో వాడాడా? అన్నది ఆలోచించదగ్గ విషయం.

'ఒల్లి' కాదు 'కొల్లి' అనే ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావుగారు నిర్ధారించారు. కాని అర్థం మాత్రం ప్రశ్నార్థకంగానే ఆయనకూ మిగిలింది. 'కొల్లి' అంటే నిఘంటువులో 'చెట్టు' అనే అర్థం ఒకటుంది. చెట్టు అనే అర్థం ఎలా పొసగతుందని ఆలోచిస్తుంటే ఆశ్రమవాస విద్యా సంప్రదాయం గుర్తుకు వచ్చింది. ఒకనాడు గురువులు చెట్లకిందనే కదా శిష్యులకు విద్యను బోధించింది. అప్పుడు తోచిన అర్థమేమిటంటే – పద్యంలో ఉన్న 'తల్లిబడి కొల్లి' అనేదాన్ని రూపకంగా చెప్పుకుంటే తల్లిబడి అనెడి చెట్టునీడలోని శిష్యుడనుచు అని. ఇక్కడ 'కొల్లి' అనే పదం మనపాతకాలపు విద్యార్జనా సంప్రదాయాన్ని తెలియజేస్తుంది. ఇలా చెప్పితే విద్యార్థులకు సంప్రదాయమూ తెలుస్తుంది. నట్లు, గొట్లు దూరాన్వయాలు ఎగిరిపోతాయని నా ఆలోచన. ఇంకా బాగుండే అర్థం ఎవరైనా చెప్పితే తెలుసుకుంటాను.

**3. భగ్నాశులు :** దువ్వూరి రామిరెడ్డిగారి 'కృషీవలుడు'లో "అన్నాహాలిక నీదు జీవితము నెయ్యంబార వర్ణింప మేకొన్నన్నిర్ఝర సారవేగమున వాక్పూరంబు మాధుర్య సంపన్నంబై ప్రవహించుగాని, యితరుల్ 'భగ్నాశులై' యీర్ష్యతో 'నన్నుంగర్షక పక్షపాతియని నిందా వాక్యముల్వల్కరే' అనే పద్యంలోని భావం – రైతన్న జీవితాన్ని స్నేహ భావంతో (ఇంపుగా) వర్ణించటానికి పూనుకుంటే సెలయేటి ప్రవాహ వేగంతో మాధుర్యాన్ని సంతరించుకొన్న వాగ్జలం ప్రవహిస్తుందని చెప్పుకొని యితరులు–భగ్నాశులై, యీర్ష్యతో అనే చోట్ల భగ్నాశులై అంటే భగ్నమైన ఆశగలవారై అనే అర్థం చెప్పటం పరిపాటిగా వస్తుంది. గైడులోను అలానే వ్రాశారు. కాని కవి ఈ అర్థంలో వాడాడా? అన్నది ఆలోచించదగ్గ విషయం. భగ్నమైన ఆశగలవారై అనే అర్థంలోనే కవి వాడినట్లయితే 'భగ్నాశతో' అని వ్రాసి ఉండవచ్చును గదా – భగ్నాశతో, ఈర్ష్యతో అన్నా గణభంగం జరగదు. పద్యపు నడకకూడా ఆరోహణాక్రమంలో బాగుంటుంది. అంతేకాకుండా–ఆశకలిగిన వారిని ఆశులు, పేరాశులు, దురాశులు, నిరాశులు, భగ్నాశులు అనటం వ్యవహారంలో ఎక్కడైనా ఉందా? ఎప్పుడైనా అలా అన్నామా?

విన్నామా? లేదే. పోనీ పూర్వకవి ప్రయోగాలన్నా ఉన్నాయా? అంటే అలాంటివి కన్పించవు. సంప్రదాయాన్ని ఛందస్సులో, పదప్రయోగంలో పాటించిన కవికోకిల దువ్వూరి రామిరెడ్డి సరిక్రొత్త ప్రయోగం చేశాడేమో?నని అనటం సాహస మవుతుంది. మఱి భగ్నాశులై అనేపదంలోని కవి ఉద్దేశం ఏమిటి? అంటే ఆశువు = వేగము కలది; ఆశుకవి వేగముగా కవిత్వము చెప్పువాడు, అని సూర్యరాయాంధ్ర నిఘంటువు – అర్థాలు. భగ్నాశులై = వేగముగా కవిత్వమును కర్షకుని గూర్చి చెప్పలేక – యీర్ష్య వహించిన ఇతరులని అర్థం చక్కగా కుదురుతుందని నా అభిప్రాయం. భగ్నమైన ఆశుకలవారై అంటే వేగంగా చెప్పలేక పోవటం. రామిరెడ్డిగారు రైతుగురించి అనగానే వేగంగా (ప్రవాహ వేగంగా) కవిత్వాన్ని చెప్పగలగటం ఇతరుల యీర్ష్యకు కారణమైంది. ఆశువుకదా ఆశు ఎలా అయిందనే అనుమానానికి తావులేదు. 'ఆశుకవి' అనే ప్రయోగం నిఘంటువులో ఉంది. ఆశుకవి, ఆశుకవిత అని వాడకంలోను, అవధానాల్లోనూ ప్రచురంగా ఉంది. కనుక భగ్నాశులై సమాసం ఆశుకవిలాంటి సమాసం. ఈ అర్థమే సముచితంగా, సమంజసంగా ఉంటుందని బహుశా కవి ఉద్దేశం కూడా అదే అయి ఉంటుందని నా ఆలోచన. భగ్నమైన ఆశకలవారు కాదని అనుకుంటున్నాను. రామిరెడ్డిగారి లాగా కర్షక కవిత్వాన్ని చెప్పాలనుకోవటం ఆశగా ఇతరులు పెట్టుకొన్నారనుకోను. 'ఆశ' అనేది పెద్ద అర్థాన్నిచ్చేది. దాన్ని ఇంతకంటె భిన్నమైన సందర్భాలలో వాడుతూ ఉంటాం. ఆయన లాగా వ్రాయాలని అనుకోవటం వరకే జరుగుతుంది కాని అది ఆశ అవుతుందా? అనుకోవటం, కోరుకోవటం, ఆశపడటం క్రమవృద్ధిని సూచించే పదాలు. ఒకవేళ ఆశయే అనుకుంటే భగ్నాశతో అని వ్రాసి ఉండేవాడు భగ్నాశులై, ఈసులై అని మఱొక రకంగా వ్రాసే అవకాశం కూడా ఉంది. అలా వ్రాయలేదు. భగ్నాశతో, ఈర్ష్యతో అనవచ్చు. అలా అనలేదు. కనుక భగ్నాశులై = వేగంగా చెప్పటంలో భంగపడినవారై అనే అర్థమే సరైనదని భావిస్తూ ఉన్నాను. అప్పుడే పై పాదాల్లో ఉన్న నిర్ఝర సార వేగమున వాక్పూరంబు' అన్నదానికి సమన్వయముంటుంది. సార్థకమవుతుంది. విజ్ఞులు ఆలోచించవలసినదిగా కోరుచున్నాను.

**4. పామిడి :** ప్రసిద్ధమైన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు, వారి కీర్తనల్లో ఒకటైన "బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానె యీ పాదము' అనే కీర్తనలో చివరి పాదం 'తురగపు పామిడి పాదము' అని ఉంది. ఈ 'పామిడి' ఏమిటని అడిగితే పామిడి ఊరన్నారు. విజృంభించు అన్నారు. ఏవేవో చెప్పారు. తెలియదన్నవారూ ఉన్నారు. తలా ఒకరకం అర్థం చెప్పారు. కానీ సంతృప్తిగా లేదు. సమంజసంగా లేదు. చాలా మందికి దీని అర్థం తెలియదు. ఎవరన్నా తెలిసిన వారున్నారేమో. తెలియనివారు తెలుసుకుంటారనే ఉద్దేశంతో వ్రాస్తున్నాను తప్ప మఱొకటి కాదు. ఈకీర్తనను మొత్తం చదివి గమనించినట్లయితే విష్ణుమూర్తి దశావతారాలను వర్ణించినట్లు అర్థమవుతుంది. రానున్న కల్కి అవతారంలో విష్ణుమూర్తి కల్కి రూపంలో గుఱ్ఱంపై వస్తాడని అందరికీ తెలిసిన విషయమే. గుఱ్ఱం మీద కూర్చున్న కల్కి పాదం ఉంచే రికాబును (కాలుపెట్టేరింగు లాంటిది) పామిడి (బహుశా పాదమిడుట కున్నది) అంటారు. తురగపు రికాబులో పాదము విష్ణుమూర్తిది. పామిడి నిఘంటువుల కెక్కనిపదం. వేటూరి ఆనందమూర్తిగారి పరిశోధన గ్రంథం 'తాళ్లపాక కవుల పద కవితలు, భాషా ప్రయోగ విశేషాలు'లో పామిడి గురించి ఏమీచెప్పలేదు. అలాగే రామలక్ష్మీ, ఆరుద్రల సంపాదకత్వంలో వెలువడిన 'తాళ్లపాకవారి పలుకుబళ్లు' అన్న గ్రంథంలోనూ దీని గురించి లేదు.

**5. పెరుగుఁదోట కూర :** కవి కోకిల గుఱ్ఱం జాషువగారి ఫిరదౌసిలోని – 'కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు / కృతిని జెందువాడు మృతుడుగాడు / పెరుగుఁదోట కూర విఖ్యాత పురుషులు / కవిని వ్యర్థ జీవిగాదలంత్రు' – అనే పద్యంలోని మూడవ పాదం యొక్క అర్థం చప్పున బోధపడేదికాదు. పెరుగుఁదోట కూర విఖ్యాత పురుషులేంటి? అనే సందేహం కలుగకమానదు. స్వల్పప్రయత్నంతో అర్థం స్పష్టంకాదు. చాలామందికి ఈ పెరుగుఁదోటకూర' అరుగుడు పడలేదు. దీని అర్థమేమిటో 'విన్నంత కన్నంత తెలియవచ్చినంత తేట పరుతు'ను. ముందుగా 'విఖ్యాత పురుషులు సమాసంలోని విఖ్యాత అన్న విశేషణాన్ని కవి వ్యంగ్యార్థంలో వాడాడని గమనించాలి. తరువాత 'పెరుగుఁదోటకూర' విషయానికి వస్తే అది నుడికారంగా, జాతీయంగా ఉపయోగించబడింది. మిత్రులు బీరం సుందరరావుగారు, జాషువాగారికి సన్నిహితులు, పెద్దలైన బొద్దులూరి నారాయణరావుగారు వివరించిన దాని ప్రకారం పల్నాడు ప్రాంతంలో ఉప్పు గొందూరులో ఉప్పెంత ఉందో, నేతిబీరలో నెయ్యి ఎంత ఉందో పెరుగుఁదోటకూరలో పెరుగు అంతే ఉందని

వాడకంలో ఉంది. అంటే పెరుగుఁ దోటకూరలో పెరుగు ఎలా లేదో విఖ్యాత పురుషుల్లో కూడా 'విఖ్యాతి' అంతే లేదని అర్థం వస్తుంది. విఖ్యాతిలేని పురుషులు కవిని వ్యర్థజీవిగా తలుస్తారని అర్థం వస్తుంది. నిఘంటువులను ఆధారం చేసుకొని నేను చేసిన ఆలోచన ప్రకారం – శబ్ద రత్నాకరంలో – పెరుగుఁదోట కూరంటే పెరుగాకు, శాకిని, పెరుగు సముద్రము అని అర్థాలున్నాయి. ఇందులో పెరుగాకు ఒక్కటే సంబంధించిన అర్థం. సూ.రా.ని. 4వ సంవత్సరంలో పెరుఁగుదోటకూర అంటే పెఱుమ్ తోఁటకూర అని, (పెరుగు+తోటకూర – పెరుగువలె మృదువైన తోఁటకూర) అని, మహాబాష్ప శాకమని అర్థాలున్నాయి. సీ॥ 'పెఱుకు తోటకూర, పెరుగు తోఁటకూర యనగఁ జను మహాబాష్ప సంజ్ఞ' అని ఆంధ్రభాషార్ణవం (2–73)లోని పద్యం ఉటంకించబడింది. పెఱుకు అంటే పీకబడేదని, పెరుగు వంటిదని అర్థాలువస్తున్నాయి. ఈ అర్థాలు సమ్యగవగాహనకు తోడ్పడేవి కావు. కాని సూ.రా.ని. 3వ సంవత్సరంలో తోఁటకూర పదానికి (తోఁట+కూర) ఒక్కొక్క మొక్కగా కాక తోఁటవలె పెక్కు మొక్కలవలె పెరిగెడు శాకము, ఒక జాతి కూర మొక్క, మారిషమనే అర్థాలతోపాటు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని శకుంతలా పరిణయం (4–48) నుంచి ఒక ప్రయోగానిచ్చారు. అది ఇది – 'బాలయోర్చునె శాపవహ్నికిఁ బట్టునన్న దలించినం జాలదేకట తోఁటకూరకుఁ జంద్ర హాసము దెత్తురే' అని. ఈ ప్రయోగంలో తోటఁకూర నుడికారంగా ఉపయోగించబడింది. తోఁటకూరను తెంచటానికి చంద్రహాసం (పెద్దకత్తి) అవసరమా? అని. గోటితో గిల్లితే తెగేది, పీకితే తేలిగ్గా ఊడి వచ్చేది, అల్పమైనది తోఁటకూర. చిన్నమొక్క. పెద్దచెట్టుకాదు. దీన్నిబట్టి తోటకూరలా అల్పమైన విఖ్యాతి (వ్యంగ్యం) గన్న పురుషులు కవిని వ్యర్థ జీవిగా తలుస్తారని అర్థం వస్తుంది. మిత్రులు చెప్పినదాని ప్రకారం 'ఏమీ విఖ్యాతిలేని' అని అర్థం వస్తుంది. నేను చెప్పిన దాని ప్రకారం 'అల్పమైన విఖ్యాత' పురుషులు – కొద్దిపాటి పేరుగల అల్పజ్ఞులు అని అర్థంవస్తుంది. సముచితంగా ఉన్న దానిని సహృదయులు గ్రహిస్తారని విన్న వించుకున్నాను.

**(గమనిక : శీర్షిక అర్థం గొట్టు = కఠినం, నట్టు = ఆటంకం).**




మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి

**బహుమతి**

పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹200** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 3. | VEMANA - Through Western Eyes - *V.R. Narla* | 50.00 |
| 4. | THE FIRST POETICAL READER (Walter Joyes and N.C. Sashacharloo) | 50.00 |
| 5. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 6. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 7. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 8. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 9. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 10. | నాలో నేను (కవితలు) " " | 60.00 |

**మీ చందా మిసిమి పేర ఈ క్రింది చిరునామాకు పంపండి**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com

ప్రాంతీయత సార్వజనీనతల సమ్మేళనం

# బషీర్ కథలు

- కిన్నెర శ్రీదేవి

ప్రతి భాషలోనూ మాస్టర్ రైటర్స్ అనదగిన వాళ్ళుంటారు. వాళ్ళు తమ రచనాశక్తితో ఆయా భాషా సాహిత్యాల పురోభివృద్ధికి కారణమవుతారు. మళయాళ సాహిత్యంలో వైకం మహమ్మద్ బషీర్ అటువంటి మాస్టర్ రైటర్. బషీర్ తన రచనలతో మళయాళీ సాహిత్య ప్రపంచాన్నే కాక మిగతా భారతీయ భాషా సాహిత్యాలను కూడా ప్రభావితం చేయగలిగారు. నిజానికి ఏ భాషా సాహిత్యంలో నయినా బషీర్ లాంటి వాళ్ళు అరుదుగా కనిపిస్తారు. ఎందుకంటే, వీళ్ళు స్థలకాలాలకు వాటిపరిమితులకు పరిమితమై అలోచించకుండా భావుకతతో వాటిని దాటి సృజనాత్మకంగా రాయగలుగుతారు. వాళ్ళ రచనల సారానికి (ఎస్సెన్స్) వారి అస్థిత్వ సారానికి మధ్య ఎటువంటి వ్యత్యాసం వుండదు. దాని ఫలితంగా వాళ్ళ రచనలు ప్రత్యేకంగా వుండటమే కాకుండా నిర్దిష్టంగా కూడా వుంటాయి.

బషీర్ కాల్పనిక సాహిత్యంలో అన్ని రూపాలలోనూ రచన చేసినప్పటికీ, ప్రముఖంగా సాహిత్యలోకం ఆయనకు కథా రచయితగానే గుర్తించింది. బషీర్ కథలు మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావాన్ని రెండవ ప్రపంచ యుద్ధానికి దారి తీసిన పరిస్థితులను వాటి నేపధ్యంలో ప్రదర్శిస్తాయి. అదే సందర్భంలో ఆ రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో ప్రజలు ఎదుర్కొన్న సంక్షోభాలు, కష్టాలు ఆయన కథల్లో ప్రతిఫలిస్తాయి. ఆ కాల సామాజిక సందర్భాలను అన్నిరూపాలలో ఆయన కథలు చిత్రిస్తాయి. ఆ రకంగా, ఆయన కథలు మానవ సంకట స్థితిని దాని సూక్ష్మరూపాలలోకివెళ్ళి కూడా ప్రతిఫలింప జేయటం జరుగుతుంది. ఒక మేధావి అయిన కథా రచయితగా ఆయన సామాజిక సన్నివేశాలలో వుండే కఠోర వాస్తవాలను వాటి సున్నితమైన, కఠోరమైన రూపాలను పట్టుకొని కథలలో చిత్రిస్తారు. ఆయన కథలు ఆ రచయిత భావనా ప్రపంచాన్ని ప్రాపంచిక దృక్పథాన్ని చాలా స్పష్టంగా ఎటువంటి జంకు లేకుండా ప్రదర్శిస్తాయి. ఆయన ఒక వ్యక్తిగా తన రోజు వారీ జీవితంలో పరిశీలించిన ప్రజలనే పాత్రలుగా మలచుకుంటారు. నిజానికి, ఆయన సృష్టించిన పాత్రలన్నీ ఆయనతో పరిచయ మున్న వాళ్ళను నమూనాలుగా స్వీకరించి సృష్టించినవి.

బషీర్ ఒకానొక అరుదైన తాత్విక దృక్కోణంలోంచి తన అనుభవాలను పరిశీలించి వాటికి కథారూపం ఇచ్చారు. వైయక్తికమైన అంశాలను చారిత్రకమైనవిగా తాత్కాలికమైన విషయాలను శాశ్వతమైనవిగా చూస్తూ అల్ప విషయాలను కూడా ఉదాత్తమైన అంశాలుగా ఆయన చూడగలిగాడు. ఆ దృష్టే ఆయన కథల్లో నిరంతరం వెన్నంటి వుంది. బషీర్ సాధారణమైన ఎటువంటి విద్యలేని కేరళలోని పేద ముస్లిం కుటుంబాలలోని సంక్షోభాన్ని, ఆధునికతలోకి ప్రవేశించలేక తమ మతసంబంధమైన పునాదులను పెకలించుకోలేక సంక్షోభంలో ఉన్న స్థితిని ఇతనే కథలుగా మలిచారు. ఆ పాత్రల జీవితాలను అనివార్యంగా ఆవరించుకొన్న విషాదాన్ని అవి ఆమోదించి జీవిస్తూ వుండటం కూడా కనిపిస్తుంది. ఆయన పాత్రలు తమ చుట్టూ వున్న వ్యక్తులపట్ల గాఢమైన ప్రేమలో వుంటాయి. ఈ ప్రేమ పశు పక్ష్యాదుల పట్ల కూడా విస్తరించింది.

పాశ్చాత్య ప్రపంచ ప్రజల మీద వారి ఆత్మిక సాంఘిక జీవితాల మీద రెండు ప్రపంచ యుద్ధాలు విపరీతమైన ప్రభావాన్ని చూపించాయి. మొదట ఆ యుద్ధాలు ఆర్థిక స్థితిగతుల్ని ధ్వంసం చేస్తే ఆ తరవాత వాళ్ళమనో ప్రపంచాన్ని విచ్ఛిన్నం చేశాయి. శతాబ్దాలుగా వాళ్ళను నడిపిస్తున్న విలువల పట్ల నమ్మకం పోయింది. వాళ్ళ సామాజిక అంతఃచేతనాన్ని,

డా. కిన్నెర శ్రీదేవి, ఫోన్ : 9441404080

మూర్తిమత్వాన్ని రూపుదిద్దిన సంస్కృతిపట్ల కూడా వారికి విశ్వాసం సన్నగిల్లింది. మనిషి తాను ఒంటరి వాడిననే భావనకు లోనై క్రమంగా జీవితంపట్ల నిస్పృహతో కూడిన వైఖరిని ఏర్పరచుకున్నాడు. అయితే, అటువంటి అసంబద్ధ సందర్భం మనిషిని తన అస్థిత్వాన్ని, దాని అర్థాన్ని గురించి లోతుగా ఆలోచించుకోవటానికి ఆస్కారాన్ని కూడా ఆ సందర్భమే కల్పించింది. ఆ కాలంలో భారతదేశంలో కూడా యుద్ధ పరోక్ష ప్రభావాలవల్ల కూడా అటువంటి వాతావరణమే ఆ తరహా నైరాశ్యమే అలుముకొని వుంది. తమ అస్థిత్వాలను గురించిన సగటు మనిషి చెందిన ఆందోళన అందుగురించిన లోతైన ఆలోచన మొదలైన అంశాలే చాలామంది కాల్పనిక సాహిత్యకారులకి వస్తువులయ్యాయి. బషీర్‌లాంటి వాళ్ళు ఆ కోవకు చెందిన వాళ్ళే. బషీర్ తన సమకాలీన ప్రజల సమస్యలను సంకట స్థితిని, అత్యంత సానుభూతితో అర్థంచేసుకొని వాటికి కథారూపం ఇచ్చారు.

మానవ స్వభావాన్ని మొరటు వర్గీకరణలలోంచి కాకుండా తాత్వికంగా అర్థంచేసుకోగలిగిన ఏ రచయితలోనైనా క్షమాగుణం అనేది అనివార్యంగా వుంటుంది. ఈ క్షమాగుణమే బషీర్ లాంటి వాళ్ళను కథాసాహిత్యం వైపు నడిపించింది. తన చుట్టూవున్న మనుషుల పరిమితుల్ని, అసంపూర్ణత్వాన్ని ఆయన అర్థంచేసుకొని, ఆ అవగాహనలోంచే ఇవాళ వాళ్ళను కథాలోకంలో పాత్రలలాగా ప్రవేశపెట్టి క్షమించారు. సాదాసీదా రచయితలకు ఇటువంటి లక్షణం అసాధ్యం. వాళ్ళు తాము సృష్టించే పాత్రల పరిమితుల్ని అవి చేసే పొరపాట్లను తప్పులను విద్వేషంతో చూసి చిత్రిస్తారు. ఫలితంగా, ఆ పాత్రలు సజీవత్వాన్ని సంతరించుకోకపోగా, ఆ రచన కేవలం జీవితాన్ని వ్యాఖ్యానించేదిగానూ, అసమగ్రంగానూ మిగులుతుంది.

బషీర్ కథలు ప్రధానంగా ముస్లిం కుటుంబాల జీవితాలను వస్తువుగా స్వీకరించినపుడు అవి కేవలం వారికి మాత్రమే పరిమితమై ఉండక మిగతా సామాజిక బృందాలను కూడా కదిలించగలిగాయి. అత్యంత దయనీయమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, మానసిక ప్రపంచంలో అనేక గాయాలకు గురైన ముస్లింలు ఆయన కథాసాహిత్యంలో పాత్రలుగా మనకు పరిచితమౌతారు.

బషీర్ ప్రముఖ రచనలలో ఒకటి "పాత్తుమ్మ మేక." ఆ కథలో ప్రధాన పాత్ర అంతర్ముఖుడైన కథకుడు. అతని భావనా ప్రపంచంలోనే సంచరిస్తూ వుంటాడు. అసలు ఆ పాత్రను



మహమ్మద్ బషీర్

పరిచయం చేయటంలోనే ఈ విషయాన్ని నిర్ధారించటం జరుగుతుంది. అసలు ఈ పాత్రను సాధారణ పద్ధతిలో కాకుండా కథ నడిచే క్రమంలో పరిచయం చేయటం జరిగింది. నిజానికి విశ్లేషించే క్రమంలోనే ప్రధాన పాత్రను కథకుడు రంగం మీదకు తీసుకువస్తాడు. ఆ తరువాత ఆ పాత్ర వివిధ సందర్భాలలో తనను తాను ఆవిష్కరించుకుంటూ ఎదుగుతుంది. కథ ప్రధానంగా కథకుడు దృక్కోణంలో నుంచే నడుస్తుంది. సోమర్‌సెట్ మామ్ లాంటి చేయితిరిగిన కథకులు యదార్థ జీవిత సన్నివేశాల నుంచి పాత్రలను స్వీకరించటం అత్యవసరమని భావించాడు. అప్పుడు మాత్రమే సాహిత్యానికి కొంత విశ్వజనీన లక్షణం ఏర్పడుతుందని కూడా ఆయన భావించారు. బషీర్ రాసిన అనేక కథలలో సరిగ్గా ఈ లక్షణమే కనిపిస్తుంది.

వ్యక్తికి సమాజానికి వున్న సంబంధం గతితార్కికమైనదని కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. వ్యక్తి సమాజంలోనే వికసిస్తాడు. సమాజం ఒక రకంగా వ్యక్తి స్థూలరూపం

సమాజం కూడా వ్యక్తి నుంచే రూపొందుతుంది. ఏ వ్యక్తీ తాను జీవిస్తున్న సంస్కృతీ సంప్రదాయం ప్రభావాల నుంచీ తప్పించుకోలేడు. ఈ సంస్కృతీ సంప్రదాయాల వలనే వ్యక్తులకు కొన్ని సార్వత్రిక లక్షణాలుంటాయి. ఈ సార్వత్రిక లక్షణాల వలన మిగతా సమాజం నుంచి తనను తాను వేరుగా ప్రతిష్టించుకోగలుగుతాడు. సమాజాన్ని మార్చగలిగే వ్యక్తి తనను తాను మార్చుకోగలుగుతాడు. ఈ లక్షణాలన్నిటినీ బషీర్ తన కాల్పనిక సాహిత్యంలో విరుద్ధ స్వభావాలూ ప్రవృత్తులూ వున్న పాత్రల ద్వారా చిత్రించాడు.

స్వాతంత్ర్యం తర్వాత భారతీయ సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులన్నిటినీ సానుకూలంగా చూసే అవకాశం లేదు. వీటిలో కొన్ని సమాజ పురోగమనానికి కాకుండా తిరోగమనం వైపుకి నడిపించేవి కూడా వున్నాయి. ఉదాహరణకు వ్యక్తులకు నైతిక మద్దతు, ప్రోత్సాహం ఇచ్చిన సంస్కరణోద్యమం స్వాతంత్రోద్యమం తర్వాత తిరోగమనం వైపు కదిలింది. సాంస్కృతిక రంగంలో వస్తున్న మార్పులు కూడా ప్రగతికాముకంగా లేవు. స్వాతంత్ర్యానికి ముందే అమలులో వున్న ఫ్యూడల్ సామాజిక వ్యవస్థ స్వతంత్రం వచ్చిన తరువాత కూడా కొనసాగింది. స్వాతంత్ర్యం తర్వాత రూపుదిద్దుకున్న సామాజిక వ్యవస్థ మరింత అమానవీయంగా మిగిలింది. ఆర్థికరంగంలో వచ్చిన తీవ్రమైన మార్పులు వ్యక్తుల జీవితాలలోకి అనేక సమస్యలనూ సంక్లిష్టతలను తీసుకు వచ్చాయి. ధనిక వర్గాల జీవిత ప్రమాణాలలో మార్పులు వచ్చాయి. సామాన్యుల జీవితాలలో మాత్రం ఈ మార్పులు ఉపద్రవంగా పరిణమించాయి. గ్రామీణ పేదలు తమ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవటానికి తీవ్ర సంఘర్షణకు లోనవ్వాల్సి వచ్చింది. వాళ్ళు తమ జీవితాలలో అంతులేని పోటీని ఎదుర్కోవాల్సి వచ్చింది. అంతిమంగా, మనుషుల మధ్య వున్న సామాజిక సంబంధాలు, వ్యాపార సంబంధాలుగా మారిపోయాయి. ఈ దారుణమైన సన్నివేశాలన్నింటినీ బషీర్ కథలు హృదయాన్ని ద్రవింపజేసే స్థాయిలో బషీర్, పై దుర్మార్గమైన సామాజిక సందర్భాన్ని చాలా విశ్లేషణాత్మకంగా ప్రతిబింబించారు. అందులో మనుషుల మధ్య సంబంధాలు కేవలం ఆర్థిక సంబంధాలుగా మారిపోయిన వైనాన్ని అందులో వున్న దారుణాన్ని "పాత్తుమ్మా మేక" బహిర్గతం చేసింది. అందులో తల్లీ కొడుకుల మధ్య జరిగే సంభాషణ ఎప్పుడూ డబ్బు చుట్టూనే తిరుగుతుంటుంది. తన దగ్గరికి ఎప్పుడు వెళ్ళినా డబ్బు అడగడానికే వెళుతుంది. తల్లీ కొడుకుల సంబంధాలలో కూడా డబ్బు కీలకమైన పాత్ర పోషించడంలోని అమానుషాన్ని ఈ రచన ప్రతిబింబిస్తుంది. "నీ జేబులో ఒక్క రూపాయుంటే ఇవ్వు, అయితే ఎవ్వరితోనూ ఈ విషయం చెప్పకు" అంటుంది.

"నిన్నే కదా ఇచ్చింది" అంటాడు కొడుకు.

ఇలా నిరంతరం తల్లి డబ్బు కోసం మాత్రమే రావటం కొడుకులో అసహనానికి కారణమౌతుంది. ఒక ఉద్రేక పూరితమైన సందర్భంలో తల్లితో ఇలా అంటాడు.

"ఇక్కడి నుంచి వెంటనే వెళ్ళిపో లేకపోతే నేనే ఇల్లు వదిలి పోతా"నంటాడు. కుటుంబంలో అందరికీ అతని డబ్బు కావాలి. కొంత మంది అతని డబ్బుకు తామే వారసులని భావిస్తుంటారు. కుటుంబాలలోని వ్యక్తుల మధ్య డబ్బు నిర్వహిస్తున్న, నిర్వహించబోతున్న దారుణమైన పాత్రను చాలా ముందుగానే పసిగట్టి దాన్ని కాల్పనిక సాహిత్యంలో విశ్లేషించగలిగాడు బషీర్.

బషీర్ కథల్లో దారిద్ర్యం దాని ఫలితంగా జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలు, ఆ వైఫల్యాలకుండే పర్యవసానాలు ప్రధాన వస్తువులు. ఒక ప్రత్యేకమైన హాస్యం దాన్ని వెంటాడి వుండే వ్యంగ్యం బషీర్ రచనాశైలితో విడదీయరాని అంశాలు. నిజానికి బషీర్ హాస్యం వెనుక అంతులేని విషాదం వుంది. బషీర్ చాలా సందర్భాలలో హాస్యాన్ని తగినంతగా వాడుకోలేక పోయానని, వాపోయిన సన్నివేశాలు కూడా వున్నట్లుగా తెలుస్తుంది. అదే విధంగా వలస పాలన అమలులో వున్న కాలంలో తను స్వేచ్ఛాపూరితంగా రచన చేయలేక పోయాననీ, అసలు తనకలాంటి అనుకూలమైన వాతావరణం లేదని ఒక ఇంటర్వ్యూలో బషీర్ అభిప్రాయపడినాడు (Indian Literature, Sahitya Acadamy Journal May-June 2008). అదే ఇంటర్వ్యూలో తాను కోపంతో రగిలిపోతూ వుండటం వలన "పాత్తుమ్మా మేక" అనే హాస్యస్ఫోరక రచన చేశారని చెప్పారు. ఆ రచన ఉత్తమ పురుషలో నడుస్తుంది. అందుకే ఆయన చిత్రించిన జీవితం ఆద్యంతం ఆర్థిక సంక్షోభాన్ని గురించే అయినప్పటికీ అందులో ఎక్కడా కూడా ఆర్థిక అంశాల ప్రస్తావన లేనే లేదు. అలాగే యుద్ధాల ప్రసక్తి గానీ, వాటి ప్రభావాల గురించిన చర్చకానీ, అంతెందుకు అసలు స్వతంత్ర ఉద్యమాన్ని గురించి వచ్చిన ప్రసక్తిగానీ కనపడదు. అయితే ఈ అంశాలను పాత్రల అంతఃచేతనను

తరచుగా వర్ణించే క్రమంలో చిత్రించటం జరిగింది. దాదాపు అన్ని పాత్రలు పై ప్రభావాల భారాన్ని మోస్తూ, వాటి గురించి మాట్లాడవలసి వచ్చిన సందర్భాలలో ఎటువంటి సంకోచం లేకుండా విశదపరచటం కూడా కనిపిస్తుంది.

ఉదాహరణకి ఇదే కథలో కథకుడి సోదరుడు అబ్దుల్ ఖాదర్ కూడా అతన్ని డబ్బులు అడుగుతాడు. అయితే అతను విభిన్నమైన కారణాలు చూపిస్తాడు. అతని చెల్లెలు కూడా అతన్నించి డబ్బే ఆశిస్తుంది. వాళ్ళందరి దృష్టిలో అతడు డబ్బులిచ్చే ఒక యంత్రం లేక సాధనం. అతన్ని వాళ్ళెప్పుడూ కూడా తన రక్తసంబంధీకుడుగా చూడరు. వాళ్ళతనితో జరిపే సంభాషణాలన్నీ ఏదోరకంగా డబ్బు చుట్టూనే తిరుగుతుంటాయి. మనుషుల మధ్య సంబంధాలను డబ్బులు నిర్దేశించట మనేది ఇవ్వాళ ఉన్నంత దారుణంగా బషీర్ కాలంలో ఉండి ఉండే ఆస్కారం లేదు. బషీర్ కథలు చదువుతుంటే, అతడు తన కాలాన్ని దాటి ఎంత లోతుగా భవిష్యత్తును పరిశీలించ గలిగాడో తెలుస్తుంది. అసలు బషీర్ కథలన్ని మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి వర్గాలలో డబ్బుపట్ల వుండే ఆకాంక్షను బహిర్గతం చేస్తాయి. చాలా లోతుగా ఎటువంటి సంకోచాలు లేకుండా మానవ కార్యకలాపాలను డబ్బు నిర్వహించే పాత్రను బషీర్ విశ్లేషించి ముఖ్యంగా నిర్దిష్ట సందర్భాలను సృష్టించడం ద్వారా విమర్శకు గురిచేస్తాడు. ఎటువంటి రచయితైనా భవిష్యత్తును స్పష్టంగా చూడగలిగేందుకు అవసరమైన విశ్లేషణా పరికరాలను ఇవ్వగలిగారు. బషీర్‌లో అటువంటి శక్తి గణనీయంగా వుంది. అందువలననే తానున్న సమాజం తీసుకోబోతున్న మార్పులను, ఎదుర్కోబోతున్న పర్యవసానాలను ముందుగానే పసిగట్టి వాటిని కాల్పనిక సాహిత్య రూపంలో వ్యక్తం చేశాడు తద్వారా తానున్న సమాజాన్ని చైతన్యవంతం చేసే కృషికి పూనుకున్నాడు. ఏ రచయితైనా కేవలం సామాజిక వాస్తవికతను ప్రతిబింబించడం ద్వారా గొప్ప రచయిత కాలేదు. అంతకంటే ముఖ్యంగా ఆ రచయిత తానున్న సమాజం ఎదుర్కొనబోతున్న ప్రమాదాలను పసిగట్టి విశ్లేషించ గలిగినపుడే ఆ రచయిత శక్తిసామర్థ్యాలు అవగతమౌతాయి. ఈ విధంగా చూసినపుడు బషీర్ తన కాలం కంటే చాలా ముందున్నాడన్న విషయం స్పష్టమౌతుంది. బషీర్ పై పనిని అత్యంత కళాత్మకంగా చేయగలిగాడు. తాను ప్రదర్శించగలిగిన వస్తురూప సమతౌల్యతవల్లే గొప్ప రచయితగా కీర్తింపబడుతున్నాడు.

"పాత్తుమ్మా మేక" గురించి మాట్లాడుతూ, బషీర్ అందులోని కథ మూఢనమ్మకాలలో జీవిస్తూ వున్న ముస్లిం కుటుంబాలకు సంబంధించిందని అన్నాడు. సమాజంలో కొనసాగుతూ వున్న జాతి, మత, జండర్ సంబంధిత వ్యత్యాసాలను, తరతరాలుగా అవి కొనసాగుతున్న తీరును ప్రశ్నించే పనికి పూనుకున్నాడు. బషీర్ ఎక్కుపెట్టిన ఈ విమర్శ ఒక నిర్దిష్ట మతంపైనేనని, ఆ మతాన్ని విమర్శించేందుకు ఆ కాలంలో ఎవరూ సాహసించలేని సందర్భంలో బషీర్ రచన చేశాడని తెలిసినప్పుడు బషీర్ ప్రతిభ తెలుస్తుంది. "పాత్తుమ్మా మేక"తో పాటు మిగతా కథల్లోని ఏ పాత్ర కూడా పాఠకుల తిరస్కరణకు గురికాదు. పాత్తుమ్మాలోని నిరాశా నిస్పృహలకు ఆమె తండ్రి ఎంతగా కారణమో పాఠకులకు స్పష్టంగానే అవగత మౌతుంది. అయితే, ఆ పాత్ర పట్ల పాఠకులు ఎటువంటి ద్వేషాన్ని పెంచుకోరు. ఎందుకంటే, ఆ తండ్రి పాత్ర ప్రవర్తనకు కారణం అతడున్న స్థితి అలాంటి స్థితిలో ఎవరూ కూడా అలాకాక మరో రకంగా ప్రవర్తించలేరనే విషయాన్ని పాఠకులు అంగీకరించేట్లుగా బషీర్ చిత్రిస్తాడు.

"పాత్తుమ్మా మేక" ప్రారంభంలోనే కథకుడు తాను ప్రపంచమంతా తిరిగి విసిగి పోయిగాని ఇక ఇంటి దగ్గిరే వుండి ప్రశాంత జీవితాన్ని గడపాలనుకుంటాడు. తన ఇంటి చుట్టూ ఆవరించివున్న చెట్లు, పూలతోటల మధ్య తన బంధువులతోనూ, తన ఆత్మీయులతోనూ గడపాలనుకుంటాడు. అయితే తానుండాలనుకున్న ఇల్లు అద్దెకిచ్చేశారని తెలుసుకొని తాను వంచింపబడినాడని తెలుసుకొని బాధపడతాడు. తన స్వప్నం మొత్తం ధ్వంసం అయిందని చింతిస్తాడు. ఈ కథలో బషీర్ తన కాలపు వైయక్తిక, సామాజిక అచేతనాన్ని అద్భుతంగా తన కథల్లో ఆవిష్కరించగలిగాడు.

**"పాత్తుమ్మా మేక" ప్రారంభంలోనే కథకుడు తాను ప్రపంచమంతా తిరిగి విసిగి పోయిగాని ఇక ఇంటి దగ్గిరే వుండి ప్రశాంత జీవితాన్ని గడపాలనుకుంటాడు. తన ఇంటి చుట్టూ ఆవరించివున్న చెట్లు, పూలతోటల మధ్య తన బంధువులతోనూ, తన ఆత్మీయులతోనూ గడపాలనుకుంటాడు. అయితే తానుండాలనుకున్న ఇల్లు అద్దెకిచ్చేశారని తెలుసుకొని తాను వంచింపబడినాడని తెలుసుకొని బాధపడతాడు. తన స్వప్నం మొత్తం ధ్వంసం అయిందని చింతిస్తాడు.**

ఉత్తమ పురుషలో సాగే కథను ఎక్కువ సందర్భాలలో రచయిత యొక్క ప్రాపంచిక ధృక్పధాన్ని వ్యక్తం చేస్తాయి. చాలా కథలను బషీర్ ఉత్తమ పురుషలోనే రాశాడు. కొన్ని కథలలో తానే కథకుడుగా వుంటాడు. అందువలన తన ప్రాపంచిక ధృక్పధాన్ని గురించి పాఠకులకు నిర్దిష్టమైన అవగాహన కలుగుతుంది. "పాతుమ్మా మేక"లో కూడా రచయితను కథకుణ్ణి వేరుచేయటం సాధ్యం కాదు. బషీర్ తన కథలలో పాత్రలన్నింటిని రోజువారీ జీవితం నుంచి గ్రహించాడు. అంత మాత్రం చేత అవి మూసలు కావు. తన పాత్రలను రక్తమాంసాలతో సజీవ వ్యక్తులలాగా మలిచాడు. ఆ పాత్రలన్నీ మనుషులకువుండే అన్ని అనుభూతుల సమాహారంగా కనిపిస్తాయి. సాహిత్యం వాస్తవికతను ప్రవచించినప్పటికీ అవి అర్ధంలో ప్రతిబింబంలాగా వుండదు. సాహిత్య ప్రతిఫలనంలో కళ ఒక కొత్తరూపాన్ని పొందుతుంది. ఇది సాధారణ వాస్తవికత నుంచి భిన్నంగా వుంటుంది. దీనిపట్ల బషీర్‌కు పూర్తి స్థాయి అవగాహనవుంది. అందువలననే అతని కథలు చాలా సాదాసీదా అంశాలుగా అసాధారణాంశాలుగా కనిపిస్తాయి. ఈ అసాధారణ అంశం బషీర్‌కథలను పాఠకులకు దగ్గర చేస్తుంది.

పరిచిత ప్రాంతాలను వాటి భౌగోళిక స్వరూపాలను బషీర్ తన కథలలో నిరంతరం ప్రస్థావిస్తుంటారు. అందువలననే ఎర్నాకులం, ఎడపాల్ రైల్వేస్టేషన్, కాలికట్ సబ్ జైల్, వైకం, తలయార పెరంబో లాంటి ప్రాంతాలు బషీర్ కథల్లో పునర్నిర్మింపబడుతూ వుంటాయి. సాహిత్యం ఎంత విశ్వజనీన మైనప్పటికీ సారాంశంలో అది అత్యంత ప్రాంతీయంగా వుంటుంది. అలా వున్నప్పుడు మాత్రమే అది పాఠకుల్ని కదిలించగలుగుతుంది.

పరిచిత ప్రాంతాలను వాటి భౌగోళిక స్వరూపాలను బషీర్ తన కథలలో నిరంతరం ప్రస్థావిస్తుంటారు. అందువలననే ఎర్నాకులం, ఎడపాల్ రైల్వేస్టేషన్, కాలికట్ సబ్ జైల్, వైకం, తలయార పెరంబో లాంటి ప్రాంతాలు బషీర్ కథల్లో పునర్నిర్మింపబడుతూ వుంటాయి. సాహిత్యం ఎంత విశ్వజనీన మైనప్పటికీ సారాంశంలో అది అత్యంత ప్రాంతీయంగా వుంటుంది. అలా వున్నప్పుడు మాత్రమే అది పాఠకుల్ని కదిలించగలుగుతుంది. ప్రపంచంలో గొప్ప సాహిత్యం అనదగినదాన్ని దేనిని పరిశీలించినా ఈ విషయమే స్పష్టమవుతుంది. బషీర్ కూడా తన కథల్లో ఈ ప్రాంతీయతను విశ్వజనీనతతో మేళవించి చిత్రించాడు. ఉదాహరణకు తన చాలా కథలలో 'లైకమ్' అనే ప్రాంతాన్ని తిరిగి సృష్టించాడు. ఆ ప్రాంతంలోని సాధారణ ప్రజలు, వారి దారిద్ర్యం, వాళ్ళ ఆత్మిక సంక్షోభాలన్నీ కూడా ఆయన కథలలో ప్రతిఫలించాయి. ఆర్థిక సమస్యల వలన చెదిరిపోయిన మనసుల జీవితాల చిత్రీకరణ ఆయన కథలలో అడుగడుగునా కనిపిస్తుంది. తాను చిత్రించిన జీవితంలో వ్యక్తిగతంగా, ప్రత్యక్షంగా తాను అనుభవించిందే కావటం వలన ఆ చిత్రీకరణ అందరికీ ఆమోదకరంగానూ. అంగీకారయోగ్యంగానూ కనిపిస్తుంది.

బషీర్ కథలలో సార్వత్రిక అంశాలతోపాటు యదార్థ అంశాలు కలిసి వుండటం వలన అవి మిగతా భాషలలోకి అనువదింపబడినప్పుడు కూడా ఆయా భాషలలోని పాఠకుల అభిమానాన్ని చూరగొంటాయి. జీవితాన్ని దాని యదార్థ స్థితిలో పరిశీలించి, సృజనాత్మకంగా విశ్లేషించి చిత్రించటం వలననే వాటిని అనువాదాలలో ఎటువంటి అపసవ్యత లేకుండా తీసుకురావటానికి వీలుకలిగింది. ఎటువంటి భావోద్వేగాలకు లోనుగాకుండా జీవితాన్ని దాని మొరటు రూపంలో పరిశీలించి ఆ తర్వాత చిత్రీకరణకు పూనుకోవటం వలన ఆ కథలపై ఆయన స్వతంత్ర ముద్రతో పాటు విశిష్టమైన విశ్లేషణకూడా కనిపిస్తుంది. ఆయన తనకథలలో జీవితాన్ని కొంత సానపట్టి చిత్రించినప్పటికీ అందులో ఎటువంటి కృత్రిమత్వం కనిపించకపోవటం గమనార్హం.

ఏ రచయితకయినా తాను చిత్రిస్తున్న జీవితం పట్ల గౌరవం నమ్మకం కూడా వుండాలి. ఆ జీవితాన్ని జీవిస్తున్న పాత్రల పట్ల గౌరవం కూడా వుండాలి. ఈ లక్షణాలన్నీ బషీర్‌లో పుష్కలంగా వుండటం వలన ఆయన ఆధునిక భారత చరిత్రలో ఒక ప్రముఖుడిగా నిలబడగలిగాడు.

బషీర్‌కు తాను చిత్రించిన స్త్రీ పాత్రల పట్ల అచంచలమైన గౌరవం వుంది. (లవ్ లెటర్) 'ప్రేమలేఖ', 'బంగారు ఉంగరం' లాంటి కథలనుచూసినా ఈ విషయం అర్ధమవుతుంది. 'ప్రేమలేఖ' కథలో చాలా సందర్భాలలో బషీర్ స్త్రీలను 'ఖాళీ బుర్రలు' అని హేళనగా ప్రస్తావిస్తుంటాడు. అయితే ఈ ప్రస్తావనలన్నీ సారమ్మ పాత్ర సృష్టిలో ఆయన చూపించిన నైపుణ్యం, ఆ పాత్రకిచ్చిన వ్యక్తిత్వం మేధస్సు తార్కిక జ్ఞానం,

ప్రేమ లాంటి అంశాలు పరిగణనలోకి, తీసుకున్నపుడు బషీర్‌కు స్త్రీలపట్ల వున్న గౌరవం స్పష్టమవుతుంది. 'బంగారు ఉంగరం' కథలో కూడా భర్త తన భార్యను పనికిమాలినదని, తెలివి తక్కువదని అంటూ వుంటాడు. అయితే కథలో చాలా సందర్భాలలో ఆమె మేధస్సుముందు భర్త ఓడిపోతూ వుంటాడు. నిజానికి బషీర్ స్త్రీ పాత్రల రూపకల్పనలో వాటికి నిర్దిష్టమైన వ్యక్తిత్వాన్ని ఇవ్వటంలో తన కాలంకంటే ముందే వున్నాడు. స్త్రీ పురుష సంబంధాల గురించి ముఖ్యంగా బార్యాభర్తల సంబంధం గురించి లోతైన అవగాహన వుంది. అతని పాత్రలన్నీ సంప్రదాయ ముస్లిం కుటుంబాలనుంచీ వచ్చి నటువంటివి. ఇవి అప్పుడప్పుడు balance కోల్పోతుంటాయి. అయితే, కుటుంబ సంబంధాలను నిలుపుకొనేందుకు, అవి తమనుతాము సరిదిద్దు కుంటుంటాయి. బషీర్ రాసిన 'అమ్మ'లాంటి కథలో కూడా ఈ విషయాలను గమనించవచ్చు. ఈకథ స్వతంత్ర్యోద్యమంలో పాల్గొనటానికి వెళ్ళిన తన కొడుకు పట్ల తల్లికున్న ప్రేమను వ్యక్తం చేయటమేకాక ఆ కొడుకు కోసం ఆమె ఎదురు చూపుల్ని చిత్రించే క్రమంలో కథకుడు చాలా ఉచ్ఛస్థితికెళ్ళి చిత్రించటం కనిపిస్తుంది.

'గోడలు' అనే కథ బషీర్ రాసిన ఉత్తమ కథలలో ఒకటి. ప్రేమ అనే భావనను బషీర్ ఈ కథలో చాలా విస్తృతమైన అర్థంలో చూసిస్తాడు. నిజానికి ఎప్పుడూ కలవని ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడ్డ ప్రేమను చిత్రించిన కథ ఇదే కావచ్చు. ఈ ప్రేమికులు కలువకుండానే విడిపోయిన తర్వాత కూడా ఒకరి పట్ల ఒకరికున్న ప్రేమను కాపాడుకోవడం అనేది గమనించదగిన అంశం. ఈ ప్రేమికులిద్దరు ఒక పెద్ద గోడ చేత విడదీయబడ్డ ఇద్దరు ఖైదీలని తెలిసినపుడు, ఈ కవిపట్ల పాఠకులలో ఆసక్తి మరింతగా పెరుగుతుంది. తాము ప్రేమలో వున్నామన్న భావాన్ని కాపాడుకోడానికి తాము జైలు నుంచి బయటకు వెళ్ళి స్వేచ్ఛగావుండే అవకాశాన్ని కోల్పోవటానికి సిద్ధమవుతారు. ప్రేమలేని స్థితిలో స్వేచ్ఛ వారికి అవసరంగా అనిపించదు. కథకుడు ఈ కథలో గోడను ఒక రూపకంగా చూపించారు. ప్రతి రూపకానికి బహుళార్థాలుంటాయి. అలాగే ఈ కథకు కూడా.

ఈ లక్షణాల వల్లనే బషీర్ కథలలో, ఈ కథకి విశేషమైన పేరు వచ్చింది. పై పరిశీలన తర్వాత కథ వస్తు రూపాలలో, పాత్ర చిత్రీకరణలో ప్రాంతీయతను ప్రతిబింబించడంలో వ్యక్తుల జీవితాలను నడిపిస్తున్న ఆర్థిక అంశాల విశ్లేషణలో వ్యక్తిలోని ఔన్నత్యాన్ని పెంచటంలో ప్రేమకున్న ప్రాధాన్యతను ప్రతిబింబించడంలో బషీర్ చూపించిన ప్రతిభ అతన్ని ప్రపంచ కథా సాహిత్యంలో ఏ కథా రచయితకు తీసిపోని స్థాయిలో నిలబెట్టగలిగింది.

మి

## ఏద్వైతేనేం?

"పానుగంటి లక్ష్మీనరసింహంగారి దర్శనానికి ఒకరు వచ్చి, ఒక కాగితం ముక్క మీద తన పేరు వ్రాసి లోపలికి పంపారు. దానిమీద నాలుగు పొడి అక్షరాలున్నాయి – స.ప.స.సా. అని. లోపలికి రమ్మన్నారు ఆ పెద్దమనిషిని. వచ్చిన ఆసామిని చూడగానే "నువ్వటోయ్! సాంబయ్యా" అన్నారు ఆయన. "చిత్తం" అన్నాడు.

"ఈ పొడి అక్షరాల అర్థం ఏమిటోయ్?" అని ప్రశ్నించారు పానుగంటివారు. అతడు వినయంతో తల వంచుకొని, చిరునవ్వుతో సిగ్గుపడుతున్నట్లు – "సహజ పండిత సంపర సాంబయ్య" అని మనవి చేశాడు.

"ఈ బిరుదెవరిచ్చారోయ్?" అని పానుగంటివారు అడిగితే, "నేనే స్వయంగా తొడుక్కున్నది" అన్నాడు సాంబయ్య.

"అయితే సాంబయ్యా! ఇప్పుడు వైద్యం మానేశావా? ఏం జేస్తున్నావ్?"

"ఏదో కొంచెం కవిత్వం చెబుతున్నానండి"

"భేష్! ఏద్వైతేనం, నలుగుర్నీ చంపడానికి, కవిత్వ మైతేనేం? వైద్యమైతేనేం?" అని పానుగంటి వారన్నట్లు వినికిడి.

**- దేవులపల్లి కృష్ణశాస్త్రి.**

# చదవండి...




**✦ కృష్ణారెడ్డి గారి ఏనుగు :** ఏడుగురు వ్యక్తులు ఒకే భాష నుండి జ్ఞానపీఠ అవార్డును పొందటం కన్నడ భాషలోనే సాధ్యమైంది. అటువంటి 'బెళిద కన్నడ కస్తూరి' (కన్నడం కస్తూరి వంటిది) నుంచి ప్రశస్తమయిన రచనలను, శాఖమూరి రామగోపాల్‌గారు చేసిన తెలుగు అనువాద కథలివి. అనువాదం చేయటంలో రచయిత ఆయా కన్నడ రచయితల హృదయావిష్కరణను వీరు అర్థంచేసుకొని, రచన సాగటంలో ఇది ఎంతో హృద్యంగా అనువాద కథలలా అనిపించవు. మన చుట్టు పక్కల సాహిత్యంలో ఏమి జరుగుతుందో అక్కడ జరిగే ప్రయోగాలేమిటో మనం తప్పక తెలుసుకోవాలి. అప్పుడే వాటిని మించి ఎదిగే ప్రయత్నం చేస్తాం. అందుకోసమయినా యువ రచయితలు, అభిరుచి ఉన్నవారు తప్పక చదవవలసిన రచనలివి.




**✦ తెలుగు సాహిత్యంలో హాస్యోక్తులు :** పుంఖాను, పుంఖాలుగా వస్తున్న ముప్పల సుబ్బరామయ్యగారి సంకలనాల నుండి వచ్చిన మరో కానుకిది. హాస్యరచనలు, కొసమెరుపులు, రిపార్టీల పద్య, గద్య వైభవాల రచనా శకలాలివి. పదే పదే చదివింపజేసి మనల్ని నవ్వుల్లో ముంచివేసే హాస్య రత్నాకరణమిది.




**✦ బ్రాహ్మణ, బౌద్ధ, హిందూమతం :** లాల్‌మణి జోషి ఆంగ్ల రచనకు అన్నపరెడ్డి బుద్ధఘోషుని అనువాదం. బౌద్ధాన్ని బౌద్ధకోణం నుంచే చదవాలి, చారిత్రికకోణం నుంచి అధ్యయనం చేయాలి తప్ప దానిని హిందూమత కోణం నుంచి అధ్యయనం చేస్తే అది హిందూమత అధ్యయన మవుతుందంటూ చేసిన బ్రాహ్మణ, బౌద్ధ, హిందూమతాల విశ్లేషణ ఇది. బ్రహ్మ అన్న పదంమీద బ్రాహ్మణుల గుత్తాధిపత్యం లేదని, బుద్ధుని ధాతువుల సిద్ధాంతం ద్వారా అతని ఆలోచన సరళిపై ఉపనిషత్తుల ప్రభావం లేదని తొలి ఉపనిషత్తులే ఎంతోమేర బుద్ధుని బోధనలతో ప్రభావితమయ్యాయని సోపపత్తికంగా వివరణలు ఇచ్చారు రచయిత.




**✦ పుస్తకంలో నెమలీక :** బాల్యం ప్రధానంగా చోటు చేసుకున్న పసితనాల జాడను ఇతి వృత్తంగా తీసుకుని సాగిన కవితా సంపుటి. రచయిత ఓరుగంటి పురుషోత్తం సర్వీసు నుంచి రిటైరైన తరువాత కలం పట్టారు. అయినా పద చిత్రాల నిర్మాణంలో వస్తువు ఎంపికలో (ముఖ్యంగా చిన్న పిల్లల Kid nap పై వ్రాసిన బంగారు కోటలో చిన్నారి రాణి) చేయి తిరిగిన నైపుణ్యం కానవస్తుంది.




**✦ వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా :** భదంత ఆనంద కౌసల్యాయన్ హిందీరచనకు జె. లక్ష్మిరెడ్డి తెలుగుసేత. ఇందులో పుస్తకపు టైటిల్‌తో బాటుగా రామచరిత మానస్‌లో స్త్రీ, బ్రాహ్మణవాదం అంటూ మూడు వ్యాసాలున్నాయి. భారత సాంఘిక వ్యవస్థను పతనావస్థకు తీసుకు వెళ్ళిన వర్ణవ్యవస్థను బౌద్ధపరంగా, శాస్త్రీయంగాఖండిస్తూ సాగించిన విశ్లేషణ ఇది.

**✦ గజల్ సౌందర్య దర్శనం :** ప్రేమలో కోమల విషాదాన్ని పలికించే మధుర జ్ఞాపకమైన గజల్ రచనలకు వీరాభిమానయిన పెన్నా శివరామకృష్ణ రచన యిది. ఇందులో గజల్స్‌తో

బాటుగా రుబాయీలు, నజమ్‌లు, గాలిబ్, దాగ్ వంటి కవులు, జేబున్నిసా (ఔరంగజేబు కుమార్తె), మీనాకుమారి (హిందీ నటీమణి), బేగం అక్తర్‌ల గురించి పరిచయ వాక్యాలున్నాయి. గజల్‌లోని హృదయ స్పందనను, సార్వజనీనతను, సార్వకాలితను ఎంతో ఆర్ద్రతతో రచయిత పాఠకుల ముందుంచారు.

❖ **అభ్యర్థన :** పాలతీర్థపు లక్ష్మణమూర్తిగారు తమ అంతర్మథనము నుండి పెల్లుబికి వచ్చిన శాంభవీ మాతకు వారు చేసిన అభ్యర్థనల పద్య సంపుటి ఈ ఖండకావ్యం. ఇందులో కొన్ని నిందాస్తుతి పద్యాలున్నాయి.

❖ **ఆచార్య నాగార్జున :** చిత్రరచన వృత్తిగా, రచన ప్రవృత్తిగా, సిద్ధ ఆయుర్వేదంలో విశేష కృషిచేసిన గెనిసెట్టి ఈ పుస్తక రచయిత. కొంతకాలం వీరు మద్రాసు సినీరంగంలో బాపూ, కమలాకర కామేశ్వరరావుల వద్ద సహాయ దర్శకులుగా పనిచేశారు. అంతేకాక ఆచార్య ఆత్రేయవద్ద సహాయ రచయితగా పనిచేసిన అనుభవం ఉంది. అందుచేతనే ఈ రచన కొంత కావ్యసరళిలో, కొంత నాటకీయంగా (డైలాగులుగా) సాగి ఒక మంచి సినిమా స్క్రిప్ట్ చదివిన అనుభూతిని మిగులుస్తుంది.

❖ **రజనీ భావతరంగాలు :** బహుముఖ ప్రజ్ఞాశాలి, గేయరచయిత, గాయకుడు, సంగీత కారుడయిన బాలాంత్రపు రజనీకాంతారావు గారి యేడు దశాబ్దాల జ్ఞాపకాల పందిరిది. కాళిదాస, అన్నమయ్య నుండి రవీంద్రుని వరకు, ఆంధ్రిరాగం నుండి జోతిష్యంవరకు చేసిన విశ్లేషణా విహంగాలు. రజనీ అభిమానులకిదొక అరుదైన కానుక.

❖ **రెక్కలు :** సుగమ్‌బాబు కవితలు – వేదనాజనితం, సృజన... అంటూ 'ఏదీ ఊహించి రాయలేదు, చూసే రాశాను. అనుభవించే రాశాను' అని యెద ఎత్తి చెప్పగలిగిన రచయిత. 'నేను గ్రీష్మాన్ని / వర్షాన్ని / హేమంతాన్ని / శిశిరాన్ని / చివరిలో ఔను నేనే వసంతాన్ని' అని చెప్పుకోగలిగిన చేవగలిగినవాడు. 'ఎండమావులో / అన్వేషణ' ఎందుకని వాక్యాన్ని ముగిస్తాడు. ఈ రెక్కలకు ఆకుపచ్చ రంగు పూయకుండా ఉంటే మరింత పచ్చగా ఉండేది. ఇట్లాంటి చాలా మెరుపులున్నాయి.

'అంతరించని తోక / అహం', 'మరణ బీజం / జన్మ'
'తరాల ఆస్తి / దుఃఖం' నిజాలు నిష్టూరంగా వుంటాయి!
ఇవి హైకూలు కావు–నానీలూ కావు. మరి సుగమాలందామా?

❖ **డా॥ జి.వి. కృష్ణరావు సాహితీ కదంబం :** తెలుగుభాష యొక్క సంస్కృతీ వికాసాలను ప్రోత్సహించాలనే సంకల్పంతో స్థాపింపబడిన సి.పి. బ్రౌన్ అకాడమీనుంచి వచ్చిన పుస్తకం "డా॥ జి.వి. కృష్ణరావు సాహితీ కదంబం." మార్క్సిస్టు, బౌద్ధమత అధ్యయని, సత్యాన్వేషి అయిన జి.వి.కె. ఒక కవిగానో, రచయితగానో, ఉపన్యాసకుడుగానో, విమర్శకుడిగానో, ఏ ఒక్కదానికీ కెటాయించబడి, గౌరవించబడడానికి లొంగనంత విస్తృతి కలిగిన ప్రజ్ఞాశాలి. వారు 1935, 37, 43 సం॥లలో వ్రాసిన కొన్ని ఖండికలు, కొన్ని పరిశోధనా రచనలు, నాటకాలు, కథలు, కళాపూర్ణోదయంపై ఇంగ్లీషులో వ్రాసిన సిద్ధాంత గ్రంథాల కావ్యజగత్తు ఈ పుస్తకం. తత్వవివేచనలకు భూమికయిన ఈ సంకలనం జి.ఆర్. కె. మూర్తి. చేశారు.

❖ **బహుమతి కథలు 2009 :** బ్రౌన్ అకాడమీ నుంచి వచ్చిన మరొక కానుక 'బహుమతి కథలు – 2009.' ఆ సంవత్సరం అకాడమీవారు స్వాతి వారపత్రికతో సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలకు వచ్చిన కథలలో బహుమతి పొందిన వాటితో (బహుమతుల మొత్తం విలువ రెండు లక్షలు) పాటు ఎన్నిక చేసిన కొన్ని మంచి కథల (బొమ్మలతో సహితం) సంపుటి. కథా సాహిత్యం అంటే ఇష్టపడేవారు తప్పక చదవ వలసిన పుస్తకమిది. ఇందులో కథలు ఏ ఇజానికి ముడిపెట్టబడక కేవలం మానవత్వం, మానవసంబంధాలు ఇతివృత్తంగా కలవి.

❖ **పింగళి లక్ష్మీకాంతం :** పింగళి లక్ష్మీకాంతంగారు చెళ్ళపిళ్లవారి శిష్యులు, అవధానాలు చేశారు. కాటూరి వెంకటేశ్వరరావుగారితో కలసి జంటకవిత్వం చెప్పారు. వారి 'తొలకరి' ఖండ కావ్యం తెలుగు సాహిత్యంలో ఒక మణిహారం. ఆంధ్రయూనివర్సిటీలో రీడర్‌గా, వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరుగా, విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో ప్రసంగాల విభాగంలో ప్రయోక్తగా పనిచేశారు. ఆయన జీవితచరిత్రను మొదటి 9 అధ్యాయాలలో, మిగిలిన అధ్యాయాలలో ఆయన మూర్తిత్వం, రచనాశైలీ, రాగద్వేషాలు, వారికి లభించిన గౌరవాలు, వారిపై వచ్చిన విమర్శలను వీలయినంత నిజాయితీగా మనముందుంచారు వారి కుమారులయిన పింగళి సూర్యసుందరంగారు. ఇది బ్రౌన్ అకాడమీ ప్రచురణ. మి

# పిల్లి నడకలు!

"సోదరీమణులారా! ఏదైన నొక్క యుపన్యాసమిమ్మని మీరు నన్ను గోరగ వచ్చితిని. ప్రపంచమున నే వస్తువైనను మీ తరువాతదే. కావున మిమ్ము గురించియే చెప్పెదను. ఇరువది ముప్పది సంవత్సరముల క్రిందట మరియొక్క యూరిలో నేనొక్క యాంధ్రకాంతా సమూహమును జూచితిని. ఆహా! కలువల వనము - ముత్యాల జాలరు - మెరుపుతీగల గుంపు - కన్నుల వైకుంఠము! ఎందఱ సోదరీమణుల నొక్కసారి - కంటి జిలజిలతో, నొదలి మిళమిళలతో, ఒంటి మెలమెలలతో - మోము కలకలలతో - గాజుల గలగలలతో - రంగు బట్టల ఫెళఫెళలతో - గాంతి తరంగముల జలజలలతో - నొడలంతయు నొక్కటే కన్నయినట్లు, ఆ కన్నంతయు నొక్కటే మనస్సయినట్లు, ఆ మనస్సంతయు నానంద స్వరూపమైనట్లు చూచుట సిద్ధించినది! స్త్రీలకంటె జూడదగిన పదార్థములు - జగతియందెచ్చటనైన గలవా? మగువలే లేనియెడల నింక జగతి యేమి? పూవులు లేని తోట - మణులు లేని గని - చుక్కలు లేని యాకాసము - ప్రాణములేని శరీరము, అప్పటి స్త్రీల చక్కదనము రవంత చెప్పెదను. బంగారము వారి తనులతల నాశ్రయించి పద్మ సౌరభ సమన్వితమైనట్లగపడినది. వజ్రములు కెంపులు వారి కర్ణముల నాశ్రయించి జీవకళచే జిత్రవిచిత్రముగ జిగజిగ లాడినవి. చెట్టు సంపెంగలు వారి జారు కొప్పులలో జేరి బంభరజుంబన పరామర్శతల నొందినవి. లత్తుక వారి సహజారుణ పద ద్వంద్వ సేవ నొనర్చి ధన్యమై తరించినది. మౌక్తికములు వారి నాసాగ్రములజేరి దంత శోభా మందహాసాంకురములచే ద్విగుణీకృత తేజస్కములై వెలుగొందినవి. సూర్యచంద్రులు - వారి ముంగురులే మహాభాగ్యములని యటజేరి, తమకంటె దేజస్వంతములై సుప్రసన్నములైన వారి మొగమునకు సేవ యొనర్చుచుండిరి.

ఇప్పుడా నీలపు బంతుల కొప్పులేవి? కొప్పులలో దేవపూజా నిర్మాల్యములగు పూవుల ముడుపులేవి? మహనీయకాంతి సముజ్జ్వలములైన మగువల మొగములకు మంగళపుటారతులిచ్చు మణి ఖచిత కర్ణతాటంకములేవి? సుధాబిందు సుందరములగు ముత్తెములు గల యడ్డబాసలేవి? ముంగరలేవి? పాదముల పారాణి పూతలేవి? ఏమియు లేవు. కొప్పులకు బదులుగా నిప్పుడు జడచుట్టలవతరించినవి. జారీ చెంబులవలె - జంతికల చుట్టవలె - చిలుక కొయ్యల దగిలించిన చుట్టకుదుళ్ల వలె - సంక్రాంతి పిడుతలవలె-దూదేకుల బస్తాలవలె-బద్మవ్యూహములవలె - నీగలున్న తేనెపట్టువలె-జడలు వింతవింత యల్లికలు గలవై వెర్రి వెర్రి యాకారముల గలవై యున్నవి. ఆహా! పుష్పములు చేసికొన్న మహాదృష్టముతో మీరు చేసుకున్న దురదృష్టమంతకంటె నెక్కువది కదా! వసంతుడిచ్చిన ప్రసవములకంటె ఫ్రాన్సువారి ప్రసవా లెక్కువ సౌరభవంతములని ధరించితిరా? శోభావంతములని ధరించితిరా? జగతీనాథుని సృష్టిలోని పుష్పములు జర్మనీవారి కృత్రిమ కుసుమముల సాటినైనను గాకపోయెనా? ఆహా! మీ కర్ణములు అలంకార శోభా దరిద్రాణములై యున్నవే! చిన్నమెత్తు సువర్ణము లేదు. చీమ తలయంత ముత్తెములేదు. మీలో గొందరకు మెరుగు బిళ్లలు మాత్రమున్నట్లున్నవి. మిగిలిన వారికిట్లయిన నున్నవో లేవో తెలియదు. ఇక మీ నాసికలు స్వభావోక్త కవిత్వమువలె నున్నట్లున్నవి. అడ్డు బాసలంతరించినవి. ముక్కుపుడకలు మూలబడినవి. ముంగరలు మోటులై మూసలో బడినవి. ఈ దుస్తులతో, నీ పటాటోపములతో, నీ పటకాలతో, నీ పింజలతో, నీ ముడుతలతో, నీ వెనుక ముందెత్తుల పొంకములతో, మీరు దొరసానులమైతి మనుకొనుచున్నారు కాబోలు! మీ యనుకరణనమును గాంచి-మీ నటనమును జూచి-మీ యభినయము నవలోకించి-యాంగ్లేయ సీమంతులెంత నవ్వుచున్నారో మీరెరుగుదురా? మీ తల్లులు ధరించిన-మీ యమ్మమ్మలు ధరించిన మీ పూర్వులగు నరుంధతీ, చంద్రమత్యాది మహాపతివ్రతలు ధరించినట్లు చెప్పబడిన-మన దేశమున కనువైన -గాలి తాకుటకనువయిన-కట్టుకొనుటకు మిగుల సులువైన- వమ్మి బాధకలుగగనే యూడదీయుట కంతకంటె సులువైన- వంశానుక్రమముగా జిరకాలాగతములైన మన దుస్తులను-వాని విలువ నెరుగక-వాని ఉపయోగమును దెలియజాలక-వాని సౌందర్యము గుర్తెరుగక-తృణప్రాయముగా విసర్జించినారు. మంచి రూపములు చెడినవి. మారురూపముల రాలేదు. మధ్యమున నందున కిందులకు జెడి వ్రేలాడుచున్నారు. ఆహాహా ఆ బొత్తముల వరుసలేమి? ఈ గుండుసూదుల ముండ్ల కంపలేమి? ఆ పక్క మంగలిపాదుల మూతులలో గొలుకులేమి? అయ్యయ్యో! ఈ వేషములేమి? ఆ మొగముల మీద శారదాభ్రశకములవలె దుప్పికి వలె శ్వేతపు డాగులేమి?"

– జంఘాలశాస్త్రి

(పానుగంటి లక్ష్మీనరసింహారావు)

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

| | | | |
|---|---|---|---|
| **I.** | **మిసిమి ప్రచురణలు** | | ₹ |
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు | " " | 200.00 |
| 5 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 6. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 7. | అమాహ | " " | 60.00 |
| 8. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 9. | సిద్ధార్థ | " " | 50.00 |
| 10 | నాలో నేను | " " | 30.00 |
| 11. | కథాంజలి-1 | ఎస్సారె | 80.00 |
| 12. | కథాంజలి-2 | " " | 110.00 |
| 13. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 14. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 15. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 16. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| **II.** | **వేమన ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | | 25.00 |
| **III.** | **ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | | 75.00 |
| 3. | మిళిందపన్హ : ఉపమలు - *బోధ చైతన్య* | | 75.00 |
| 4. | మహా పరిత్తం - *బోధ చైతన్య* | | 100.00 |
| 5. | జాతక కథలు - *శివశంకర స్వామి* | | 60.00 |
| **IV.** | **ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు** | | |
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | | 40.00 |

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/- తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ........................................

**2. చిరునామా :**

ఇం.నెం. ........................................

వీథి ........................................

పేట ........................................

ఊరు ........................................

పిన్ ........................................

సెల్ ........................................

**3. సంతకం :** ........................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



వస్తాడు నా రాజు (యాసాల బాలయ్య)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



అందంగా లేనా (బి.ఎ.రెడ్డి)